
: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

తాడేపల్లిగూడెం
17-10-2025 శుక్రవారం
సంపుటి: 31 సంచిక: 256
పేజీలు: 10+4 వెల: 6.50


గురువారం శ్రీశైల మల్లన్న దేవస్థానంలో ధ్వజస్తంభం వద్ద మొక్కుతున్న ప్రధాని మోడీ

# స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్


గురువారం కర్నూలులో జరిగిన 'సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్' బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, అసంఖ్యాకంగా పాల్గొన్న ప్రజలు

## గూగుల్‌తో ప్రపంచమంతా ఎపివైపు చూస్తోంది..

### చంద్రబాబు, పవన్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి

### లోకేష్ సారధ్యంలో పండుగలా జిఎస్టీ సంస్కరణల ప్రచారం

### కర్నూలులో 'సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్' బహిరంగ సభలో ప్రధాని మోడీ

### రూ. 13,429 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ప్రధాని

**కర్నూలు, అక్టోబర్ 16 ప్రభాతవార్త బ్యూరో:** వికసిత్ ఎపితోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుందని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే జిఎస్‌టి సంస్కరణలకు సార్థకత చేకూరుతుందని స్పష్టం చేశారు. వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటివి సాకారం కావడంలో ఎపి కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ఎపి యువత ఎంతో చైతన్య కలిగిన వారని.. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వంటి వారి నేతృత్వంలో ఎపి అభివృద్ధి పథంలో వెళ్తోందని.. కేంద్రం కూడా పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సహకరిస్తుందని ప్రధాని చెప్పారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గురువారం నన్నూరు చెక్ పోస్ట్ సమీపంలో జరిగింది. శ్రీశైలంలో మల్లిఖార్జున స్వామి వారిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అనంతరం ప్రధాని కర్నూలు చేరుకున్నారు. కర్నూలులో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ జిఎస్‌టి బచత్ ఉత్సవ్‌పై ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికకు చేరుకున్న ప్రధానికి మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా వచ్చిన ముగ్గురు నేతలకు భారత్ మాతాకీ జై అంటూ మువ్వెన్నల >>2

## డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రానికి డబుల్ బెనిఫిట్

### సూపర్ సిక్స్ పథకాలతో వడివడిగా అభివృద్ధి: సిఎం చంద్రబాబు

**కర్నూలు, అక్టోబర్ 16, ప్రభాతవార్త :** కేంద్రంలో మరియు రాష్ట్రంలో ఎన్డీఎ డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల ఆంధ్రప్రదేశ్‌కు రెట్టింపు ప్రయోజనాలు లభిస్తున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కర్నూలులో జరిగిన సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. 'ఒకే దేశం-ఒకే పన్ను-ఒకే మార్కెట్' విధానంతో అమలులోకి వచ్చిన జిఎస్టీ 2.0 ద్వారా 99 శాతం వస్తువులు సున్నా, 5 శాతం శ్లాబ్‌ల పరిధిలో ఉన్నాయని తెలిపారు. జిఎస్టీ పన్ను తగ్గింపుతో నిత్యావసరాల >>2



## కర్మయోగి మోడీ: డిసిఎం పవన్

**కర్నూలు, అక్టోబరు 16, ప్రభాత వార్త :** స్వార్థం లేని ప్రజా సేవకుడు నరేంద్ర మోడీ అని పవన్ కల్యాణ్ ప్రధానిని కొనియాడారు సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో డి.సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దేశ సేవే పరమావధిగా ప్రజలకు సేవ చేస్తున్న ప్రధాని మోడీ నిజమైన కర్మయోగి అని పేర్కొన్నారు. ఆయన కేవలం ప్రభుత్వాన్ని నడిపే నేతగానే కాకుండా, భవిష్యత్ రెండు మూడు తరాల ప్రజలకు దిశానిర్దేశం చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఆత్మనిర్భర్ భారత్ ద్వారా దేశాన్ని ప్రపంచ పటంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టారని తెలిపారు. గూగుల్ వంటి అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులు దేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావడం మోడీ దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. జిఎస్టీ 2.0 సంస్కరణలతో పేదలు, సామాన్యులకు భారీగా ప్రయోజనం కలుగుతోందని, జీవిత, ఆరోగ్య భీమా సహా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడం వల్ల ప్రజలు ఆదా చేసుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కనీసం 15 సంవత్సరాలపాటు కొనసాగాలని, పెట్టుబడులు మరియు పరిశ్రమల నమ్మకాన్ని దెబ్బతీయకుండా స్థిరమైన ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు కూటమి సంకల్పబద్ధంగా పని చేస్తుందని పవన్ స్పష్టం చేశారు.



## జిఎస్‌టి సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు రూ. 8వేల కోట్ల లబ్ధి

### ఎపికి అన్నివిధాలా ప్రధాని మోడీ సహకారం

2లో

డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు: మంత్రి లోకేష్





గురువారం కర్నూలు సభలో ప్రధాని మోడీని సత్కరిస్తున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉన్నారు

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రధాని మోడీ

## 'సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్' బహిరంగ సభ నుంచి వర్చువల్ గా ఐదు పనులకు శంకుస్థాపనలు, 8 ప్రాజెక్టుల ప్రారంభోత్సవం

## రెండు ప్రాజెక్టులు జాతికి అంకితం

**కర్నూలు, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ వేదిక నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మొత్తం రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి రూ.9,449 కోట్ల విలువైన ఐదు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయగా, రూ.1,704 కోట్ల విలువైన ఎనిమిది ప్రాజెక్టులను ప్రారంభించారు. అదనంగా రూ.2,276 కోట్ల విలువైన రెండు ప్రధాన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులు: విద్యుత్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ - రూ.2,886 కోట్లు, ఓర్వకల్లు-కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ - రూ.4,922 కోట్లు, కొత్త వలస-విజయనగరం మధ్య 4వ లైన్ - రూ.493 కోట్లు, పెందుర్తి-సింహాచలం నార్త్ రైల్వే ఫ్లైఓవర్ లైన్ - రూ.184 కోట్లు, సబ్బవరం-షీలానగర్ జాతీయ రహదారి - రూ.964 కోట్లు. **ప్రారంభించిన ప్రాజెక్టులు:** రేణిగుంట-కడప-మదనపల్లె రోడ్డు - రూ.82 కోట్లు, కడప-నెల్లూరు-చునియంపల్లి రోడ్డు - రూ.286 కోట్లు, కనిగిరి బైపాస్ రోడ్డు - రూ.70 కోట్లు, గుడివాడ-నూజెండ్ల వద్ద నాలుగు లేన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జ్ - రూ.98 కోట్లు, కల్యాణదుర్గం-రాయదుర్గం-మొలకలమూరు రోడ్డు - రూ.13 కోట్లు, పీలేరు-కలసూర్ నాలుగు లేన్ల రోడ్డు - రూ.593 కోట్లు, నిమ్మకూరు తీనిలిలో నైట్ విజన్ గ్లాసుల ఉత్పత్తి కేంద్రం - రూ.362 కోట్లు, చిత్తూరు ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్ - రూ.200 కోట్లు. **జాతికి అంకితం చేసిన ప్రాజెక్టులు:** కొత్తవలస-కోరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులు - రూ.546 కోట్లు, శ్రీకాకుళం-అంగుల్ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ - రూ.1,730 కోట్లు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, రవాణా, శక్తి రంగాల అభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్

>> జెండాలతో ప్రజలు స్వాగతం పలికారు.
బహిరంగ సభలో జీఎస్టి సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ..."ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం, యువత ఎంతో చైతన్యవంతులు. ఎపిలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. గత 16 నెలల్లో డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఎపిలో ప్రగతి వేగంగా జరుగుతోంది. ఢిల్లీ, అమరావతిలు రెండూ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తున్నాయి. దేశ ఆర్థిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ఓ కీలక ప్రాంతంగా ఉంది. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా నడుస్తోంది. భారత్ దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి వేగాన్ని ప్రపంచం గమనిస్తోంది. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజం ఎపిలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించింది. దేశపు తొలి అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమెరికా వెలుపల భారీ పెట్టుబడితో ఎపిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ పెడుతున్నట్టు గూగుల్ సిఇఒ నాతో చెప్పారు. డేటా సెంటర్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ లాంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఈ కేంద్రంలో ఏర్పాటు కాబోతున్నాయి. ప్రపంచ దేశాలను కలుపుతూ వేయనున్న సబ్ సీ కేబుల్ ద్వారా తూర్పు తీరం బలోపేతం అవుతుంది. విశాఖలో ఏర్పాటు కానున్న కనెక్టివిటీ హబ్ భారత్ కే కాదు ప్రపంచానికి సేవలందిస్తుంది. ఈ విషయంలో సిఎం చంద్రబాబు విజన్‌ను అభినందిస్తున్నాను. 21వ శతాబ్దపు మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారత్ ఉత్పత్తి కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ఆత్మనిర్భర్ భారత్‌లో ఎపి కీలకంగా మారింది." అని ప్రధాని అన్నారు.

**ఆంధ్రప్రదేశ్ ప్రగతిని కాంగ్రెస్ నాశనం చేసింది**

కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ ప్రగతిని నాశనం చేశాయి. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఎపి ప్రగతి ద్వారాలు తెరుచుకుని వేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. దేశ ప్రగతికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చాలా కీలకం. రాయలసీమ అభివృద్ధితోనే ఎపి అభివృద్ధి ఉంది. కర్నూలులో ప్రారంభించిన ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంత ప్రగతికి సరికొత్త ద్వారాలు తెరుస్తాయి. పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఎపి వేగవంతమైన అభివృద్ధి కోసం కొప్పర్తి ఓర్వకల్ పారిశ్రామిక నోడ్‌ల ద్వారా వచ్చే పెట్టుబడులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాయలసీమలోని ప్రతి జిల్లాలోనూ ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. ఆత్మనిర్భర్ భారత్‌కు సరికొత్త శక్తిగా ఎపి తయారవుతోంది. కృష్ణా జిల్లా నిమ్మకూరులో రక్షణ రంగానికి చెందిన నైట్ విజన్ గాగుల్స్, క్షి పణుల సెన్సార్లు, డ్రోన్ గార్డులను తయారు చేసే సంస్థ ఏర్పాటు కావడం ముదావహం. రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతులు కూడా చేసేందుకు ఆస్కారం ఇస్తుంది. ఆపరేషన్ సింధూర్‌లో దేశంలో తయారైన ఉత్పత్తుల బలం ఏమిటో చూశాం. కర్నూలును భారత్ డ్రోన్ హబ్ తయారు చేయాలని ఎపి ప్రభుత్వం నిర్ణయించటం సంతోషం. ఆపరేషన్ సింధూర్ ద్వారా డ్రోన్ల పనితీరు ఏమిటో తెలియచెప్పింది. డ్రోన్ల తయారీ ద్వారా కర్నూలు భారత్‌కు ఓ గర్వకారణంగా నిలుస్తుంది." అని ప్రధాన మంత్రి చెప్పారు.

**ప్రారంభించిన ప్రాజెక్టులు ప్రగతికి మార్గాలు**

ఈ ప్రాజెక్టులన్నీ రాష్ట్రంలో కనెక్టివిటీ బలోపేతం కావటంతో పాటు పరిశ్రమలను బలోపేతం చేస్తాయి. ఈ ప్రాజెక్టులతో కర్నూలుతో పాటు పరిసర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది. దేశానికైనా, రాష్ట్రానికైనా ఇంధన భద్రత అవసరం. ప్రస్తుతం 3 వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టులను ప్రారంభించాం. తద్వారా దేశ ఇంధన సామర్థం పెరుగుతుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బ్లాక్ అవుట్ లాంటి విద్యుత్ సంక్షోభాలు వచ్చాయి. తలసరి విద్యుత్ వినియోగం 1000 యూనిట్ల కంటే తక్కువే ఉంది. చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూడా లేని పరిస్థితి. ఇప్పుడు క్లీన్ ఎనర్జీ నుంచి మన అవసరాలకు తగినంత ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తున్నాం. 1400 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఇప్పుడు దేశంలో ఉంది. తగినంత విద్యుత్ దేశ ప్రజలకు లభ్యం అవుతోంది. శ్రీకాకుళం నుంచి అంగుల్ వరకూ గ్యాస్ పైప్ లైన్‌ను జాతికి అంకితం చేశాం. 20 వేల సిలెండర్ల సామర్థ్యంతో ఇండేన్ బాటిలింగ్ ప్లాంట్‌ను చిత్తూరులో ప్రారంభించాం. మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులతో కనెక్టివిటీ పెంచుతున్నాం. సబ్బవరం నుంచి షీలా నగర్ వరకూ కొత్త హైవేతో కనెక్టివిటీ పెరిగింది. రైల్వే రంగంలో కొత్త యుగం ప్రారంభమైంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రాజెక్టులను ప్రారంభించుకున్నాం. స్వాతంత్రం సాధించి వందేళ్ల పూర్తైన 2047 నాటికి దేశం వికసిత్ భారత్‌గా తయారవుతుంది. వికసిత్ భారత్ 2047 సాధన సంకల్పానికి స్వర్ణాంధ్ర లక్ష్యం మరింత బలం అందిస్తుంది." అని మోడీ వెల్లడించారు.

**ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం**

పౌరులకు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనేది ఎన్డీయే ప్రభుత్వ నినాదం. ఈజ్ ఆఫ్ లివింగ్ అనే అధ్యాయం దేశంలో ప్రారంభమైంది. ప్రజల జీవితాలను సులభతరం చేసే సంకల్పంతో ఎన్డీయే పని చేస్తోంది. 12 లక్షల ఆదాయం ఉన్న ప్రతీ ఒక్కరికి పన్ను లేకుండా చేశాం. వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్ లాంటి సదుపాయాలు కల్పిస్తున్నాం. సరిగ్గా నవరాత్రి ముందు జీఎస్టి సంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చాం. ప్రజలపై పన్నుల భారం తొలగించాం. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జీఎస్టి పొదుపు ఉత్సవాన్ని పండుగలా చేసుకున్నారు. సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ పేరిట కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయం. ఈ జీఎస్టి సంస్కరణల వల్ల రూ.8 వేల కోట్ల మేర ప్రజలకు ఆదా అవటం సంతోషం. కానీ ఆ ప్రయోజనాలు అందరికీ అందాల్సి ఉంది... అప్పుడే అది సఫలమైనట్టు. 21వ శతాబ్దం భారత దేశానిది, 140 కోట్ల మంది భారతీయులది." అని ప్రధాని చెప్పారు.

**శ్రీశైల దర్శనం ఆనందాన్నిచ్చింది**

ఢిల్లీ నుంచి నుంచి నేరుగా కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి ఎపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సహా... వివిధ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. కర్నూలు ఎయిర్ పోర్టు నుంచి సిఎం, డిప్యూటీ సిఎంలతో కలిసి శ్రీశైల దేవస్థానానికి హెలీకాప్టరులో వెళ్లారు. దేవస్థానంలో కొలువైన శ్రీశైల భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి వార్లను ప్రధాని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల క్షేత్రం విశేషాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రధానికి వేదశీర్వాచనాలిచ్చి... తీర్థ ప్రసాదాలు అందించారు. ఆ తర్వాత ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని ప్రధాని సహా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సందర్శించారు. అక్కడున్న శిల్పాలను, చిత్రపటాల్లోని విశేషాలను ప్రధానికి నిర్వాహకులు వివరించారు. అనంతరం భ్రమరాంబిక గెస్ట్ హౌసులో ప్రధాని భోజన విరామం తీసుకున్నారు. ఆ తర్వాత హెలీకాప్టర్ ద్వారా కర్నూలులో సూపర్ సేవింగ్స్ సూపర్ జీఎస్టి బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన స్కూలు విద్యార్థులు అందించిన చిత్రపటాన్ని ప్రధాని అందుకున్నారు. రాయలసీమ ప్రాంతంలో కొలువైన అహోబిలం నర్సింహస్వామి, మహా నందీశ్వరుడు, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ప్రాశస్త్యాన్ని ప్రధాని తన ప్రసంగంలో గుర్తు చేసుకున్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో తొలి జ్యోతిర్లింగం ఉన్న సోమనాథ్ ఆలయం ఉన్న గుజరాత్‌లో తాను జన్మించానని.. విశ్వనాధుడి భూమి వారణాసిలో సేవచేసే అవకాశం దక్కిందని అన్నారు. రెండో జ్యోతిర్లింగం శ్రీశైల మల్లిఖార్జున స్వామిదని.. ఇప్పుడు శ్రీశైలం వచ్చి మల్లిఖార్జున స్వామి వారి ఆశీర్వచనాలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని కూడా దర్శించానని ఛత్రపతి శివాజీ, అల్లమ్మ ప్రభు, అక్కమహాదేవి లాంటి శివభక్తులకు ప్రణామాలు తెలిపారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి లాంటి ధీరులకు నమస్కారం చేస్తున్నానని ప్రధాని అన్నారు. ఈ సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సహా పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జీఎస్‌టి సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు రూ. 8వేల కోట్ల లబ్ధి

## కర్నూలు సభలో మంత్రి నారా లోకేష్



గురువారం కర్నూలు సభలో ప్రధాని మోడీతో కరచాలనం చేస్తున్న మంత్రి లోకేష్

**కర్నూలు, అక్టోబరు 16 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ అన్నా, ఇక్కడి ప్రజలు అన్నా ప్రధాని మోడీకి అపారమైన ప్రేమ. 16నెలల్లో నాలుగుసార్లు రాష్ట్రానికి వచ్చారు, మనం అడిగిన అన్ని కోరికలు తీరుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో నంబర్ 1 కావాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. గుజరాత్‌లో ప్రభుత్వ కొనసాగింపు వల్లే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సూపర్ జీఎస్‌టి సూపర్ సేవింగ్స్ వేడుకల్లో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు చెక్ పోస్టు సమీపంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ... స్థిరమైన అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వ కొనసాగింపు అనేది ముఖ్యం. ప్రధాని నరేంద్ర మోడీ వరుసగా మూడుసార్లు ప్రధాని కావడం వల్లే ప్రపంచంలో 10నుంచి 4వ అతి పెద్ద ఎకానమీగా అభివృద్ధి చెందింది. సంక్షేమం -అభివృద్ధి ప్రజా ప్రభుత్వానికి జోడెద్దుల బండి లాంటివి, కూటమి ప్రభుత్వాన్ని కొనసాగిస్తే ఎపి అన్ని రంగాల్లో నంబర్ 1 కావడం గ్యారంటీ. పవర్ ఫుల్ పీపుల్ మేక్స్ పవర్ ఫ్లేసెస్. సూపర్ జీఎస్‌టి - సూపర్ సేవింగ్స్‌తో దసరా, దీపావళి కలిపి ఒకేసారి వచ్చినట్లుగా ఉంది. అలాంటి సూపర్ పండుగను 140 కోట్ల ప్రజలకు అందించారు మన ప్రధాని నమో. పేద, మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం తగ్గించారు. జీఎస్టీ తగ్గడంతో ప్రజలు పండగ చేసుకుంటున్నారు. పేద ప్రజల చిరునవ్వే మన నమోకి పండగ. జీఎస్‌టి తగ్గించాలని ప్రధాని నిర్ణయం తీసుకున్నతరువాత ఫైనాన్స్ మంత్రి కేశవ్‌వచ్చి దాదాపు 8 వేల కోట్లు నష్టపోతామని ముఖ్యమంత్రి చంద్రబాబుకి చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా పర్వా లేదు ... పేద ప్రజలకు 8 వేలకోట్ల లాభం జరుగుతుంది కదా అని సిఎం అన్నారు. నమో ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల మంచి కోసమే, దానికి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు.
కేంద్రంలో మన నమో ... రాష్ట్రంలో మన సిబిఎన్... ఇది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్. ప్రధాని సహాయంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేసుకున్నాం. పోలవరం పనులు వేగవంతం అయ్యాయి. అమరావతి పనులు వేగంగా జరగడానికి, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరిస్తున్నారు. నమో సహకారం వల్లే భారత్‌లో అతి పెద్ద స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది. గూగుల్, స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, కొప్పర్తి, ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోంది. నమో అంటే విక్టరీ. ఆయన ఏ కార్యక్రమం ప్రారంభించినా విజయమే. గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు. మన దేశ ప్రభుత్వాలు యూఎన్ దగ్గరకో, ఇతర దేశాల దగ్గరకో వెళ్లి సాయం కోరేవారు. మన నమో రూటే సెపరేటు. పెహల్గావ్‌లో నమో కొట్టిన దెబ్బకి పాకిస్థాన్ దిమ్మ తిరిగిపోయింది. అమెరికా ట్యాక్సులు పెంచితే పెద్ద పెద్ద దేశాలు కూడా వణికిపోయాయి. నమో ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. నమోకి దేశ ప్రజలు అంటే నమ్మకం.. మనకి నమో అంటే నమ్మకం. ఆనమ్మకమే దేశాన్ని,రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# రాష్ట్రానికి డబుల్ బెనిఫిట్

>> వస్తువుల ధరలు తగ్గి పేద, మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఉపశమనం కలిగిందని చెప్పారు. రైతులు, విద్యార్థులు, చిరువ్యాపారులు తదితర వర్గాలందరికీ లబ్ధి చేకూరేలా సంస్కరణలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ నెక్స్‌జెన్ సంస్కరణలతో ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి రూ.15 వేల వరకు ఆదా అవుతోందని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రానికి 'డబుల్ బెనిఫిట్' లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో పాటు సూపర్ జీఎస్టీతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 'సూపర్ సేవింగ్స్' అందాయని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ, పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, తల్లికివందనం, దీపం-2.0,పెన్షన్ పంపిణీ వంటి పథకాల ద్వారా రాష్ట్రం సంక్షేమ దిశగా దూసుకెళ్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సూచించిన "స్వదేశీ' మంత్రం భారత ఆర్థికవ్యవస్థకు బ్రహ్మాస్త్రంగా మారిందని, 'గర్వ్ సే కహో, యే స్వదేశీ హై' నినాదాన్ని ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తిగా స్వీకరించిందని తెలిపారు. ప్రధానిమోడీ 25 యేళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఆయనను ప్రశంసిస్తూ,'21వ శతాబ్దపు నేత నరేంద్ర మోడీ దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తున్నారు" అని సిఎం పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ద్వారా భారత సైనిక సత్తాను ప్రపంచానికి చాటారని చెప్పారు. స్వదేశీ స్ఫూర్తితో దేశ అభివృద్ధికి ప్రధాని మోడీ తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని చంద్రబాబు అన్నారు. సెమి కండక్టర్ల నుంచి శాటిలైట్ల వరకు స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కేంద్రం సహకారంతో అమరావతిని నిలబెట్టామని, పోలవరాన్ని గాడిన పెట్టామని, విశాఖ ఉక్కును బలోపేతం చేశామని, విశాఖలో గూగుల్ ఎఐ డేటా హబ్‌తో పాటు సెమికండక్టర్ యూనిట్, క్వాంటంవ్యాలీ వంటి ప్రాజెక్టులు ఏర్పడుతున్నాయని తెలిపారు. రాయలసీమలో హైకోర్టు బెంచ్ త్వరలో ఏర్పాటు కానుందని, ప్రాంతం జలకళ సంతరించుకున్నదని, స్టీల్, స్పేస్, డిఫెన్స్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్ పరిశ్రమలు రాయలసీమలో అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్, రైల్వే, హైవే, రక్షణ రంగాలకు చెందిన రూ.13,430 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోడీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసినట్లు తెలిపారు. అలాగే రూ.4,922 కోట్ల విలువైన కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్స్‌కు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. దేశ ప్రగతికి ప్రధాని మోడీకి మరింత శక్తి లభించాలని శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామిని ప్రార్థిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. వికసిత భారత లక్ష్యం సాకారం కావాలని ఆకాంక్షిస్తూ, రాబోయే బీహార్ ఎన్నికల్లో ఎన్డీప విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## వారం - వర్జ్యం

17-10-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
ఏకాదశి ఉ.11.14
మఖ మ.2.00
వర్జ్యం : రా.10.35-12.17
దు.ఉ.9.56-10.43, 2)మ.12.17-మ.1.04
శుభసమయం : ఉ.8.20-9.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఇంటి యందు శుభకార్యాలు దిగ్విజయంగా పూర్తి చేస్తారు.

**వృషభం:** నూతన విద్యావకాశాలు లాభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారంలో అభివృద్ధి సాధిస్తారు.

**మిథునం:** ఇంటిలో ఒకరి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. ప్రయాణాలు.

**కర్కాటకం :** ఏపనిని చేపట్టినా ఆటంకాలు ఎదురై చికాకు కలిగిస్తాయి.

**సింహం:** దీర్ఘకాలిక ఋణాలు తీరి కొంత ఊపిరిపీల్చుకుంటారు.

**కన్య :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు.

**తుల :** వ్యాపారాలలో స్వల్ప మార్పు చోటు చేసుకుంటాయి.

**వృశ్చికం:** క్రయ, విక్రయాలలో అనుకున్నంతగా లాభాలు పొందలేక పోవచ్చు.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి అందిన సమాచారం కొంత ఆందోళనకు గురిచేస్తుంది.

**మకరం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగ యత్నాలు సాగిస్తారు.

**కుంభం:** నూతన ఒప్పందాలు చేసుకుంటారు. బంధువులను కలుస్తారు.

**మీనం :**వివాదాలకు దూరంగా వుండండి. ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నవంబరు 2 నుంచి

# సిఎం చంద్రబాబు లండన్ పర్యటన

**విజయవాడ,అక్టోబరు 16,పభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మరో విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. వచ్చే నెల ఆయన లండన్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు అధికారికంగా ధృవీకరించారు.
నవంబర్ 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు లండన్‌కు బయల్దేరుతారు. ఈ పర్యటన మూడు రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఆయన పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న సానుకూల వాతావరణాన్ని, ప్రభుత్వ విధానాలను, అందుబాటులో ఉన్న అవకాశాలను వారికి వివరించనున్నారు.
వచ్చే నెల విశాఖపట్నంలో జరగబోయే సిఐఐ పారిశ్రామిక సదస్సు ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో, సదస్సుకు ముందే కీలకమైన పారిశ్రామికవేత్తలను కలిసి ఏపీకి ఆహ్వానించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. తన లండన్ పర్యటనలో భాగంగా అక్కడి పారిశ్రామిక దిగ్గజాలను విశాఖ సదస్సుకు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. ఈ ముందస్తు పర్యటన సీఐఐ సదస్సు విజయవంతం కావడానికి, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడానికి దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

## రాష్ట్రానికి కేంద్రం మరో నజరానా

## రూ.21,800 కోట్ల గ్రీన్ ఎనర్జీ

# కారిడార్‌కు ఆమోదం!


**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం నుంచి మరో శుభవార్త చెప్పింది. ఏకంగా రూ.21,800 కోట్ల గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది.కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కింద రూ.21,800 కోట్ల భారీ విద్యుత్ లైన్ల వ్యవస్థ ఏర్పాటు చేయబడనుంది. అనంతపురంనుంచి నెల్లూరు జిల్లా రామాయపట్నం వరకు ఈ లైన్లు విస్తరించనున్నాయి. దీని ద్వారా రాయలసీమలో ఉత్పత్తి అయ్యే సోలార్, విండ్ వంటి పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్తరాంధ్ర ప్రాంతాలకు తరలించవచ్చు. ఇది రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తుంది.
రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3' కింద కేంద్రానికి ప్రతిపాదించింది. మొత్తం రూ.28,000 కోట్ల అంచనాతో ప్రాజెక్టు సమర్పించగా, సిఇఆర్‌సి పరిశీలించి రూ.21,800 కోట్లకే ఆమోదంతెలిపింది. ఇందులో కేంద్రం 30శాతం గ్రాంట్ (సుమారు రూ.6,540 కోట్లు) కింద అందించనుంది. మిగిలిన వ్యయం అయిన రూ.15 వేల కోట్లను ఏపీ ట్రాన్స్‌కో భరించనుంది. ఈ పనులు 2026-27లో ప్రారంభమై రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రణాళిక సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టు కింద సుమారు 350 కిలోమీటర్ల మేర కొత్త విద్యుత్ పంపిణీ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 72,000 మెగావాట్ల సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో అధిక భాగం రాయలసీమ ప్రాంతంలోనే ఉండటంతో, అక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఉత్తరాంధ్రకు తరలించడం ప్రధాన లక్ష్యంగా ఉంది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లైన్లను ఉపయోగిస్తే అధిక ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందని, ట్రాన్స్‌కో స్వంత నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-1' కింద అనంతపురం జిల్లాలో ట్రాన్స్‌కో నెట్‌వర్క్ అభివృద్ధి చేసింది. ఇప్పుడు ఆ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించి, జిఇసి-3 కింద కొత్త లైన్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇది పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడమే కాకుండా, విద్యుత్ సరఫరా ఖర్చులను తగ్గించడంలోనూ సహాయపడుతుంది. రాష్ట్రంలోని కొత్త పరిశ్రమలు, ముఖ్యంగా రాయలసీమలో ఏర్పడే ఫ్యాక్టరీలు మరియు పరిశ్రమలు ఈ ప్రాజెక్టు ద్వారా పెద్ద స్థాయిలో లబ్ధి పొందుతాయి. ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ఎపిలో పర్యటించిన సందర్భంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందంటున్నారు. ఇక రామాయపట్నం నుంచి కాకినాడ, విశాఖపట్నం వరకు ఈ నెట్‌వర్క్ విస్తరణ కొనసాగుతుంది. దీని ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా మరింత సులభతరం అవుతుంది. విశాఖలోని గూగుల్ డేటా సెంటర్, కర్నూలు జిల్లా రిలయన్స్ ఫుడ్ పార్క్, తిరుపతిలోని ఎలక్ట్రానిక్ కంపెనీలు ఈ కొత్త లైన్ ద్వారా విద్యుత్ పొందనున్నాయి.

# మల్లన్న సన్నిధిలో ప్రధాని మోడీ

## శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

## 8 వేల మంది శివసేవకులతో ఘన స్వాగతం

## ప్రధాని వెంట ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి



శ్రీశైల మల్లన్న ఆలయంలో ప్రధాని మోడీకి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చక స్వాములు

**నంద్యాల, అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం శ్రీశైలం చేరుకున్న ఆయన భ్రమరాంబ గెస్ట్ హౌస్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ నుండి బయలుదేరిన ప్రధాని నంది మండపం సర్కిల్ ద్వారా దేవాలయ ప్రాంగణంలోని గంగాధర మండపం వైపు ముందుకు సాగారు. మార్గమంతా సుమారు 8,000 మంది శివసేవకులు కాషాయ వస్త్రధారణలో 'హరహర మహాదేవ' నినాదాలతో ప్రధానమంత్రికి ఘన స్వాగతం పలికారు. దేవస్థానం ప్రధాన ద్వారం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రధానమంత్రి, సిఎం, చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్‌లకు విభూతి, కుంకుమ ధరింపజేసి ఆలయ అంతర్భాగానికి ఆహ్వానించారు. మొదట ధ్వజస్తంభ నమస్కారం, శివ సంకల్పం అనంతరం రత్నగర్భ గణపతి పూజ నిర్వహించారు. అనంతరం శ్రీ మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి, మంత్రపుష్పార్చనలు నిర్వహించి దర్శనం చేశారు. తరువాత నందీశ్వర దర్శనం చేసి అర్చకులచే తీర్థప్రసాదం స్వీకరించారు. తదుపరి మల్లికాగుండం వద్ద గర్భాలయ శిఖర దర్శనం అనంతరం శ్రీ భ్రమరాంబ అమ్మవారి ఆలయానికి చేరిన ప్రధానమంత్రి శ్రీ చక్రమునకు కుంకుమార్చన, షోడశోపచార పూజలు నిర్వహించి అమ్మవారి హారతి స్వీకరించారు. వేదాశీర్వచన మండపంలో వేదపండితులు చతుర్వేద ఆశీర్వచన నిర్వహించి తీర్థప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, అమ్మవార్ల చిత్రపటాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ప్రధానికి అందజేశారు. అనంతరం ప్రధాని మోడీ శ్రీశైలంలో గల శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ప్రధానితో పాటు సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆలయ దర్శనంలో పాల్గొన్నారు.

# పార్వతీపురం వైద్య కళాశాల నిర్మాణం జరుగుతున్నట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

- నర్సీపట్నం పర్యటనలో జగన్ వ్యాఖ్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సవాల్
- లేకుంటే ముక్కు నేలకు రుద్ది జగన్ క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్



**ప్రభాతవార్త విశాఖపట్నం** నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలకు సంబంధించి తన సహజ లక్షణమైన అసత్యాలను వల్లెవేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మాజీ సీఎం జగన్‌రెడ్డి విఫలమైన కృషి చేశారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. నర్సీపట్నం పర్యటన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్ర ఆక్షేపణ తెలిపారు. భూసేకరణే జరగలేదు...నిర్మాణ పనులెక్కి? పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు, అందుకు సంబంధించిన ఫోటోలను పరిశీలిస్తే ఈ విషయం వెల్లడవుతుందని మాజీ సిఎం వ్యాఖ్యానించడాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ కాలేజీకి సంబంధించి అధికారంలో నుండి వైదొలగే దాకా జగన్‌రెడ్డి కనీసం భూసేకరణ కూడా చేయలేదని...ఈ వాస్తవాన్ని విస్మరించి ఆ కాలేజీ నిర్మాణంలో ఉన్నట్లు పట్టపగలు, బహిరంగంగా అబద్ధాలు చెప్పడం జగన్ కే సాధ్యమని మంత్రి నేడొక ప్రకటనలో ఎద్దేవా చేశారు. నేను రాజీనామాకు సిద్ధం...నీవు క్షమాపణలు చెప్పగలవా? పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించి వాస్తవాల్ని వెలుగులోకి తేవడానికి మాజీ సిఎం తనకు ఇష్టమైన వారితో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఆ కమిటీ వాస్తవాల్ని పరిశీలించి భూసేకరణ జరిగి, నిర్మాణ పనులు జరుగుతున్నాయని నిర్ధారిస్తే...తాను వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని, లేకుంటే జగన్‌రెడ్డి తన ముక్కును నేలకు రుద్ది క్షమాపణలు తెలపాలని మంత్రి సూచించారు. ఈ సవాల్ ను స్వీకరించే నిజాయితీ, ధైర్యముంటే జగన్‌రెడ్డి వెంటనే స్పందించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదనపై ఆయన స్పందించకుంటే పార్వతీపురం కళాశాల విషయంలో జగన్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే ప్రజలను తప్పుదోవ పట్టించడానికి పూనుకున్నారని భావించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. పిపిపి విధానంలో కొన్ని వైద్య కళాశాలల నిర్మాణంపై మాజీ సిఎం జగన్‌రెడ్డి పూర్తిగా అసత్యాల పునాదులపై ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అనుసరిస్తున్న కుట్ర పూరిత ధోరణికి పార్వతీపురం కాలేజీ నిర్మాణం గురించి ఆయన వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజలందరినీ కొంత కాలం, కొంత మందిని పూర్తికాలం మోసగించవచ్చు కానీ....అందరినీ ఎల్లకాలం యామార్చలేమన్న విషయాన్ని జగన్‌రెడ్డి ఇప్పటికైనా గుర్తించాలని మంత్రి అన్నారు. నీవెంత ఖర్చు పెట్టావు.... జగన్‌రెడ్డీమొత్తం 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ వ్యయం రూ.8,480 కోట్లలో...తాను అధికారంలోనుంచి వైదొలగేనాటికి రూ.3,000 కోట్లు ఖర్చు చేశానని,

కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.1,000 కోట్లు ఖర్చు చేసి మొత్తం నిర్మాణ పనులను పూర్తి చేయలేదా అని జగన్ ప్రశ్నించడంలోని అనౌచిత్యాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎత్తిచూపారు.

## విజయవాడలో భారీగా స్టెరాయిడ్స్ స్వాధీనం

**విజయవాడ,అక్టోబరు15,ప్రభాతవార్తప్రతినిధి:**నగరంలో భారీగా స్టెరాయిడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎనీడైమ్ ఫిట్నెస్ సెంటర్‌లో స్టెరాయిడ్స్‌తో రసూల్ అనే యువకుడు పట్టుబడ్డాడు. జిమ్‌కి వచ్చే యువతకు స్టెరాయిడ్స్ సప్లై చేస్తున్నట్లు పోలీసులు గతుర్తించారు. ఈగల్,టాస్క్‌ఫోర్స్ బృందాలు సంయుక్తంగా దాడులు చేశాయి. నగరం లోని పలు జిమ్‌లకు కూడ రసూల్ స్టెరాయిడ్స్ సప్లై చేస్తున్నట్లు గుర్తించారు. సమీర్ అనే హెల్త్ సప్లిమెంట్స్ అమ్మే వ్యక్తితో కలిసి స్టెరాయిడ్స్ అమ్ముతున్నట్లు గుర్తించారు.

పరారీలో సమీర్ స్నేహితుడు సునీల్‌కోసం పోలీసులు గాలిస్తున్నారు. సునీల్,రసూల్ కలిసి స్టెరాయిడ్స్ అమ్మకాలు చేస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు.

## లిక్కరు స్కామ్‌లో నిందితులకు 24 వరకు రిమాండ్



**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కరు స్కామ్‌లో నిందితులకు ఈనెల 24 వరకు రిమాండ్ పొడిగిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితులకు నేటితో రిమాండ్ గడువు ముగియనుండటంతో నిందితులను కోర్టులో హాజరుపరిచింది. విచారణ జరిపిన న్యాయస్థానం నిందితులకు రిమాండ్ పొడిగించింది. ఈ కేసులో మొత్తం ఇప్పటివరకూ 12 మంది అరెస్ట్ కాగా ఐదుగురు బెయిల్‌పై విడుదలయ్యారు. ఏడుగురు నిందితులు విజయవాడ, గుంటూరు జిల్లా జైళ్లలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. బెయిల్ పొందిన నలుగురు నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, దిలీప్ కోర్టుకు హాజరుకాలేదు. వీరికి సంబంధించి వారి తరఫు న్యాయవాదులు ఆబ్‌సెంట్ పిటిషన్ దాఖలు చేశారు. మద్యం కుంభకోణం రిమాండ్ ఖైదీలను కోర్టుకు తరలించారు. మద్యం కుంభకోణం కేసులో రాజ్ కేసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, బూనేటి చాణక్య,

సజ్జల శ్రీధర్ రెడ్డిలు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. జ్యుడీషియల్ రిమాండ్ గడువు నేటితో ముగియడంతో విజయవాడ జిల్లా నుంచి ఐదుగురు నిందితులను కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు. మరో ఇద్దరు నిందితులు నవీన్ కృష్ణ ,

బాలాజీ కుమార్ యాదవ్ గుంటూరు జైలు నుంచి అధికారులు కోర్టుకు తరలించారు.

## నకిలీ మద్యం కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు : సజ్జల

- రాష్ట్ర మంతటా నకిలీ మద్యం ఉంది - ఎక్కడో ఒకచోట అయితే యాప్ పెట్టాల్సిన అవసరం ఏముంది?



**విజయవాడ,అక్టోబరు16,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో అడ్డంగా దొరికిపోయామనే భయం చంద్రబాబుకు పట్టుకుందని వైసీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశం జరిగింది...సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు లేళ్ళ అప్పిరెడ్డి,ఆలూరు సాంబశివారెడ్డి,పలువురు ఇతర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ...వైసీపీకి 18 నుంచి 20 లక్షల మంది క్రియాశీల క్షేత్రస్థాయి నాయకత్వం ఉంది....పార్టీ సంస్థాగత నిర్మాణంపై జగన్ ఆలోచనలు,బ్లూ ప్రింట్‌ను మనం అమలు చేయాలి...వైసీపీ అనుబంధ విభాగాలన్నీ చిత్తశుద్ధిగా పనిచేయాలి...ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న రచ్చబండ,కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలకు అనూహ్య స్పందన వస్తుందన్నారు. ఇక,ఏపీలో నకిలీ మద్యం ఏరులై పారుతోంది...జగన్ పాలనలో డెలివరీ సిస్టం,డిస్ట్రిబ్యూషన్ సిస్టంలను ఏర్పాటు చేసి సంక్షేమాన్ని ప్రజల ముంగిట్లోకి తీసుకెళ్తే...చంద్రబాబుది రివర్స్ పాలన అన్నారు సజ్జల...చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను గట్టిగా ఎదుర్కోవాలి. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వల్ల ఏపీ లోని అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. క్షేత్రస్థాయిలో కూడా మన అనుబంధ విభాగాలు ఫోకస్‌గా పనిచేయాలి. ప్రధానంగా 7 అనుబంధ విభాగాలు కీలకపాత్ర పోషించాలి.

పార్టీ లైన్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి అనుబంధ విభాగాలదే ప్రధాన పాత్ర అన్నారు. సొసైటీకి ఎలా మంచి చేయాలని తపన పడే నాయకుడు వైఎస్ జగన్ అన్నారు సజ్జల...మరోవైపు,నకిలీ మద్యం కేసులో అడ్డంగా దొరికిపోయామనే భయం చంద్రబాబుకు ఉంది...కల్తీ మద్యం కోసం యాప్ పెట్టారంటేనే అర్థం చేసుకోవాలి అన్నారు...రాష్ట్రమంతటా నకిలీ మద్యం ఉంది,ఎక్కడో ఒకచోట అయితే యాప్ పెట్టాల్సిన అవసరం ఏముంది? అని ప్రశ్నించారు. అంతే కాదు బెల్ట్ షాపులు ఉన్నాయని ఒప్పుకున్నారని...నకిలీ మద్యం బయటపడగానే ఒకరు ఆఫ్రికా నుంచి దిగుతారు..ఇతడికి రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతారు..జోగి రమేష్ మమ్మల్ని నడిపారని చెప్పారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.

## టిడిపి నేతలు నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా నడిపిస్తున్నారు : మాజీ మంత్రి జోగి రమేష్



**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్త ప్రతినిధి:**టిడిపి నేతల నకిలీ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారని...ఆ మకిలిని తనకు అంటగట్టాలని చూస్తున్నారని మాజీ మంత్రి జోగి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం విజయవాడ లోని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఫేక్ న్యూస్‌తో రోజుకో అబద్ధం ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తాను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. ఇబ్రహీంపట్నంలో పట్టినంత మాత్రాన జనార్ధన్‌రావుతో తనకు సంబంధం ఉన్నట్లేనా అని ప్రశ్నించారు. సిట్ అధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరారు.జనార్ధన్‌రావు వెనుక టిడిపి ఉందని ఆరోపించారు. నకిలీ మద్యం కేసు ప్రధాన నిందితుడు జనార్ధన్‌రావుతో తనకు సంబంధాలు ఉన్నట్లు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్ సిఎం చంద్రబాబునాయుడికి సవాల్ విసిరారు. ఈ విషయంలో చిత్తశుద్ధి నిరూపించుకోవాల్సిన విసం తనకు లేదని...అయితే తీవ్ర ఆరోపణల నేపథ్యంలో లై డిటెక్టర్ పరీక్షలకు తకూడ తాను సిద్ధమని అన్నారాయన.బుధవారం తాడేపల్లి లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...నారా వారి సారాను చంద్రబాబు ఏరులై పారిస్తున్నారు. టీడీపి నేతలు నకిలీ మద్యాన్ని కటీర పరిశ్రమలా నడిపిస్తున్నారు. టీడీపీ నేత జనార్ధన్‌రావుతో నేనను ఎలాంటి ఛాటింగ్ చేయలేదు.

# తిరుమల సమాచారం

## కొనసాగుతున్న పెరటాసి రద్దీ

- కాలినడకన భారీగా గోవిందమాల భక్తులు

**తిరుమల,అక్టోబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** భక్తులకు పవిత్రమైన పెరటాసి శనివారం చివరివారం రానుండటంతో గురువారం సాయంత్రానికి తిరుమలలో భక్తులు పెరిగారు. పెరటాసి మాసం చివరి వారం కావడంతో భక్తుల రద్దీ తిరుమలలో కొనసాగుతోంది. ముఖ్యంగా శనివారం మరింతమంది భక్తులు తమిళనాడు, కర్నాటక నుండి తరలివచ్చారు.. కొండపై దర్శనానికి రావచ్చునేది టిటిడి వర్గాల అంచనా. తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం వెంకటాద్రినిలయం అందుబాటులోకి రావడంతో నాలుగువేలమంది సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు సులభమైంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోకి ప్రవేశించే భక్తుల సంఖ్య ఎక్కువైంది. సాయంత్రంవరకు 41వేలమంది భక్తులు మహాలఘులో గోవిందుని దర్శనం చేసుకున్నారు.

## రవాణా విభాగంలో ఆయుధపూజ



**తిరుమల,అక్టోబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి రవాణ విభాగంలో తిరుపతి,తిరుమలలోని ఆ కార్యాలయాల్లో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. తొలుత వర్కుషాపుల్లో యంత్రాలకు, అనంతరం టిటిడి అన్ని వాహనాలకు పూజలు చేసి పూలతో అలంకరించారు. ప్రతి ఏడాది దసరా తరువాత ఈ ఆయుదపూజ చేయడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో రవాణా జిఎం శేషారెడ్డి,డిఎంలక్ష్మీప్రసన్న, డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, ఓఎస్‌డి సత్రానాయక్ పాల్గొన్నారు. టిటిడి రవాణావిభాగంలో 340 వాహనాలు, 90 ద్విచక్రవాహనాలుకు పూజలు చేశారు.

## శ్రీవారి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలి



**తిరుమల,అక్టోబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన పెరటాసి మాసంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని,స్వామివారి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని పలువురు ప్రముఖులు తెలిపారు. గురువారం ఉదయం కె.ర్యాంప్ చిత్ర బృందం దర్శకుడు జైన్స్ నాని,నటుడు కిరణ్‌అబ్బవరం బృందం, పద్మశ్రీ అంజయ్య, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు చేరుకున్నారు.ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమల కొండపై వర్షం



**తిరుమల,అక్టోబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ,ఈశాన్యరుతుపవనాల ప్రభావంతో గురువారం మధ్యాహ్నం ఉన్నఫళంగా అర్ధగంట తిరుమలలో వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో తిరుమల ఆలయం ముందు, మాఢవీధులు వర్షపునీటితో నిండిపోయాయి. వర్షంతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది. ఆలయంలోనికి వెళ్ళే భక్తులు వర్షానికి తడుస్తూ స్వామివారి దర్శనానికి చేరుకోవాల్సి వచ్చింది. ఆలయం నుండి వెలుపలకు వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు. గదులకు చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డారు.చిరుజల్లులతో, ఇటీవల కురుస్తున్న వర్షాలతో వాతావరణం పూర్తిగా మారిపోయి చల్లటిగాలులు వీస్తున్నాయి.భక్తులు సాయంత్రం 3గంటలనుండే గదుల నుండి బయటకు రావాలంటే వణుకుతున్నారు.

## చికెన్ దుకాణాలకు లైసెన్సులు

**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** చికెన్ వ్యాపారంలో అక్రమాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు,కొత్తగా లైసెన్సింగ్ విధానాన్ని తీసుకురావాలని రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ప్రతి చికెన్ దుకాణానికి లైసెన్స్ ఇవ్వాలి. ఏ ఫారం(ఫౌల్ట్రీ) నుంచి కోళ్ళు వచ్చాయి. దుకాణదారుడు వాటిని ఎవరికి అమ్మారు...అనే అంశాలను ట్రాక్ చేసేలా పకడ్బందీ వ్యవస్థను తీసుకురావాలి'అని మాంసాభివృద్ధి సంస్థ బోర్డు నిర్ణయించింది. విజయవాడ లోని పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. వైకాపా హయాంలో జరిగిన మాంసం మాఫీ యా అక్రమాలను బయటకు తీసి, భాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సంస్థ చైర్మన్ చంద్ర దండు ప్రకాష్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డైరెక్టర్లు ప్రవీణ,అజ్మొద్దీన్,పశు సంవర్ధక శాఖ సంచాలకులు టి.దామోదర్ నాయుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలివీ...చికెన్,మటన్ దుకాణా లను క్రమబద్ధీకరించడం, మున్సిపాలిటీల్లో మాంసం దుకాణాలపై ఆకస్మిక దాడులు.

## అటవీ అభివృద్ధి సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల నియామకం

**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లును రాష్ట్ర ప్రభుత్వం పునన్నియమించింది. అటవీ అభివృద్ధి సంస్థ ఎండీ, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్పత్తి విభాగం పీసీసీఎఫ్,ఆర్థిక శాఖ కార్యదర్శి,కేంద్ర పర్యావరణ,అటవీ మంత్రిత్వశాఖకు చెందిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌ను దీనిలో అధికారిక డైరెక్టర్లుగా నియమించింది. పాతపట్నం నియోజకవర్గానికి చెందిన గేదెల చైతన్య,మంగళగిరి నియోజకవర్గానికి చెందిన జి.నాగేశ్వరరావు,పాలకొల్లుకు చెందిన మల్లా వెంకటమురళీ,రాయచోటికి చెందిన ఎర్రగొల్ల రెడ్డయ్య,విజయవాడ తూర్పు నియోజక వర్గానికి చెందిన గద్దె వెంకటేశ్వరప్రసాద్‌ను అధికారేతర డైరెక్టర్లుగా నియమించింది. ఈ మేరకు మొత్తం 10 మందితో బోర్డు ఏర్పాటు చేస్తూ అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

- 48గంటల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు

**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు నిష్క్రమించినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.ఈ క్రమంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల్లోకి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినట్లు అధికారులు చెబుతున్నారు.. ఈ మార్పు ప్రభావంతో రాబోయే రెండు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.ఇదే సందర్భంలో దక్షిణ భారతదేశం దాని ప్రక్కనే ఉన్న మధ్య బంగాళాఖాతంలో తూర్పు , ఈశాన్య గాలులు ప్రారంభమవడంతో పాటు, ఈశాన్య రుతుపవనాల వర్షపాతం అదే సమయంలో ఆగ్నేయ ద్వీపకల్ప ప్రాంతంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో బంగాళాఖాతంలో తుఫానులు ఏర్పడే అవకాశం ఉంటుంది అన్నారు. ఈ సీజన్‌లో దక్షిణ కోస్తా ఆంధ్ర ప్రదేశ్ , రాయలసీమ అధిక వర్షాలు ఉంటాయి అన్నారు. ఈశాన్య రుతుపవనాల రాకతో ఆంధ్రప్రదేశ్, యానాం మీదుగా తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయి. ఈ ఈశాన్య రుతుపవనాలు సందర్భంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకూ ఆంధ్రప్రదేశ్, యానాంలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారి తెలుపుతున్నారు. భారీ వర్షాలు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. వాతావరణ శాఖ సూచనల ప్రకారం, రానున్న 48 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడనున్నాయి. ముఖ్యంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదవుతాయని పేర్కొంది. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేశారు. తమిళనాడు తీర ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోతోందని తెలిపారు. ఈ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురవనున్నాయని హెచ్చరించారు.వాతావరణ శాఖ అధికారుల వివరాల ప్రకారం, రానున్న నాలుగు రోజుల పాటు దక్షిణ కోస్తా ప్రాంతం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల వరకూ పలు

## మద్యం షాపుల జియో కోఆర్డినేషన్ చేసే బాధ్యత గ్రామ సచివాలయాలకు !

**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం షాపుల భౌగోళిక అక్షాంశం, రేఖాంశ స్థానాలను జియో కోఆర్డినేషన్ చేసే బాధ్యతల నిర్వహణపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ శాఖకు ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ నేపథ్యంలో డిజిఒ, డిడిఒ, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లు అందరూ రాష్ట్రంలోని అన్ని మద్యం షాపుల జియో కోఆర్డినేషన్ పనిని వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామ, వార్డు సచివాలయశాఖ డైరెక్టర్ శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## డిజిపి నియామకంలో కోర్టు ధిక్కరణ: ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** డీజీపీ నియామకం విషయంలో దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో సుప్రీం కోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుతానికి నోటీసులు జారీ చేసింది. ప్రకాష్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా వ్యవహరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకినాడలోని హెల్ప్ ది పీపుల్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,మేనేజింగ్ ట్రస్టీ కేతినీడి అఖిల్ శ్రీగురుతేజ దాఖలు చేసిన పిటీషన్పై వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్,జస్టిస్ వినోద్‌చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. డీజీపీల నియామకం రాష్ట్రాలు అనుసరించాల్సిన విధివిధానాలను నిర్ధేశిస్తూ సుప్రీం కోర్టు ఓ కేసులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేవలం రెండు నెలల సర్వీసు ఉన్న వ్యక్తిని డీజీపీగా నియమించినట్లు పిటీషనర్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు.

## చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై సుప్రీం కోర్టు స్పష్టత

- మెరిట్స్ ప్రాతిపదికన విచారణకు ట్రయల్ కోర్టుకు అనుమతి

**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:**మద్యం కేసులో అరెస్ట్ అయిన వైసిపి మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెయిలు పిటీషన్‌పై సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి బెయిల్‌ను రద్దుచేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ దాఖలు చేసిన పిటీషన్‌పై తుది నిర్ణయం వెలువరించేంతవరకూ ట్రయల్ కోర్టులో మిగతా నిందితుల బెయిలు పిటీషన్‌లపై విచారణ చేపట్టరాదన్నారు.

## అమరావతిలో పర్యాటక భవన్ కేటాయింపునకు కేంద్రం సానుకూలం : మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి** :ఏపీ రాజధాని అమరావతిలో పర్యాటక భవన్,తిరుపతిలో కలినరీ ఇనిస్టిట్యూట్, రాజమహేంద్రవరంలో నేషనల్ డ్రామా స్కూలు కేటాయించాలన్న ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షేకావత్ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.ఉదయపూర్‌లో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల పర్యాటక శాఖల మంత్రుల సదస్సులో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రతిపాదనలను చేశారన్నారు.


**बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda బ్యాంక్ ఆఫ్ బరోడా**
ఏలూరు బ్రాంచ్, డి.నెం.25-5-116, ఫైర్ స్టేషన్ దగ్గర, ఎన్.ఆర్.పేట, ఏలూరు - 534002. పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏలూరు మెయిన్ బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ ఐలా శ్రీనివాసులు,** తండ్రి: శ్రీ ఐలా మునియ్య, నివాసం: ఎల్‌ఐజి 2-54, ఎపిహెచ్‌బి కాలనీ, పెదపాడు మండలం, కమ్యూనిటీ హాలు, వట్లూరు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534007 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **తేది: 20.05.2025 నాటికి రూ.13,93,020.26** (అక్షరాల పదమూడు లక్షల తొంభై మూడు వేల ఇరవై రూపాయల ఇరవై ఆరు పైసలు మాత్రమే) + వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.20-05-2025**న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. ఈ నోటీసు జారీచేసిన తరువాత ఋణగ్రహీత **అకౌంట్ నెం.09700500004946కు తేది:22.05.2025 నాటికి రూ.17,000/-, తేది:28.07.2025 నాటికి రూ.49,500/-, తేది:23.08.2025 నాటికి రూ.55,000/-, తేది:25.08.2025 నాటికి రూ.4,000/- మరియు అకౌంట్ నెం.09700600008879కు తేది:31.05.2025 నాటికి రూ.23,000/-, తేది:31.05.2025 నాటికి రూ.25,500/-, తేది:30.06.2025 నాటికి రూ.49,000/-, తేది:31.07.2025 నాటికి రూ.22,000/-, తేది:25.08.2025 నాటికి రూ.52,000/- చెల్లించినారు.** పైన తెలిపిన మొత్తాలను సర్దుబాటు చేసిన తరువాత ప్రస్తుత బకాయి మొత్తం **తేది:16.10.2025 నాటికి రూ.11,35,501.91** పై (అక్షరాల పదకొండు లక్షల ముప్పై అయిదు వేల అయిదు వందల ఒక రూపాయల తొంభై ఒక పైసలు మాత్రమే) + వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4) సెక్షన్‌కు అనుబంధమైన సదరు రూల్సు 2002 నందలి రూలు 8 ప్రకారము **తేది.16-10-2025**న దిగువ పేర్కొన్న ఆస్తి **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం **తేది:16.10.2025 నాటికి రూ.11,35,501.91** పై (అక్షరాల పదకొండు లక్షల ముప్పై అయిదు వేల అయిదు వందల ఒక రూపాయల తొంభై ఒక పైసలు మాత్రమే) ఇంకా విధించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు, మొదలగునవి **బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏలూరు మెయిన్ బ్రాంచ్** వారి యొక్క ఛార్జీకి లోబడి వుండునని ప్రత్యేకించి ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు మరియు హామీదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

**స్థిరాస్తి వివరములు:**

**ఎ షెడ్యూల్:** పశ్చిమ గోదావరి జిల్లా, పెదపాడు మండలం, వట్లూరు సబ్ రిజిస్ట్రీ, వట్లూరు, ఎపి హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్.ఎస్.నెం.590, నెం.14-26, ఫేజ్-1, ఎల్‌ఐజి-II-54 లోని 111.11 చ॥గ॥ల విస్తీర్ణంలో గల ఆర్‌సిసి రూఫ్ భవనం యావత్తు ఆస్తి **శ్రీ ఐలా శ్రీనివాసులు,** తండ్రి: శ్రీ ఐలా మునియ్య గారి పేరున కలదు. **హద్దులు : తూర్పు** : ఎల్‌ఐజి-II ఇంటి నెం.48, **దక్షిణం** : 30 అ॥ల వెడల్పు రోడ్డు, **పడమర** : 30 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం**: ఎల్‌ఐజి-II ఇంటి నెం.53.

**తేది : 16-10-2025** సం/- అధీకృత అధికారి
**ప్రదేశం : ఏలూరు** బ్యాంక్ ఆఫ్ బరోడా

వార్త

కృషిపైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. దానంతట అది ఏదీ మన దగ్గరకు రాదు.

-ఫ్రాంక్లిన్

# చట్టం అందరికి సమానమేనా?


'దొరతనంబునందు దొంగతనంబునందు భాగ్యవంతునికి ఏదైనా బాధలేదు' అన్నారు పెద్దలు. ఏ సందర్భంలో ఏ అనుభవంతో ఎవరిని ఉద్దేశించి ఈ లోకోక్తి పుట్టిందో కానీ ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే వారు చెప్పింది అక్షరాలా నిజమేననిపిస్తున్నది. కానీ మన రాజ్యాంగ నిర్మాతలు ఇవేమీ దృష్టిలో పెట్టుకోకుండా కుల, మత,వర్గ,లింగ బేధాలు లేకుండా అందరికి సమానంగా వర్తించే విధంగా శాసనాలతో రాజ్యాంగాన్ని రూపొందించారు. అవి నిష్పక్షపాతంగా అమలు చేస్తారని భావించారు. కానీ దురదృష్టవశాత్తు అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో లేక దక్షిణ ప్రలోభంలో పడి చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటారని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారు. ఫలితంగా వందలాది కరుడుగట్టిన నేరస్తులు చట్టం నుంచి తప్పించుకోగలుగుతున్నారు. అన్నింటికంటే మించి ప్రజలను వంచించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వైట్‌కాలర్ నేరస్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బయటపడగలుగుతున్నారు. సమర్థవంతంగా దర్యాప్తు చేసి పటిష్టమైన రికార్డులు తయారు చేసి అవసరమైన సాక్ష్యాలను సేకరించి న్యాయస్థానాల ముందు నిలబెట్టి రుజువు చేయడంలో సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా జరగకపోతే మరికొన్ని సందర్భాల్లో ఆశ్చర్యకరంగా అధికారులే స్వయంగా కేసులు వీగిపోయే విధంగా రికార్డులు తయారు చేస్తున్నారు. అందుకు వారికి ఉన్న కారణాలు వారికి ఉన్నాయి. ఇంకొన్ని సందర్భాల్లో అధికారులుసకల అవస్థలు పడి కోర్టుల ముందు రుజువులు సర్వం సిద్ధం చేసినప్పుడు కొందరు పాలకులే ఏకంగా కేసులకు మోకాలొడ్డుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో సమర్థవంతంగా దర్యాప్తులు చేసే అధికారుల్లో నిస్పృహ నిరాశా పెంచుతున్నారు. దీనికితోడు ఏనాడో తయారు చేసిన చట్టాలు నిబంధనల్లో ఉన్న లొసుగులను నేరస్తులు ఉపయోగించుకోగలుగుతున్నారు. అందుకే అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఆనాటి బ్రిటిష్ ప్రభువులు తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలను కాలాగుణంగా సవరించాలనే పోలీసుల వాదన కూడా సమంజసమే. ఇటీవల మూడు చట్టాలను కూడా కేంద్రప్రభుత్వం సవరించింది. అయితే ఉన్న నిబంధనలను, చట్టాలను ఏమేరకు నిష్పక్షపాతంగా అమలు చేస్తున్నారనేదే ప్రశ్న. ధనిక, పేదతేడా లేకుండా ఎంతవరకు చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారనేదే ముఖ్యం. ఏ అండా లేని నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తారో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. కిందిస్థాయి పోలీసు ఉద్యోగుల్లో ప్రవర్తనలో మార్పులు తీసుకువచ్చేందుకు గత రెండు, మూడు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొంతమేరకు ఫలితాలు కన్పిస్తున్నా ఆశించిన స్థాయిలో ఇవి జరగడంలేదనే చెప్పొచ్చు. ఇందుకు కిందిస్థాయి అధికారులను నియమించేకంటే ఉన్నతస్థాయిలో ఉన్న అధికారుల్లో కొందరు రాజకీయ నాయకులు ఒత్తిడికి తలొగ్గడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయనే ఆరోపణలను తోసిపుచ్చలేం. ప్రధానంగా పోలీసుల్లో కొందరు ఉన్నతాధికారులు రాజకీయనేతలతో మమేకం కావడం వల్లనే కిందిస్థాయి ఉద్యోగులు పెదవి విప్పలేకపోతున్నారు. దేశవ్యాప్తంగా కానీ, తెలుగురాష్ట్రాల్లో కానీ ఈ బోగస్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి కోట్లాదిమంది అమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేస్తే జీవితకాలంపాటు సంపాదించుకున్న డబ్బుపోగొట్టుకొని న్యాయం చేసేవారు లేక బాధితుల వేదనఅరణ్యరోదనగా మారుతున్నది. కొందరు బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. ఇలా మోసపోయిన వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. తెలుగురాష్ట్రాల్లో గత దశాబ్దంలో పరిశీలిస్తే అధికారికంగా, అనధి కారికంగా లెక్కలు చూసినా దాదాపు ఇరవై వేలకోట్లకుపైగా బోగస్ ఫైనాన్స్ కంపెనీలు, చిట్‌ఫండ్ కంపెనీలు ప్రజలను మోసం చేసి దోచుకున్నట్లు అంచనా. ఇందులో కొన్నింటిలో రికవరీ ఏదో కొద్దిశాతం ఉన్నా ఇలా నిలువునా ప్రజలను మోసం చేసిన దగాకోర్లపై నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మరొకపక్క మోసపోయిన వారు బాధితుల సంఘాలంటూ ఏర్పడినిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు, తదితర ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇంకొకపక్క ఏదోరకంగా డబ్బుసంపాదించగలిగితే తమనుఎవరు ఏమీ చేయలేరనే భావన మోసగాళ్లల్లో పెరిగిపోతున్నది. ఈ విషయంలో కొందరు బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లితే న్యాయం సంగతి ఎలాఉన్నా అసలుకేసులు నమోదు చేసుకోవడానికి అధికారులు ఇష్టపడడంలేదు. మమ్మల్ని అడిగి ఇచ్చారా? ఇచ్చేటప్పుడు తెలివిలేదా? లాభం వస్తే మా వద్దకు వచ్చేవారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించి మళ్లీ పోలీసు స్టేషన్‌కు రాకుండా చేసి పంపుతున్నారు. అంతేకాదు ఇది సివిల్ తగాదా అని జోక్యం చేసుకోవడానికి వీలులేదని, న్యాయస్థానాలకు వెళ్లి వసూలు చేసుకోమని సలహాలు ఇస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తే పోలీసులు వేరే పనిచేయలేరనే వాదనను తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతో పాటు పోలీసులకు బాధ్యత కూడా విపరీతంగా పెరిగిపోయిందనడంలో సందేహంలేదు. అయితే ఇలాంటిమోసాలు పెద్దఎత్తున జరగడం ప్రభుత్వ ప్రతిష్టను, పోలీసువ్యవస్థపై ప్రజలకు ఉన్న గౌరవాలను తగ్గిస్తున్నది. పాలకుల పట్ల వ్యతిరేకతను ఏర్పరుస్తున్నది. పాలకులు ఆ కోణంలో ఆలోచించాలి. ఈ దగా, భారీ మోసాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

వాడని ఇనుము తుప్పు పడుతుంది. కదలని నీరు స్వచ్ఛతను కోల్పోతుంది. బద్ధకం మెదడును నిస్తేజం చేస్తుంది.



దావిన్సి

విద్య లేకుండా ఊహలున్నవాడు, కాళ్లు లేకుండా రెక్కలున్న పక్షితో సమానం.



మహాత్మా గాంధీ

# సామాన్యులకు అధికార ఫలాలు దక్కేదెన్నడు?

**సమాజంలో కీలకంగా సేవలందించే నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, శాలివాహన(కుమ్మరి), రజక, మహేంద్ర (మేదర) వంటి వందకుపైగా బీసీ కులా లకు చెందిన వారు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటి వరకు చట్టసభలలో ప్రవేశించలేకపోయారు. కనీసం వీరికి నామినేటెడ్ పదవులలో కూడా వీరికి తగిన స్థానం లభించడం లేదు. కీలకమైన నామినేటెడ్ పోస్టుల పంపిణీ కూడా ఏ కులానికి చెందినవారు అధికారంలో వుంటే ఆ కులానికి చెందినవారికే దక్కుతున్నాయి. అందుకు ఒక చిన్న ఉదాహరణ రాష్ట్రంలోని కనకదుర్గ గుడి, శ్రీశైలం, కాణిపాకం, అన్నవరం వంటి ప్రధాన దేవాలయాల ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవులన్నీ ఒకే సామాజికవర్గానికి దక్కాయి. కాకపోతే భార్యకు భోజనం పెట్టి సమాజాసేవ చేస్తున్నా మని చెప్పిన చందంగా ఇతర కులాలవారికి వంద రూపా యలు నిధులు కూడా లేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆయా కులాలకు చెందిన వారిని ఆయా కార్పొరేషన్లకు అధ్యక్షులను, డైరక్టర్లను నియమిస్తున్నారు.**



అన్నవరపు బ్రహ్మయ్య

ప్రాచీన కాలం సంగతి ఎలా ఉన్నా స్వాతంత్ర్యం వచ్చిన 76 ఏళ్ల తర్వాత కూడా కులాలపై మాట్లాడవలసిరావడం బాధాకరం. 5జి నుంచి 6జికి పరుగులు పెడుతున్న రోజులలో మనుషులు ఏ మాత్రం శాస్త్రీయతలేని కులం కౌగిలి నుంచి బయటకు రాలేకపోవడానికి కారణం ఏమిటో ఎవరికి వారు అత్మ పరిశీలన చేసుకోవాలి. ఎదుటి మనిషికే చెప్పేటందుకు నీతులు వున్నాయి అని ఒక సినిమా కవి అన్నట్టుగా ప్రస్తుతం ఎవరివారు కులం పోవాలని చెప్తున్నారు, కానీ తాము ఆచరించటం లేదు. అందుకు ఉదాహరణ ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అనంతపురం శాసన సభ్యులు, సినీనటుడు బాలకృష్ణ చేసిన ప్రసంగం నేపథ్యంలో ప్రధానంగా సోషల్ మీడియా వేదికగా మూడు కులాల మధ్య జరుగుతున్న కుమ్ములాట. రాష్ట్రంలో కులాలంటే ఆ మూడు(రెడ్డి, కమ్మ, కాపు) కులాలే కులాలని, ఇతర కులాలేవి లేనట్టుగా, ఏ రాజకీయం చేయాలన్న తాముమాత్రమే చేయగలమనే అధిపత్య ధోరణి వారిలో కనిపిస్తోంది. సినీ నటుడు, శాసన సభ్యుడు బాలకృష్ణ అసెంబ్లీలో మెగాస్టార్ చిరంజీవిని అవమానపర్చారంటూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ సోషల్ మీడియానే కాకుండా కాపు సామాజికవర్గానికి చెందిన నేతలు, కొంత మంది జనసేన పార్టీ కార్యకర్తలు తీవ్రంగా స్పందించారు. వాస్తవానికి కమ్మ, కాపు, సామాజికవర్గాల మధ్య రాజకీయంగా పోటీతత్వం ఎన్నోఏళ్లుగా కొనసాగుతోంది. అయినప్పటికీ గత ఎన్నికల్లో అనుకోని రీతిలో చంద్రబాబు,పవన్ కళ్యాన్ మధ్య బంధం ఏర్పడం, పవన్ కళ్యాన్ మధ్యవర్తిత్వంతో తెలుగుదేశంపార్టీ, బిజెపిల మధ్య పొత్తు కుదిరింది. పర్యావసానంగా తెలుగుదేశం, జనసేన, బిజెపిల మధ్య పొత్తుకుదిరి కూటమిగా ఏర్పడం వల్ల తిరుగులేని మెజారిటీని సాధించారన్నది వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నేతల భావన. ఈ నేపథ్యంలోనే పొత్తును దెబ్బతీయడానికి ఆ పార్టీ నేతలు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదిలి పెట్టడంలేదు. అయితే రాజకీయంగా తలపండిన తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, బాలకృష్ణ కారణంగా తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీల మధ్య బాలెన్స్ దెబ్బతినకుండా వుండేందుకు కృషిచేస్తున్నారు. ఆ కృషిలో భాగంగానే ఇటీవల చంద్రబాబు జనసేన నేత పవన్ కళ్యాన్ ఇంటికి వెళ్లారని అర్థం అవుతోంది. అయితే ఈ సందర్భంగా జనసేన నేత పవన్ కళ్యాన్ పరిణితితో వ్యవహారించారని చెప్పవచ్చు. ప్రతి రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కులం కూడు పెట్టదని, కుల నిర్మూలన జరగాలని అంటారు. రాజకీయ పార్టీలకు చెందిన నేతలైతే అధికారంలోకి రావాలంటే కేవలం ఒక కులంవారు ఓటు వేస్తే చాలదని, మిగిలిన కులాలకు చెందినవారు ఓట్ల మీదనే ఆధారపడాలని సన్నాయి నొక్కులు నొక్కుతారు. వాస్తవంలో కూడా రాష్ట్రంలో ఈ మూడు కులాల సంఖ్య నామమాత్రమే. గత ప్రభుత్వంలో అనధికారికంగా నిర్వహించిన సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్ మొత్తం జనాభాలో రెడ్డి సామాజిక వర్గం 5శాతం కానీ, వారికి దక్కిన శాసన సభస్థానాలు 32. కమ్మ సామాజిక వర్గం 3.5 శాతం, కానీ వారికి దక్కిన శాసనసభ స్థానాలు 35. కాపుల సామాజికవర్గం 10శాతం, కానీ వారికి దక్కిన శాసన సభస్థానాలు 18. బీసీ సామాజిక వర్గాల జనాభా 45శాతం, కానీ వారికి దక్కిన సీట్లు కేవలం 40 స్థానాలు, అసెంబ్లీలోని మొత్తం175 స్థానాలలో జనాభా నిష్పత్తి ప్రకారం 5 శాతం వున్న రెడ్డి సామాజికవర్గానికి 8స్థానాలు మాత్రమే దక్కాలి, కానీ 35మంది శాసన సభ్యులు వున్నారు.



మొత్తం జనాభాలో 3శాతం వున్న కమ్మ సామాజిక వర్గానికి 5 స్థానాలు మాత్రమే దక్కాలి, కానీ 32 మంది శాసన సభ్యులు వున్నారు. ఇదే సమయంలో మొత్తం జనాభాలో45శాతం వున్న బీసీ సామాజిక వర్గాలకు 80 స్థానాలు దక్కాలి, కానీ కేవలం 40 మంది శాసన సభ్యులు మాత్రమే వున్నారు. సమాజంలో కీలకంగా సేవలందించే నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, శాలివాహన(కుమ్మరి), రజక, మహేంద్ర (మేదర) వంటి వందకుపైగా బీసీ కులాలకు చెందిన వారు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటి వరకు చట్టసభలలో ప్రవేశించలేకపోయారు. కనీసం వీరికి నామినేటెడ్ పదవులలో కూడా వీరికి తగిన స్థానం లభించడం లేదు. కీలకమైన నామినేటెడ్ పోస్టుల పంపిణీ కూడా ఏ కులానికి చెందినవారు అధికారంలో వుంటే ఆ కులానికి చెందినవారికే దక్కుతున్నాయి. అందుకు ఒక చిన్న ఉదాహరణ రాష్ట్రంలోని కనకదుర్గ గుడి, శ్రీశైలం, కాణిపాకం, అన్నవరం వంటి ప్రధాన దేవాలయాల ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవులన్నీ ఒకే సామాజికవర్గానికి దక్కాయి. కాకపోతే భార్యకు భోజనం పెట్టి సమాజాసేవ చేస్తున్నామని చెప్పిన చందంగా ఇతర కులాలవారికి వంద రూపాయలు నిధులు కూడా లేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆయా కులాలకు చెందిన వారిని ఆయా కార్పొరేషన్లకు అధ్యక్షులను, డైరక్టర్లను నియమిస్తున్నారు.కొంతమంది ఈ మూడు కులాలవారి గురించి మాట్లాడే సమయంలో పాలక వర్గాలని, అధిపత్య కులాలని ప్రస్తావిస్తారు. అసలు పాలక లేదా ఆధిపత్య కులాలుగా మారడానికి అర్హత ఏమిటి? నిజానికి ఈ మూడు కులాలకంటే ముందు బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన రాజాజీ, ప్రకాశం పంతులు, బూర్గుల రామకృష్ణయ్య పంతులు, పి.వి. నరసింహారావు వంటి వారు ముఖ్యమంత్రులుగా పనిచేసినా వారు పాలక వర్గంగా చెలామణి కాలేదు. బ్రాహ్మణ ముఖ్యమంత్రులకు, ఈ మూడు కులాల నాయకులకు మధ్య వున్న తేడాడబ్బు. దీనిని బట్టి పాలక లేదా అధిపత్య కులాలుగా మారడానికి డబ్బే ప్రధాన అర్హత అనిపిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో రాజకీయ పార్టీల సిద్ధాంతాలు, నాయకుల సామర్థ్యాన్ని బట్టి రాజకీయాలు నడిచేవి. కానీ ప్రస్తుతం డబ్బు చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. ఎంఎల్‌ఎ టిక్కెట్ కావాలంటే ఎన్నికోట్లు ఖర్చుపెట్టగలవు? పార్టీకి ఎన్నికోట్లు చందా ఇవ్వగలవు అని ప్రశ్నిస్తున్నారు. ఈ కారణంగానే రాజకీయాలు, ఎన్నికలు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారాయి అని చెప్పడం కంటే మార్చారు అని చెప్పాల్సి వుంటుంది. శాసన సభ్యునిగా లేదా పార్లమెంటు సభ్యునిగా సామాన్యులెవ్వరూ పోటీచేసే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికలలో కోట్లు ఖర్చుపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టిన ఖర్చుకు కొన్ని వందల రెట్లు అదనంగా సంపాదించడమే రాజకీయాలకు అర్హతగా మారింది. గతంలో తహశీల్దారు, సబ్ కలెక్టరు/ఆర్డిఓ కార్యాలయాలు అర్జీదారులతో కిటకిటలాడేవి. కానీ ప్రస్తుతం శాసన సభ్యుల, పార్లమెంటు సభ్యుల కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. గతంలో కంట్రాక్టు పనులు, వ్యాపారాలు, పరిశ్రమలకు లైసెన్సులు పొందం వంటి సమయాలలో మాత్రమే శాసన సభ్యుల ప్రమేయం వుండేది. కానీ ప్రస్తుతం ఇంటి ప్లాన్ ఆమోదం నుంచి రోడ్డు పక్కన బడ్డీ షాపు పెట్టుకోవడం వంటి చిన్నచిన్న వ్యవహారాలకు కూడా శాసన సభ్యుల అనుమతి కాల్సివస్తోంది. ఇక నియోజకవర్గంలో ఏ ఉద్యోగి అయినా, అధికారి అయినా పనిచేయాలన్నా, బదిలీ కావాలన్నా శాసన సభ్యుని అనుమతి కావాల్సిందే. చివరికి ఉన్నతాధికారులు కూడా తమ కింద ఉద్యోగులను బదిలీ చేయడానికి స్థానిక శాసన సభ్యుల లేఖలు జతచేయాలని కోరుతున్నారు. రాష్ట్ర స్థాయిలో ఏదైన నిర్ణయం చేయాలంటే ముఖ్యమంత్రి కనీసం కేబినెట్ సమావేశంలో ఏర్పాటు చేయాల్సి వుంటుంది. శాసన సభ్యులకు తన నియోజకవర్గంలో ఎవరి అనుమతి అవసరం లేదు.తాను అనుకుంటే ఏదైన చేయగలడు. ఈ మూడు సామాజిక వర్గాల నేతలు అధికారం కోసం పరస్పరం విమర్శలు చేసుకొంటూనే మరో వైపు వైవాహిక సంబంధాలను కలుపుకుంటున్నారు. అధికార రాజకీయాలకోసం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్న నాయకుల ఆధిపత్య ధోరణిని ఇతర సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు గమనిస్తున్నారు. ఉందిలే మంచి కాలం ముందు ముందునా..అందరూ సుఖపడాలి నంద నందనా అనిమహాకవి శ్రీశ్రీఅన్నట్టుగా ప్రజాచైతన్యంతో భవిష్యత్తులోఅందరికి అధికార ఫలాలు అందేరోజులు వస్తాయని ఆశిద్దాం. ●

# ప్రజలకు ప్రాణసంకటంగా మారిన కల్తీ మద్యం!

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈ మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా కూడా విచ్చలవిడిగా కల్తీ మద్యం ఏరులై పారుతూ ప్రజలప్రాణాలతో ఆటలాడుకుంటున్న విషయం మనందరికీ విధితమే. కేవలం స్పిరిట్, రసాయనాలతో తయారుచేసి,పాపులర్ బ్రాండ్‌లను తలపించేలా బాటిళ్లపై నకిలీలేబుల్స్ అతికించి మరీ యధేచ్ఛగా సరఫరా చేస్తూ కల్తీమద్యం తయారీదారులు ఈ మందు ప్రియులను బురిడి కొట్టిస్తూ తమ వ్యాపారాన్ని మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లేటట్లు చేసుకుంటున్నారు అనే మాట అక్షర సత్యం. అయితే ఇది కల్తీ మద్యం అని తెలియని అమాయక ప్రజలు వీటిని సేవించి తమ ఆరోగ్యాన్ని చేజేతులారా పాడుచేసుకుంటున్నారు. ముఖ్యంగా కల్తీ మద్యం సేవనం మూలాన వీటిని తీసుకున్న ప్రజలకు అవయవ వైకల్యం ప్రాప్తించడం, వారికి వినికిడి సమస్యలు తలెత్తడం,దృష్టిలోపం ఏర్పడటం,వారి మూత్రపిండాలు దారుణంగా దెబ్బతిని, చివరకు వారి కాలేయాలు సైతం వైఫల్యానికి గురిఅయ్యి,వారి ప్రాణాలకే ముప్పు ఏర్పడే దయనీయ పరిస్థితులు సైతం వారికి సంప్రాప్తించడం ఎంతైనా ఈసమాజానికి సంబంధించి అత్యంత ఆందోళన రేకెత్తించే విషయం. అయితే ఇంత జరుగుతున్న ఎందుకనో రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ కల్తీమద్యం తయారీకి అడ్డుకట్ట వేయడంలో మాత్రం ఘోర వైఫల్యం చెందుతూనే వున్నారు. అంతేకాదు ఈకల్తీ మద్యం కేసు నిగ్గు తెల్చేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ కేసును సి.బి.ఐ వారికి అప్పగించాలని కూడా వైస్సార్సీపీ గట్టిగా డిమాండ్ చేశారు. ఏదిఏమైనా ఈ కల్తీ మద్యంలో మీథాయిల్, సీసం, ఇతర విష రసాయనాలు కలవడం మూలాన వీటిని సేవించిన మద్యం ప్రియులు తీవ్ర అనారోగ్యాల బారినపడి ఇటు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు, అటు వారి కుటుంబాలను సైతం వారు ఈ మద్యం వ్యసనం మూలాన అధోగతిపాలు చేయడంతో పాటు వారిని రోడ్డు మీద పడేలాచేస్తున్నారు అనేమాట అక్షర సత్యం.ఇక మన రాష్ట్ర ప్రభుత్వం వారైతే 'ఆదాయమే ఏకైక పరమావదిగా భావిస్తూ ప్రజలు ఏమైపోతే మాకేంటి' అనే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం మూలాన మందు ప్రియుల జీవితాలు రోజురోజుకు నరకప్రాయంగా మారిపోతున్నాయి అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు.ఏమైనా మన ప్రజలు ఇప్పటికయినా విచక్షణ జ్ఞానంతో వ్యవహరించి 'ఈ కల్తీ మద్యం వద్దు, తమకు తమప్రాణాలే ముద్దు' అనే నీతి నానుడికి పెద్దపీట వేసి, అంతిమంగా తమ కుటుంబాల బాగోగులు,శ్రేయస్సే తమకు ప్రధానమని తక్షణమే భావించి వారి ఆరోగ్యాలను సర్వనాశనం చేసే, గుల్ల గావించే ఈ మద్యం అనే పాడు, చెడు అలవాటుకు వీలైనంత త్వరగా గుడ్ బై చెప్పగలిగితే వారంతా ఎలాంటి ఇబ్బందుల పాలు కాకుండా వారు,వారిని నమ్ముకున్న వారి కుటుంబాలుసైతం అత్యంత సుఖ,సంతోషాలతో నిండు నూరేళ్ల జీవించగలుగుతారు అనడంలో ఎలాంటి సందేహంలేదు.కాబట్టి ఒక్కసారి ఆలోచించుకోండి మీకు మీ ఆరోగ్యం, మీ కుటుంబ బాగుదల ముఖ్యమా ఈ మద్యం అనే దురలవాటు ముఖ్యమా? ఇక నిర్ణయం తీసుకోవడం మీ వంతు. అంటే మీరు మద్యం అనే చెడుఅలవాటుకు మంగళం పాడిమంచి మార్గంలో వెళ్లడమా లేకచెడుమార్గంలో పయనింపచేసుకోవడమా? అన్నింటికి తుది నిర్ణయంమాత్రం ముమ్మాటికీ మీదే. ●

# పేదరిక నిర్మూలనకు ఏవీ చర్యలు?

డి. జయరాం

దారిద్రం అనేది కేవలం తగినంత డబ్బు లేకపోవడాన్ని సూచించదు. ఇది ఆరోగ్య సంరక్షణ, విద్య, శుభ్రమైన నీరు, నిర్ణయాత్మక స్వేచ్ఛ వంటి ప్రాథమిక మానవ హక్కులు, అవకాశాలకు దూరంగా ఉండటాన్ని సూచిస్తుంది.ఆర్థికవేత్త అమర్త్యసేన్ అభిప్రాయం ప్రకారం పేదరికం అనేది 'సామర్థ్యాల కొరత'. ఇది సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలు తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకోకుండా నిరోధించే ఒక సంక్లిష్టమైన సామాజిక ఆర్థిక రుగ్మత. దారిద్ర్యాన్ని స్థూలంగా నిరపేక్ష పేదరికం అంటే కనీస జీవనాధార అవసరాలు తీరనిస్థితి. సాపేక్ష పేదరికం అంటే సమాజం లోని సగటు స్థాయికంటే తక్కువ ఆదాయంగా వర్గీకరించవచ్చు. నేడు, ఆరోగ్యం,విద్య, జీవన ప్రమాణాలు వంటి అంశాలను కొలిచే బహుముఖ పేదరిక సూచిక ద్వారా సమస్య లోతును సమగ్రంగా అంచనా వేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేదరిక నిర్మూలనకు కృషి జరుగుతున్నప్పటికీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 2030నాటికి అత్యంత పేదరికాన్ని నిర్మూలించాలనే లక్ష్యం కోవిడ్19మహమ్మారి, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల కారణంగా సవాలుగా మారింది. ప్రపంచబ్యాంకు దారిద్ర్యరేఖను రోజుకు 2.15 డాలర్ల కొనుగోలు శక్తికంటే తక్కువ ఆదాయంగా నిర్ణయించింది. ప్రపంచ నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 110 కోట్లకు పైగా ప్రజలు నేటికీ ఆరోగ్య,విద్య, జీవన ప్రమాణాలకు సంబంధించిన బహుముఖ లోపాలను ఎదుర్కొంటున్నారు. మన దేశం గత దశాబ్దంలో పేదరిక నిర్మూలనలో అద్భుతమైన పురోగతిని సాధించింది. ప్రపంచ బ్యాంకు అంచనాల విశ్లేషణ ప్రకారం, 2011-12 నుండి 2022-23 మధ్య కాలంలో మనదేశంలో అత్యంత పేదరికం 27.1 శాతం నుండి 5.3 శాతానికి గణనీయంగా తగ్గింది. ఈ చారిత్రక కాలంలో సుమారు 27కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికం నుండి బయటపడ్డారు.పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో పేదరికం తగ్గడం ప్రభుత్వ మౌలిక సదుపాయాలు,సంక్షేమ పథకాల ప్రభావవంతమైన అమలును సూచిస్తుంది. నీతిఆయోగ్ జాతీయ బహుమితీయ పేదరిక సూచిక నివేదిక కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తూ విద్యుత్, వంట ఇంధనం, పారిశుధ్యం, గృహ వసతి వంటి అంశాలలో మెరుగుదల కారణంగా కోట్లాది మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని స్పష్టం చేసింది. పేదరికం అనేది అనేక వ్యవస్థాపరమైన అంశాల కలయిక. దారిద్ర్యానికి ప్రధాన కారణాలలో ఒకటి సంపద, ఆదాయ అసమాన పంపిణీ. ఆర్థిక వృద్ధి జరుగుతున్నప్పటికీ, దాని ఫలాలు సమాజంలోని సంపన్న వర్గాలకు మాత్రమే చేరడం వలన అసమానతలు పెరుగుతున్నాయి. ఈ అసమానతలు నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరతతో మరింత తీవ్రమవుతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై అధికంగా



ఆధారపడటం, పట్టణాల్లో అసంఘటిత రంగంలో తక్కువ వేతనాలు, సామాజిక భద్రత లేని ఉద్యోగాలు పేదరిక వలయాన్ని కొనసాగిస్తున్నాయి. అంతేకాకుండా నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ లేకపోవడం దారిద్ర్యానికి వ్యవస్థాపరమైన మూలాలుగా నిలుస్తాయి.నిరక్షరాస్యత, అసంపూర్ణ విద్య వలన శ్రామికులు అధిక వేతన ఉద్యోగాలు పొందలేరు. అదే సమయంలో, పేద కుటుంబాలు అనారోగ్యం పాలైనప్పుడు, చికిత్స కోసం అధికంగా అప్పు చేయవలసి వస్తుంది. ఇది వారిని మరింత అప్పుఊబిలోకి నెట్టివేస్తుంది. వీటితోపాటు, అధిక జనాభా పెరుగుదల, సామాజిక, లింగ వివక్ష, ప్రభుత్వసంక్షేమ పథకాల అమలులో అవినీతి, లీకేజీలు కూడా పేదరికాన్ని సుస్థిరంచేస్తాయి. పేదరిక నిర్మూలన ప్రక్రియలో అనేక నిర్మాణాత్మక సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిలో అత్యంత ముఖ్యమైనది 'పేదరిక వలయం'ను ఛేదించడం. ఈ వలయంలో, తక్కువ ఆదాయం, పేలవమైన ఆరోగ్యం, తక్కువ విద్య తరాల నుండి కొనసాగుతూ, కుటుంబం ఎప్పటికీ మెరుగుపడకుండా నిరోధించబడతాయి. రెండవ ప్రధాన సవాలు వాతావరణ మార్పుల ప్రభావం. అకాల వర్షాలు, కరువులు వంటి ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయాధారిత పేదవారి జీవనోపాధిని నాశనం చేసి, వారిని తిరిగి అత్యంత పేదరికంలోకి నెట్టేస్తాయి. మూడవది, సాంకేతిక పరిజ్ఞాన వేగవంతమైన మార్పు వలన నైపుణ్యం లేని శ్రామికులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరచుకోలేని పేదలు పోటీ ప్రపంచంలో వెనుకబడిపోతారు. నాలుగవ సవాలు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు పెరుగుతున్న వలసలు కారణంగా పట్టణ మురికివాడల్లో పేదరికం, వనరుల కొరత కేంద్రీకృతం కావడం.ఈ సవాళ్లు పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన ఏకపక్ష విధానాల అమలును సంక్లిష్టం చేస్తాయి. మొదటిగా ప్రతి పౌరుడికి నాణ్యమైన సార్వత్రిక విద్యఆరోగ్యం అందించడం అత్యవసరం. ఎందుకంటే ఇవి పేదరిక వలయాన్ని ఛేదించే అంశాలలో ప్రధానమైనది. రెండవది వ్యవసాయేతర రంగాలలో, ముఖ్యంగా తయారీ, సేవారంగంలో ఉత్పాదక స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మద్దతుఇవ్వడం ద్వారా ఉద్యోగాలుసృష్టించవచ్చు. ఈలక్ష్యాల కోసం కేంద్రప్రభుత్వం అనేక విధానాలను అమలు చేస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పేదలకు కనీసవేతన ఉపాధి హక్కును కల్పిస్తుంది. దీన్ దయాళ్ అంత్యోదయ యోజన స్వయం సహాయక బృందాలద్వారా ఆర్థికసహాయం అందించి గ్రామీణ పేదలకు స్థిరమైన జీవనోపాధిని సృష్టిస్తుంది. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ద్వారా ఆర్థికచేరికను సాధించి, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా పథకాల ప్రయోజనాలను లీకేజీలు లేకుండా నేరుగా బదిలీ చేయడం జరుగుతోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఉజ్వలయోజన వంటి పథకాలు గృహవసతి, శుభ్రమైన ఇంధనాన్ని అందించి బహుముఖ పేదరికాన్ని తగ్గించడంలో ముఖ్యపాత్ర వహిస్తు న్నాయి.పేదరికం అనేది కేవలం ఒక ఆర్థికసూచిక మాత్రమేకాదు. అన్యాయం, అసమానతలకు అద్దంపట్టే మానవీయ సంక్షోభం.భారతదేశం ఇటీవల సాధించిన పేదరిక తగ్గింపు విజయాలు, లక్షిత విధానాలు, సాంకేతికత ఆధారిత పాలన శక్తిని స్పష్టంగా నిరూపిస్తున్నాయి. ఈపురోగతిని నిలకడగా కొనసాగించడం, మిగిలిన పేదరికాన్ని నిర్మూలించడం, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ అసమానతలను తగ్గించడం ద్వారానే మనదేశం నిజమైన ఆర్థికసామాజిక న్యాయాన్ని సాధించి,అభివృద్ధి చెందిన దేశంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగలుగుతుంది. ●

# ప్రజావాక్కు



## వెండి ధర బంగారాన్ని మించిపోనుందా!

ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం వెండి ధరలు వినియోగదారులనువ్యాపారులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో కిలో వెండి ధర సుమారు లక్ష రూపాయలు వుండగా, రాబోయే దీపావళి సమయానికి ఏకంగా 2,0,6000 రూపాయల మార్కును చేరుకుంది. అంటే కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే వెండి విలువ దాదాపు90శాతంపెరిగింది.సామాన్యప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలు,బంగారం తర్వాత తమ సంపదను కాపాడుకోవడానికి, పెంచుకోవడానికిఎంచుకోవాల్సిన ఉత్తమ మార్గాలలో వెండికూడా ఒకటిగా ఇప్పుడు నిరూపితమవుతోంది.పెద్దపెద్ద సంస్థలుభవిష్యత్ అవసరాల కోసం పెద్దమొత్తంలో వెండినికొనుగోలు చేసినిల్వ చేసుకుంటున్నాయి. ఈ కారణాల వల్ల,వాస్తవ సరఫరా తగ్గి, ధరలు అమాంతంగా పెరుగుతున్నట్లు కథనాలు వస్తున్నాయి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## చెత్త చెదారంతో కొత్తగూడెం పట్టణం

భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రం అయిన కొత్త గూడెం జిల్లా దుమ్ము ధూళితో అపరిశుభ్రంగా ఉంది. బస్‌స్టాండ్ చుట్టూ ప్రధాన వీధుల గుండా ప్లాస్టిక్ కవర్స్ దుమ్ముతో నిండి వుండి అపరిశుభ్రంగా వుంది. నిత్యం కొత్త గూడెంకి ఎంతో మంది వివిధపనుల నిమిత్తం వస్తుంటారు బొగ్గ గనులు వుండడం చుట్టూ పక్కన వున్న ఇల్లందు భద్రాచలం ఖమ్మంల నుండి జన సంచారం వుండడం వల్ల కొత్తగూడెం వ్యాపార కేంద్రంగా వుంది. కొత్త వారు వివిధ పనుల నిమిత్తం వస్తే రోడ్స్ మీద ఉన్న చెత్త చెదారంతో ఇబ్బంది పడుతూ వున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కొత్త గూడెం పట్టణానికి క్లీన్ సిటీగా మార్చాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## బాధ్యత విస్మరించరాదు

తల్లిదండ్రులు మనకు జన్మనిచ్చి, పసితనంలో మనల్ని ప్రేమతో పెంచి, చదువులు నేర్పించి మన భవిష్యత్తును నిర్మించారు. మన జీవితంలో వారు మొదటి గురువులు, నిజమైన దేవుళ్లు.చిన్నప్పుడు వారు నిద్ర మానుకుని మన కోసం కష్టపడ్డారు.మన భవిష్యత్తుకోసం తమ సుఖాలను త్యాగం చేశారు. అలాంటి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారిని నిర్లక్ష్యం చేయడం పెద్దపాపం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## చెత్త చెదారంతో కొత్తగూడెం పట్టణం

భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రం అయిన కొత్త గూడెం జిల్లా దుమ్ము ధూళితోఅపరిశుభ్రంగాఉంది. బస్‌స్టాండ్ చుట్టూ ప్రధాన వీధుల గుండా ప్లాస్టిక్ కవర్స్ దుమ్ముతో నిండి వుండి అపరిశుభ్రంగా వుంది. నిత్యం కొత్త గూడెంకి ఎంతో మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు బొగ్గ గనులు వుండడం చుట్టూ పక్కన వున్న ఇల్లందు భద్రాచలం ఖమ్మంల నుండి జన సంచారం వుండడం వల్ల కొత్త గూడెం వ్యాపార కేంద్రంగా వుంది. కొత్త వారు వివిధ పనుల నిమిత్తం వస్తే రోడ్స్ మీద ఉన్న చెత్త చెదారంతో ఇబ్బంది పడుతూ వున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ప్రతీ సంవత్సరం తగ్గుతున్నాయి. అన్ని విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వపాఠశాలల్లో ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలలో సైతంప్రైవేటు పాఠశాలలపట్ల ఆకర్షితులవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటుకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు,యూనిఫామ్, బెల్ట్, షూ, ఉపకారవేతనాలు, మధ్యాహ్న భోజనపథకాన్ని ప్రభుత్వం అందిస్తోంది. గ్రామాల్లో తల్లిదండ్రులు ఎక్కువగా ప్రైవేటు పాఠశాలల పట్ల ఆకర్షితులవడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేరికలు ప్రతీ సంవత్సరం తగ్గుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగటా నికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## ప్రజలు, స్వర్ణకారులు సతమతం

ఇటీవల కాలంలో బంగారం ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి.దేశీయంగా,అంతర్జాతీయంగా ఆర్థికపరిస్థితులు మార్పుకు లోనవుతుండటమే దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అమెరికా డాలర్ విలువ మార్పులు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల పెరుగుదల,అలాగే భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితి కారణంగా బంగారంవైపుమొగ్గు చూపుతున్నారు.భారతదేశంలో బంగారం కేవలం ఆభరణంగా కాకుండా పెట్టుబడి సాధనంగా భావించబడుతుంది. పండుగలు, పెళ్లిళ్ల వంటి సందర్భాల్లో అధిక డిమాండ్ కూడా ధరలను మరింతగా పెంచుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఈసారి గోవాలో ప్రధాని దీపావళి వేడుకలు



**పనాజి, అక్టోబరు 16:** ప్రతి సంవత్సరం దీపావళి వేడుకలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సరిహద్దుల్లోని జవాన్లతో కలిసి జరుపుకుంటున్న విషయం తెలిసిందే. సైనిక దుస్తులు ధరించి ప్రతి ఏటా ఒక ప్రదేశంలో మోదీ ఈ వేడుకలను జరుపుకుంటూ వస్తున్నారు. జవాన్లకు స్వయంగా స్వీట్లు తినిపించి జాలీగా గుడుపుతుంటారు. అయితే, ఈ సారి గోవాలో దివాళి సెలబ్రేషన్స్ చేసుకోనున్నట్లు తెలిసింది. గోవాలోని నౌకాదళ సిబ్బంది తో ప్రధాని దీపావళి వేడుకలు జరుపుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో భారత్ సాధించిన విజయాన్ని నౌకాదళ సిబ్బందితో జరుపుకోనున్నట్లు పేర్కొన్నాయి. 2014లో ప్రధానిక పదవి చేపట్టినప్పటి నుంచి మోదీ సాయుధ దళాల సిబ్బందితో దీపావళిని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. 2014లో ఆయన లడఖ్‌లోని సియాచిన్ హిమానీనదానికి వెళ్లి అక్కడ గస్తీలో ఉన్న జవాన్లతో వేడుకలు జరుపుకున్నారు. 2015లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని డోగ్రాయ్ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించారు. అక్కడ 1965 ఇండోపాక్ యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. 2016లో హిమాచల్ ప్రదేశ్‌లోని సుమ్దోలోగల భారత్‌చైనా సరిహద్దు సమీపంలో భద్రతా దళం, సైనిక సిబ్బందిని కలిశారు. 2017లో జమ్ము కశ్మీర్‌లోని గురెజ్ సెక్టార్‌లో, 2018లో ఉత్తరాఖండ్‌లోని ఇండోటిబెటన్ బోర్డర్ పోలీసు సిబ్బందితోను, 2019లో జమ్ము కశ్మీర్‌లోని రాజౌరిలో గల సైనికులతోను దీపావళి వేడుకలు జరుపుకున్న మోడీ 2020లో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లోను, 2021లో జమ్ము కశ్మీర్‌లోని నౌషెరాలోను, 2022లో కార్గిల్, 2023లో చైనా సరిహద్దులోని లేప్చా (హిమాచల్‌ప్రదేశ్) సైనిక శిబిరంలో వేడుకలు చేసుకున్నారు. 2024లో కచ్‌లోని సర్ క్రీక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సరిహద్దు భద్రతా దళం, ఆర్మీ, నేవీ, వాయుసేన సిబ్బందిని కలిసి వారితో వేడుకలు చేసుకున్నారు.

# యెమెన్‌లో నిమిషప్రియ హత్యకేసులో స్టే కొనసాగుతోంది

## సుప్రీంకోర్టుకు నివేదించిన కేంద్రం



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** యెమెన్ మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియకు శిక్ష అమలుపై స్టే కొనసాగుతున్నదని గురువారం కేంద్రం సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎలాంటి తీవ్ర పరి ణామాలు చోటుచేసుకోకపోవడం గమనార్హమని పేర్కొంది. భారతీయ నర్సు నిమిష ప్రియను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణశిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహకారం అందిస్తున్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకట రమణి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారని, ఇప్పటివరకు ఈ కేసులో తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోక పోవడం మంచి విషయమని అన్నారు. వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కాగా నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అదిబ్ మెహది భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత ఆ వ్యక్తి ప్రియను వేధించి, పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోప ణలు ఉన్నాయి. 20 16లో అతడిపై ప్రియ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. వారు ఆమెను పట్టించుకోలేదు. దాంతో 2017లో మెహదికి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ ఆ డోస్ ఎక్కువకావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడినుంచి సౌదీకి వెళ్లిపోతుండగా సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేసి మరణశిక్ష విధించారు. భారత ప్రభుత్వం, మత పెద్దల ప్రయత్నాలతో ప్రస్తుతం ఆమె ఉరిశిక్ష స్టే కొనసాగుతోంది.

# చిన్నారుల యాంటిబయాటిక్ సిరప్‌లో పురుగులు



**భోపాల్, అక్టోబరు 16:** ప్రభుత్వ ఆసుపత్రిలో ఇచ్చిన పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించాయి. ఇది చూసి ఒక చిన్నారి తల్లి షాక్ అయ్యింది. ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి తీసుకువచ్చి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఆ సిరప్ స్టాక్‌ను సీజ్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఒక చిన్నారిని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తల్లి తీసుకెళ్లింది. పరీక్షించిన డాక్టర్, అజిత్రోమైసిన్ యాంటీబయాటిక్ సిరప్ సూచించగా ఆసుపత్రి సిబ్బంది ఆ మందు ఇచ్చారు. ఇంటికి చేరుకున్న తర్వాత చిన్నారికి మందు వేసేందుకు అజిత్రోమైసిన్ సిరప్ మూతను ఆ మహిళ తెరిచింది. ఆ యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించడంతో ఆమె షాక్ అయ్యింది. వెంటనే ఆ సిరప్ బాటిల్ తీసుకుని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. తెరిచిన అజిత్రోమైసిన్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి సిబ్బందికి చూపించింది. ఈ సంఘటన కలకలం రేపింది. మరోవైపు ఈ విషయం తెలిసిన వెంటనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ స్పందించారు. మధ్యప్రదేశ్‌లోని ఒక ఔషధ కంపెనీ ఆ అజిత్రోమైసిన్ సిరప్ తయారు చేసినట్లు తెలిపారు. మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి సరఫరా చేసిన ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్స్‌లో స్టాక్ ఉన్న 306 బాటిళ్లను రీకాల్ చేసినట్లు చెప్పారు. కొన్ని సిరప్ బాటిల్స్ పరిశీలించగా వాటిలో పురుగు అవశేషాలు లేవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ తెలిపారు. అయితే టెస్టింగ్ కోసం కొన్ని మందు సీసాలను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ ఔషధం నమూనాలను కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్ లాబొరేటరీకి కూడా పంపనున్నట్లు ఆమె వెల్లడించారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్ వల్ల కిడ్నీలు పాడైన కారణంగా 24 మంది పిల్లలు మరణించారు. మరింత మంది అనారోగ్యం పాలయ్యారు. ఈ సంఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో తాజాగా పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించిన సంఘటన ఆందోళన కలిగిస్తున్నది.



# గుజరాత్ రాజకీయాల్లో భారీ కుదుపు

## కేబినెట్ మొత్తం రాజీనామా.. ఆమోదించిన గవర్నర్

## నేడు రాజ్‌భవన్‌లో కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం

## తాజా కేబినెట్‌లో క్రికెటర్ జడేజా భార్యకు ప్రమోషన్!

**అహ్మదాబాద్, అక్టోబరు 16:** గుజరాత్ రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్యపరిణామాలు. రాష్ట్రంలో కొత్త కేబినెట్ శుక్రవారం కొలువు దీరనుంది. ఈ క్రమంలో గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన 16 మంది మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు మార్గం సులువు చేసేందుకు మంత్రులు రాజీనామాలుచేసారు. గత కొన్ని రోజులుగా కేబినెట్ విస్తరణ ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నివాసంలో మంత్రులు సమావేశం అయ్యారు. బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఈ రాజీనామాలు అంగీకరించారు. అనంతరం గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాజీనామాలు అందజేయగా ఆయన ఆమోదం తెలిపారు. దీంతో శుక్రవారం కొత్త కేబినెట్ కొలువుదీరనుంది . గుజరాత్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహ మిగిలిన మంత్రులు అంతా తమ పదవులకు రాజీనామా చేశారు. గత కొంతకాలంగా గుజరాత్‌లో కేబినెట్ విస్తరణ ఉంటుంది అని అంతా భావించారు. అయితే దీపావళి పండుగకు ముందే ఈ విస్తరణ ఉంటుందని ఊహించ లేదు. ఈ విస్తరణలో కొత్త ము ఖాలు, యువ నాయకులు, ప్రాంతీయసామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఓబిసి పాటిదార్ సమతుల్యత, సౌరాష్ట్రఉత్తర గుజరాత్ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు రవీంద్ర జడేజా భార్య, జామ్‌నగర్ ఎమ్ఎల్ఏ రీవా జడేజాకు కేబినెట్ ర్యాంక్ ప్రమోషన్ ఇవ్వనున్నారనే ప్రచారం జరుగుతుంది. అలాగే ప్రస్తుతం రాజీనామా చేసిన మంత్రుల్లో కొందరికి కొత్త కేబినెట్‌లో ఛాన్స్ ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2027 అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా ఈ విస్తరణ జరుగుతోంది. ఎందుకంటే 2027లో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మధ్యలో మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జగదీష్ విశ్వకర్మ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2027 అసెంబ్లీ ఎన్నికలు, లోకల్ బాడీ పోల్స్‌కు ముందుగా పార్టీ బలాన్ని పెంచే ఉద్దేశ్యంతో ఈ కేబినెట్ విస్తరణ జరుగుతుంది అని తెలుస్తోంది. ప్రస్తుత మంత్రివర్గం ముఖ్యమంత్రి సహ 17 మందితో ఉన్నారు. గుజరాత్ చరిత్రలో అతి చిన్న మంత్రివర్గం ఇదే కావడం విశేషం. 182 సభ్యుల శాసనసభ పరిధిలో 27 మంది వరకు మంత్రులు ఉండవచ్చు. కానీ 17 మందితోనే మంత్రివర్గం ఏర్పడింది. మంత్రివర్గంలో ఈసారి దాదాపు 10 మంది కొత్త వారికి అవకాశం లభించవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో దాదాపు సగం మందిని మార్చే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం గుజరాత్ మంత్రివర్గంలో ముఖ్యమంత్రితో సహా మొత్తం 17 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది క్యాబినెట్ ర్యాంకు మంత్రులు కాగా మిగిలిన వారు సహాయ మంత్రులుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ సారి 22 నుంచి 27 మందికి మంత్రులకు అవకాశం కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాజ్ భవన్‌లో శుక్రవారం నూతన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది.

ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మంత్రివర్గాన్ని శుక్రవారం విస్తరించనున్నారు. మంత్రివర్గ విస్తరణకు అధ్యక్షుడు జెపీ నడ్డా, అమిత్ షా, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సీ.ఆర్. పాటిల్, ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ వంటి సీనియర్ నేతలు హాజరవుతారు.

### కోర్టు హాలులో ఆన్‌లైన్‌లోనే మహిళకు కిస్ ఇచ్చిన లాయర్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** న్యాయస్థానంలో వృత్తిగత హుందాతనాన్ని ప్రదర్శించాల్సిన ఓ న్యాయవాది అనుచితంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఢిల్లీ హైకోర్టులో ఓ కేసు వర్చువల్ విచారణ సందర్భంగా కెమెరా ఆన్‌లో ఉండగానే ఆయన ఓ మహిళను ముద్దుపెట్టుకోవడం కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సదరు లాయర్ తీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆన్‌లైన్ విచారణ కోసం అందరూ లాగిన్ అయి న్యాయమూర్తి రాక కోసం ఎదురుచూస్తున్న సమయంలో కోర్టు దుస్తుల్లో ఉన్న ఆ లాయర్, తన కెమెరాకు కొద్దిగా పక్కకు కూర్చుని ఉన్నారు. ఆ సమయంలోముందు నిల్చుని ఉన్న మహిళ చేతిని ముద్దుపెట్టడం వీడియోలో స్పష్టంగా రికార్డయింది.

# మత్తుమందిచ్చి డాక్టర్ భార్యను హత్యచేసిన వైద్యుడు



**బెంగళూరు, అక్టోబరు 16:** వైద్య వృత్తిని అడ్డం పెట్టుకుని, కట్టుకున్న భార్యను హతమార్చిన ఓ వైద్యుడి కిరాతకం బెంగళూరులో వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో చనిపోయిందని అందరినీ నమ్మించినా, ఆరు నెలల తర్వాత ఫోరెన్సిక్ నివేదిక అసలు నిజాన్ని బయటపెట్టడంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ మహేంద్ర రెడ్డి, డెర్మటాలజిస్ట్ అయిన డాక్టర్ కృతిక రెడ్డి భార్యాభర్తలు. వీరికి గత ఏడాది మే 26న వివాహం జరిగింది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ 21న మున్నెకొల్లాల్‌లోని వారి నివాసంలో కృతిక అస్వస్థతకు గురయ్యారని చెబుతూ ఆమె భర్త మహేంద్ర రెడ్డే దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మరాఠహళ్లి పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంలో క్రైమ్ ఆఫీసర్లు తనిఖీ చేయగా, ఓ కానిలా సెట్, ఇంజెక్షన్ ట్యూబ్ వంటి వైద్య పరికరాలు లభించాయి. వాటిని ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపించారు. మృతురాలి అంతర్గత అవయవాల నమూనాలను కూడా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఎఫ్ఎస్ఎల్ నివేదికలో కృతిక శరీరంలో ప్రోపోఫాల్ అనే శక్తిమంతమైన అనస్థీషియా (మత్తు) మందు ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో ఇది హత్యేనని నిర్ధారణ కావడంతో మృతురాలి తండ్రి అక్టోబర్ 13న తన అల్లుడే మత్తుమందు ఇచ్చి కూతురిని చంపాడని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వేగంగా స్పందించి, అక్టోబర్ 14న కర్ణాటకలోని మణిపాల్‌లో ఉన్న నిందితుడు మహేంద్ర రెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ భార్యను ఆసుపత్రికి తీసుకొచ్చిన భర్త, ఆమెకు మత్తు మందు ఇచ్చిన విషయాన్ని దాచిపెట్టాడు. ఆమె ఆరోగ్యం బాగోలేదని మాత్రమే చెప్పాడు. ఇప్పుడు ఆమె శరీరంలో మత్తుమందు ఆనవాళ్లు బయటపడటంతో, ఇందులో దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమైంది. ఈ కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నాం అని తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పోలీస్ కస్టడీలో ఉన్నాడు. వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించి హత్యను సహజ మరణంగా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన వైద్య వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# పాక్ సైనిక దుస్తులను బహిరంగ ప్రదర్శనకు పెట్టిన తాలిబన్లు!



**కాబూల్, అక్టోబరు 16:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. సరిహద్దుల్లో భీకర ఘర్షణల నేపథ్యంలో, పట్టుబడిన పాకిస్థాన్ సైనికుల ప్యాంట్లు, రైఫిళ్లను ఆఫ్ఘన్ సైనికులు, తాలిబన్ అనుబంధ మిలీషియా సభ్యులు ఆఫ్ఘన్ నగర వీధుల్లో ప్రదర్శిస్తూ అవమానపరిచారు. కార్ల మీద నిలబడి, స్వాధీనం చేసుకున్న వస్తువులను ప్రదర్శిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా తూర్పు నంగర్‌హార్ ప్రావిన్స్‌లో ఈ ప్రదర్శన జరిగినట్లు ఆఫ్ఘన్ జర్నలిస్ట్ దావూద్ జున్‌బిష్ 'ఎక్స్' వేదికగా ఒక ఫొటోను పంచుకున్నారు. "డ్యూరాండ్ లైన్ వద్ద పాకిస్థాన్ సైన్యం విడిచిపెట్టిన సైనిక పోస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఖాళీ ప్యాంట్లను ప్రదర్శించారని ఆయన ఆ ఫొటోకు క్యాప్షన్ జతచేశారు. ఈ వీడియోల ప్రామాణికతను స్వతంత్రంగా ధ్రువీకరించలేనప్పటికీ, ఇవి ఇరు దేశాల మధ్య నెలకొన్న తీవ్రమైన వైషమ్యాలకు అద్దం పడుతున్నాయి. ఆశ్చర్యకరంగా, ఇరు దేశాల మధ్య బుధవారం నుంచి 48 గంటల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ ఈ ప్రదర్శనలు జరగడం గమనార్హం. సరిహద్దుల్లో జరిగిన ఘర్షణల్లో ఇరువైపులా డజన్ల కొద్దీ సైనికులు, పౌరులు మరణించడంతో ఈ ఒప్పందం కుదిరింది. అయితే కాల్పుల విరమణకు ఎవరు ముందు ప్రతిపాదించారనే దానిపై కూడా ఇరు దేశాలు పరస్పరం భిన్నమైన ప్రకటనలు చేశాయి. తహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) నాయకుడిని లక్ష్యంగా చేసుకుని కాబూల్‌లో పాకిస్థాన్ వైమానిక దాడులు చేయడంతో ఇటీవలి ఘర్షణలు మొదలయ్యాయి. టీటీపీకి ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాక్ ఆరోపిస్తోంది. దీనికి ప్రతీకారంగా, ఆఫ్ఘన్ దళాలు డ్యూరాండ్ లైన్ వెంబడి పాక్ సరిహద్దు పోస్టులపై దాడులు చేశాయి. మరోవైపు, ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ గ్రూప్ (ఐఎస్‌కే) దాడులకు పాక్ సైన్యం సహకరిస్తోందని ఆఫ్ఘనిస్థాన్ ఎదురుదాడి చేస్తోంది. ఈ ఘర్షణల్లో డజన్ల కొద్దీ శత్రు సైనికులను మట్టుబెట్టినట్లు ఇరుపక్షాలు ప్రకటించుకున్నాయి. పాక్ దాడుల్లో ఆఫ్ఘన్ పౌరులు లక్ష్యంగా మారారని తాలిబన్లు ఆరోపించారు. తమ దేశం ఉగ్రవాద బాధితు రాలని, దాడుల సమయంలో పౌర నష్టం జరగవచ్చని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖావాజా ఆసిఫ్ గతంలోనే హెచ్చరించారు. 58 మందికి పైగా పాక్ సైనికులు మరణించారని, వందల మందిని బందీలుగా పట్టుకున్నామన్నారు.

## సంక్షిప్తంగా..

### వెనుజులాలో సిఐఎ రహస్య ఆపరేషన్‌కు ట్రంప్ గ్రీన్ సిగ్నల్



**వాషింగ్టన్, అక్టోబరు 16:** అమెరికాలోకి అక్రమంగా మాదకద్రవ్యాలు రావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి నుంచి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా పడవలపై ఇటీవల అమెరికా సైన్యం పలుమార్లు దాడులు చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక విషయం బయటపెట్టారు. వెనుజులాలో రహస్య కార్యకలాపాలు నిర్వహించేందుకు తాను సిఐఎకు అధికారికంగా అనుమతిచ్చినట్లు తెలిపారు. బుధవారం ఓవెల్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారనే దానిపై స్పష్టతనిచ్చారు. వెనుజులా నుంచి పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు వస్తున్నా యన్నారు. సముద్రం ద్వారా వస్తున్న వాటిని అడ్డుకోవడంతోపాటు ఆ దేశ ప్రజలు ఇక్కడ నేరాలకు పాల్పడి యు ఎస్ జైళ్లలో ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో వారు మరిన్ని దాడులకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు.

### సిఎం పదవి ఇస్తానన్నా వద్దన్నా: రామ్‌దేవ్‌బాబా



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** యోగా గురు బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ముఖ్యమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా, పదవులపై ఆసక్తి లేకపోవడంతో దానిని సున్నితంగా తిరస్కరించానని వెల్లడించారు. దేశానికి సేవ చేయడమే తన ఏకైక లక్ష్యమని, అధికారం, కీర్తి ప్రతిష్ఠలపై తనకు ఏమాత్రం వ్యామోహం లేదని స్పష్టం చేశారు. రిపబ్లిక్ మీడియా నెట్‌వర్క్ నిర్వహించిన రాష్ట్ర సర్వోపరి సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఆఫర్ చేశారు. నా వాళ్లను రాజ్యసభకు పంపమని, సొంతంగా పార్టీ పెట్టమని కూడా చాలామంది అడిగారు. కానీ నాకు అధికారంపై ఆశ లేదు. నా జీవితంలో ఒకే ఒక్క లక్ష్యం ఉంది, అది భరతమాతకు సేవ చేయడ మేనని రాందేవ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ఏదో ఒకటి అవ్వాలని కాకుండా, దేశం కోసం ఏదైనా చేయాలని ఆలోచించండి.

### కర్ణాటకలో టెన్త్‌పాస్‌కు 33 మార్కులే!

**బెంగళూరు, అక్టోబరు 16:** పదో తరగతి విద్యార్థులకు కర్ణాటక ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. పబ్లిక్ పరీక్షలో పాస్ మార్కులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై ప్రతీ సబ్జెక్ట్‌లో 33 మార్కులు తెచ్చుకుంటే పాస్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటీ అరా మార్కులతో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, దీనిని నివారించేందుకే ఈ నిర్ణయం తీసు కున్నామని కర్ణాటక మంత్రి మధు బంగారప్ప పేర్కొన్నారు. గతేడాది వరకు పదో తరగతిలో పాస్ కావాలంటే ప్రతి సబ్జెక్ట్‌లో తప్పనిసరిగా 35 శాతం మార్కులు తెచ్చు కోవాల్సిందే. ఒకటీ అరా మార్కులతో ఫెయిలైన విద్యార్థి తిరిగి సప్లిమెంటరీ పరీక్షల కోసం వేచి ఉండాలి. ఈ గ్యాప్‌లో విద్యార్థులను వారి తల్లి దండ్రులు పనికి పంపించడం, ఆడపిల్లలైతే పెళ్లి చేసి పంపించడం చేస్తున్నారని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి బంగారప్ప చెప్పారు. ఆ తర్వాత పిల్లలు చదువుకు శాశ్వతంగా దూరమవుతున్నారని తెలిపారు. దీనిని తప్పించేందుకు పాస్ మార్కులను 33 కు తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు.

### చైనా కరెన్సీలో భారత్ చెల్లింపులు: రష్యా డిప్యూటీ పిఎం



**మాస్కో, అక్టోబరు 16:** రష్యా చమురు కొనుగోళ్లకు చైనా కరెన్సీ యువాన్‌లో భారత్ చెల్లింపులు చేస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ వెల్లడించారు. అయితే అది స్వల్ప మొత్తంలోనేనని, ఎక్కువ శాతం లావాదేవీలు రూబుల్స్‌లోనే జరుగుతున్నాయని స్థానిక మీడియా సంస్థతో మాట్లాడారు. రష్యా చమురుకు భారత్ రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా ఉన్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించిన తర్వాత ఈ చమురు కొనుగోళ్లు భారీగా పెరిగాయి. దాంతో రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అప్ప టి నుంచి వ్యాపారలావా దేవీల కోసం ప్రత్యా మ్నాయ కరెన్సీలు యు వాన్, యుఎఇ, దిరమ్ వాడకం పెరిగింది. ఇదిలా ఉంటే.. సెప్టెం బరులో రష్యా నుంచి చమురు కోసం భారత్ 2.5 బిలియన్ యూరోలను వెచ్చించింది. అంతకుముందు నెలతో పోలిస్తే అది 14 శాతం తక్కువ కావడం గమనార్హం.

# ఇంకా కొలిక్కిరాని 'సర్దుబాట్లు'!

## - లాలూకు రాహుల్ ఫోన్ - 61 సీట్లిచ్చేందుకు ఆర్‌జెడి ఓకే? - మహాకూటమి నేడు ఆధికారిక ప్రకటన

## - 16మందితో కాంగ్రెస్ తొలి జాబితా - బిజెపి - జెడియు అభ్యర్థులు ఫైనల్ - 40మంది బిజెపి స్టార్ క్యాంపెయినర్లు



**పాట్నా, అక్టోబరు 16:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గురువారం ఉదయం ఫోన్ చేశారు. మహా కూటమిలో సీట్ల సర్దుబాటు అంశంపై ఇరువురు సమాలోచనలు జరిపినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ బీహార్ శాఖ కోరినట్లు 70-75 సీట్లు ఇచ్చేందుకు ఆర్‌జెడి సుముఖంగా లేదని, కాదు కూడదంటే 60-16 స్థానాలు కేటా యిస్తామని ఆ పార్టీ అగ్రనేతలు లాలూ, తేజస్వి తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో లాలూకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఫోన్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తమ్మీద సీట్ల సర్దుబాటుకు సంబంధించిన చర్చలు తుదిదశకు చేరుకున్నాయని, శుక్రవారం అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇండియా కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పష్టం చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ 16 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. ఇందులో సిట్టింగ్ స్థానాలే అధికంగా ఉన్నాయి. ఇక లాలూ తనయుడు, జన్‌శక్తి జనతా దళ్ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ యాదవ్ మహువ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ మేరకు గురువారంనాడు నామినేషన్ దాఖలు చేశారు. తేజ్‌ప్రతాప్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొంటూ సోదరి రోహిణి ఆచార్య సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. అటు ఎన్‌డియేలోని ప్రధాన భాగస్వామ్య పార్టీలు బిజెపి-జెడియు తమకు కేటాయించిన చెరో 101 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేశాయి. బిజెపి తొలి జాబితాలో 71, రెండో జాబితాలో 12 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించగా, మూడో జాబితాలో మిగిలిన 18 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అలాగే జెడియు గురువారంనాడు మిగిలిన 44 స్థానాలకు తమ పార్టీ అభ్యర్థుల పేర్లతో జాబితా విడుదల చేసింది. మొత్తమ్మీద జెడియు ఒబిసి-37, ఇబిసి-22, జనరల్-22, ఎస్‌సి-15, ఎస్‌టి-1, ముస్లిం 4 స్థానాలకు కేటాయించింది. సిఎం నితీశ్ కుమార్ ఎన్నికల ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు. గురువారంనాడు పలు నియోజకవర్గాలలో ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. అలాగే రాష్ట్రీయ లోక్‌మోర్చా తమకు కేటాయించిన ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సంబంధించి భారతీయ జనతా పార్టీ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఆ పార్టీ అగ్రనేతలు అమిత్ షా, జెపి నడ్డా సహా 40 మందితో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఎన్నికల అధికారులకు అందజేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటైంది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ నేతృత్వంలో కొత్త కూటమి ఏర్పాటైంది.

మూడో కూటమిలో ఎంఐ ఎంతో పాటు ఆజాద్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ లోక్ జన్‌శక్తి పార్టీ, తేజ్‌ప్రతాప్ నేతృత్వంలోని జెజెడిలతో కూటమిగా ఏర్పడ్డాయి.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# ఆక్వారంగంలో సవాళ్లు అంశంపై జాతీయ స్థాయి సదస్సు

## తణుకు డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన సదస్సు

**తణుకు, అక్టోబర్ 16(ప్రభాత వార్త):** తణుకు చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఆక్వా ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ – వికసిత ఆంధ్రప్రదేశ్ కోసం అవకాశాలు, సవాళ్లు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సు భారత ప్రభుత్వ విద్యాశాఖకు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్), హైదరాబాదు సదరన్ రీజనల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతోంది. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ ఆక్వా రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి వెన్నెముకలాంటిదని, ఈ రంగం అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడాలంటే సాంకేతికత, పరిశోధన, మార్కెటింగ్‌లో ఆవిష్కరణాత్మక మార్పులు అవసరమన్నారు. విద్యార్థులు, యువ వ్యాపారవేత్తలు ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని సూచించారు. కీ నోట్ స్పీకర్‌గా ప్రొఫెసర్



జె.చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఆక్వా రంగ అభివృద్ధికి పాలసీ మద్దతు, ఎగుమతుల విస్తరణ, పర్యావరణ పరిరక్షణ సమాంతరంగా నడవాలన్నారు. స్థిరమైన ఉత్పత్తి పద్ధతులు మాత్రమే దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.ఏడుకొండలు మాట్లాడుతూ ఈ సదస్సు వాణిజ్యశాస్త్ర విభాగానికి గర్వకారణమని, విద్యార్థులు పరిశోధనాభిలాషతో కొత్త ఆలోచనలు, వ్యాపార పద్ధతులను నేర్చుకోవాలని కోరారు. ఇలాంటి అకడమిక్ కార్యక్రమాలు భవిష్యత్ వ్యాపారవేత్తలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ ఐ.వి.నారాయణ, వాణిజ్యశాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు మాట్లాడుతూ ఆక్వా రంగం అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ విధానాలు, పరిశోధన,

7వ పేజీలో

# జీఎస్టీ తగ్గింపుతో ఆటో మొబైల్ రంగంలో ప్రజలకు మేలు

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం అక్టోబర్ 16ప్రభాతవార్త :** నూవర్ జీఎస్టీ...సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ తగ్గింపుతో ఆటోమొబైల్ రంగంలో ప్రజలకు చేకూరిన ప్రయోజనాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.వాహనాలపై భారీ మొత్తంలో జిఎస్టి తగ్గింపు కారణంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు రవాణా శాఖ, వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భీమవరం లూథర్న్ హై స్కూల్ గ్రౌండ్ నుండి వాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జెండా ఊపి ప్రారంభించి, స్వయంగా స్కూటీ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు.



# నిర్దేశించిన లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

## పూర్తిచేస్తే అభినందనలు- జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు, అక్టోబర్, 16 : ప్రభాతవార్త :** జిల్లాలో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా చేపట్టవలసిన టాయిలెట్స్ నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ/వార్డ్ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తులు, టాయిలెట్లు, త్రాగునీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పనలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి., గురుకుల వసతి గృహాలలో త్రాగునీటిని పరీక్షించి, కలుషిత నీరు సరఫరా అయ్యే చోట ఆర్.ఓ., ప్లాంట్ లు ఏర్పాటుచేయాలని, మంజూరైన టాయిలెట్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 52 ప్రభుత్వ వసతి గృహాలకు మరమ్మత్తు పనులు చేపట్టేందుకు 5. 73 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, వాటిని కూడా నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలన్నారు. పూర్తిచేసిన పనులకు సంబందించిన బిల్లులను చెల్లింపుల కోసం ఆన్లైన్ లో అప్లోడ్



చేయాలన్నారు. సచివాలయాల వద్ద నిర్మించే కమ్యూనిటీ టాయిలెట్ కాంప్లెక్స్ లను వెంటనే పూర్తిచేయాలన్నారు. వసతి గృహాలలో దోమల సమస్య పరిష్కారానికి దోమతెరలు అందించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థినీ, విద్యార్థుల భద్రతకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలనీ, వాటిని దగ్గరలోని పోలీస్ స్టేషన్ లలో పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో 390 టాయిలెట్లు మంజూరు కాగా, వాటిలో 313 టాయిలెట్లు పూర్తిచేశారని, మిగిలినవి ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన ద్వారకా తిరుమలలో పారిశుద్ధ్య పరిస్థితులు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ద్వారకాతిరుమల గ్రామంలో పర్యాటకుల ఉపయోగార్థం పబ్లిక్ ప్రదేశాలలో అవసరమైన టాయిలెట్ల నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించిన అధికారులను అభినందిస్తానని, అదే సమయంలో లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా నిర్దేశించిన సమయంలో లక్ష్యాలను పూర్తిచేసిన భీమడోలు ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ ని కలెక్టర్ అభినందించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాధబాబు, ఐసిడిఎస్ పీడీ శారద, సిపిఒ వాసుదేవరావు, సమగ్రశిక్ష ఏపిసి పంకజ్ కుమార్, పర్యాటకాభివృద్ధి అధికారి పట్టాభి రామయ్య, వివిధ శాఖ అధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ ముప్పుపై స్పందన: అధికారుల

# చర్యతో పరిసరాలు శుభ్రం

**పెనుగొండ, అక్టోబర్ 16 ( ప్రభాత వార్త ):** పెనుగొండ, పశ్చిమ గోదావరి జిల్లా "వార్త" పత్రికలో అక్టోబర్ 15న ప్రచురితమైన "ప్లాస్టిక్ గ్లాసులు, బీర్ బాటిళ్లతో మురికిగా మారిన బ్రాందీ షాపు పరిసరాలు" అనే వార్తకు స్థానిక అధికారులు స్పందించారు. పత్రికలో వచ్చిన దృశ్యాలు, ప్రజల ఆందోళనల నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి పరిసర శుభ్రత కార్యక్రమం చేపట్టారు. రోడ్డు పక్కన ఉన్న పొడి గడ్డి ప్రాంతం నుండి ప్లాస్టిక్ బాటిల్స్, అస్తికు గ్లాసులను, బీరు బాటులను తొలగించారు.వేగవంతమైన వ్యర్థ తరలింపు కోసం ప్రత్యేక వాహనాలు వినియోగించారు. "ప్రభుత్వ స్పందన సత్వరంగా రావడం సంతోషకరం. కానీ దీన్ని ఒకసారి శుభ్రం చేయడమే కాక, దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరం.శుభ్రత అనంతరం తీసిన చిత్రాల్లో పరిసరాలు క్లీన్‌గా, ప్లాస్టిక్ ముప్పు తగ్గినట్లు స్పష్టంగా కనిపిస్తోంది."పత్రికలో వచ్చిన వార్త వల్లే అధికారులు స్పందించారు" అని స్థానికులు అభిప్రాయపడ్డారు. "ఇలాంటి చర్యలు తరచూ జరిగితేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది" అని స్థానికులు పేర్కొన్నారు.



# సూర్య విద్యార్థులచే ఘుమ ఘుమలు - ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్





**నరసాపురం ప్రభాతవార్త :** నరసాపురం శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో గురువారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా జరిగింది. చరిత్ర నుండి నేటి వరకు ఉన్న ఆహార సంస్కృతిని ఇక్కడ విద్యార్థులు వివిధ వంటకాలను ప్రదర్శించడానికి స్టాళ్లను ఏర్పాటు చేయడం ఆకట్టుకుంది. వంట నైపుణ్యాలను, ముఖ్యంగా తల్లిదండ్రుల మధ్య ఆహార పదార్థాల తయారు చేయడం, సుపరిచితమైన మరియు కొత్త రకాల వంటకాల ప్రదర్శన, విద్యార్థులకు ఆనందాన్ని, వినోదాన్ని అందించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణాన్ని కనిపించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను ఒక ఆహ్లాదకరమైన మరియు ఇంటరాక్టివ్ సెట్టింగ్‌లో ఒకచోట చేర్చడంతో కార్యక్రమం విజయవంతమైంది. పాక శాస్త్ర ప్రతిభ మరియు సంప్రదాయాలను హైలైట్ చేయడానికి వారి ఆహార పదార్థాల ద్వారా విభిన్న సంస్కృతులను రానున్న తరాలకు అందించడం కోసం పాఠశాల స్థాయిలో జరిపే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు గొప్ప అనుభూతిని కలిగిస్తాయని "శ్రీ సూర్య విద్యాసంస్థల సెక్రటరీ %డ% కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ఉపాధ్యాయినిలు శ్రీమతి జి. భవాని, బి. కోటేశ్వరి, పి. కోమలవల్లి, కె. ప్రసూన, ఎ. శ్రీదుర్గ, సి హెచ్. భవాని లకు కరెస్పాండంట్ బ్రహ్మాజీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సూర్య విద్యాసంస్థల సెక్రటరీ %డ% కరస్పాండెంట్ శ్రీ ఘంటసాల బ్రహ్మాజీ, స్కూల్ అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి ఘంటసాల హేమవల్లి, కళాశాల అకడమిక్ అడ్వైజర్ బి. రామచంద్రారెడ్డి,



స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సతీష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. శ్రీనివాస్, డి. శ్రీకళ,ఎమ్. రాజేష్, కె. నాగశ్రీను, ప్రైమరీ & హైస్కూల్ ఉపాధ్యాయులు, ఆఫీస్ సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# స్వదేశీ వస్తువులు వినియోగించాలి

## బిజెపి మండల అధ్యక్షులు శ్రీకాంత్

**మునునూరు, అక్టోబర్16 ప్రభాతవార్త:** ప్రజలందరూ స్వదేశ వస్తువులను వినియోగించాలని బిజెపి మండల అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కార్యాలయం లో ఆయన అధ్యక్షతన ఇంటింటా స్వదేశీ మన ఇంట స్వదేశీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . దేశ అభివృద్ధి కోసం భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా వైస్ ప్రెసిడెంట్ కంచర్ల రాంబాబు మండల ప్రధాన కార్యదర్శి దేవరాయ సంతోషమ్మ ,కొమకూరు సీతమ్మరాణి , కె. కృష్ణవేణి ఎస్సీ మోర్చా అధ్యక్షులు కె. జానేష్, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు



కంచర్ల శ్రీనివాసరావు, చెన్నూ సత్యనారాయణ , మానికల శ్రీరామ్ , ఉపాధ్యక్షులు ఆముదాల క్రాంతికుమార్ , మండల సెక్రెటరీ బైరవపాటి తిరుపతయ్య, మండల సెక్రెటరీ బుదుపులు బిందు, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సోషల్ మీడియా క్రియేటర్స్ కు ప్రత్యేక సమావేశం

## సబ్ కలెక్టర్ వినూత్న

**నూజివీడు, అక్టోబర్16 ప్రభాతవార్త:** నూజివీడు సబ్-డివిజన్ పరిధిలోని యువతీ యువకులకు తమ సృజనాత్మకత, డిజిటల్ నైపుణ్యాలు, సామాజిక బాధ్యతను ప్రదర్శించడానికి ప్రత్యేక కార్యక్రమం శుక్రవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ " ఫ్రమ్ నూజివీడు ఉయ్ లీడ్ "అనే ప్రత్యేక డిజిటల్ ప్లాట్ ఫాం ద్వారా యువత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవా చర్యలు , విజయాలను ప్రజలకు చేరవేయడానికి అవకాశం లభిస్తుంది. ఈ సమావేశంలో యువతకు డిజిటల్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా అవుట్రీచ్, సృజనాత్మక ఈ వేదిక ద్వారా నూజివీడు డివిజన్ పరిధిలోని సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్ యువత కూడా నూజివీడు అభివృద్ధిలో భాగస్వామి అవుతూ, ప్రజలకు మీ యొక్క సృజనాత్మకతో కూడిన ఆలోచనలు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం యొక్క సేవలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండుటకు అవకాశం ఉంది.ఆసక్తి కలిగిన సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సబ్-కలెక్టర్, పిలుపునిచ్చారు.

# నకిలీ మద్యం పై వై సి పి భారీ ధర్నా ముదునూరి బైక్ ర్యాలీ..

## ఎక్సయిజ్ కార్యాలయం వద్ద బైటాయింపు









ప్రభాతవార్త నర్సాపురం : నరసాపురం నియోజకవర్గ వైసీపీ ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం భారీ ధర్నా జరిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు నాయకత్వం వహించారు. నకిలీ మద్యంతో కూటమి ప్రభుత్వం అమాయక ప్రజల ప్రాణాలు తీస్తోందని విమర్శించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలకు ప్రజలు మోసపోయి ఓట్లు వేశారని ఏడాదిలోనే వారు నిజం గ్రహించారు అన్నారు. మున్సిపల్ చైర్మన్ వెంకటరమణ పలువురు సర్పంచులు కౌన్సిలర్లు పట్టణ గ్రామ వైసీపీ నాయకులు మహిళలు భారీగా పాల్గొన్నారు. తులత పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

# రవాణా శాఖ ఆధ్వర్యంలో సూపర్ సేవింగ్ సూపర్ జిఎస్టి



**నూజివీడు, అక్టోబర్16 ప్రభాతవార్త:** నూజివీడు పట్టణంలో సూపర్ సేవింగ్స్ సూపర్ జిఎస్టి అనే నినాదంతో రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం బస్టాండ్ నుండి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు , 100 వాహనాలతో కొత్త కార్లు,ఆటోలతో భారీగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పేద,మధ్యతరగతి వర్గాలకు,వ్యవసాయ, విద్యా వ్యాపార రంగానికి సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్ డి ఏ ప్రభుత్వానికి కార్లు,ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎన్డీఏ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.నూజివీడు రమణా శాఖ అధికారులు బాలేంద్ర శేఖర్,కృష్ణవేణి ల ఆధ్వర్యంలో నూజివీడు మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ ర్యాలీని ప్రారంభించారు.నూజివీడు రవాణా శాఖ అధికారి బాలేంద్ర శేఖర్ మాట్లాడుతూ గత నెల 24 నుండి ఈ నెల 19 వరకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అంటూ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న భాగంగా నేడు నూజివీడులో కార్లు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించామని ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం నిర్వహిస్తున్నామని చిన్న వాహనాలు ట్రాక్టర్లో కారులకు గతంలో 28% ఉన్న జీఎస్టీ ని 12% కి తగ్గించడం జరిగిందని వాహనాలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 12 శాతం నుండి 5 శాతం తగ్గించడం జరిగిందని వాహన టైర్లపై కూడా 12% నుండి 5% తగ్గించడం జరిగిందని ప్రతి నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

# మద్యం మత్తులో ఇంటికి నిప్పు

**మునునూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** మద్యం సేవించిన మత్తులో ఒక వ్యక్తి తాను నివసించే ఇంటికి నిప్పంటించిన సంఘటన గురువారం జరిగింది. మునునూరు మండలం కాత్రేనిపాడు గ్రామం నందు కలపాల ధర్మయ్య కుమారుడు కలపాల పోతురాజు మద్యం సేవించి ఘాతుకానికి పాల్పడ్డాడు . తాటి ఆకులతో కప్పబడిన ఇంటిని తగలబెట్టాడు. ఆ ఇంటిలో 2 ఫుల్ గ్యాస్ సిలిండర్లు పేలిపోవడంతో అక్కడ చుట్టుపక్కల జన సంచారం లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. గ్రామస్తుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది తరలివచ్చి గ్రామానికి నష్టం జరగకుండా మంటలను అదుపు చేశారు. తాసిల్దార్ ప్రశాంతి జరిగిన నష్టం పై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

# మోటార్ సైకిల్ దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్

## ఐదు మోటర్ సైకిళ్లు స్వాధీనం

**తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త:** మోటార్ సైకిళ్ళ దొంగతనం కేసులో ముగ్గురు చేసినట్లు, వారి వద్ద నుంచి ఐదు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకుందామని తాడేపల్లిగూడెం రూరల్ సిఐ రవి కుమార్ తెలిపారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. పెంటపాడు మండలం రావిపాడులో బైక్ దొంగతనం జరిగిందంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు పెంటపాడు ఎస్సై కె. సి హెచ్.స్వామి దర్యాప్తు చేశారు. చిలకంపాడు లాకుల సమీపంలో అనుమానంగా తిరుగుతున్న ముగ్గురిని పట్టుకుని విచారించారు. వారు ఐదు బైకులు దొంగతనం చేయడంతో పాటు, గుడిలో హుండీ ని కూడా కొల్లగొట్టినట్టు చెప్పారు. నిందితుల ముగ్గురిలో ఒకరు మైనర్ కావడంతో అతనిని జువైనల్ కోర్టుకి పంపి, మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు తణుకు కు చెందిన ర్యాలీ లోకేష్, మానుపాటి దుర్గాప్రసాదుగా గుర్తించినట్లు తెలిపారు. కేసు ఛేదించిన పెంటపాడు ఎస్ఐ ను, అతనికి సహకరించిన కానిస్టేబుల్స్ అనిల్ కుమార్, మోహన్, నవీన్, హెూంగార్డ్ వెంకటేశ్వరరావు ని రూరల్ సీఐ రవికుమార్ అభినందించారు.



# పరిసరాలను పరిశుభ్రం చేసిన సొసైటీ అధ్యక్షులు

**చాట్రాయి, అక్టోబర్ 16, ప్రభాతవార్త :** చాట్రాయి మండలం నరసింహారావు పాలెం గ్రామంలో సచివాలయం వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో పాటు వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందికరంగా ఉండటంతో నరసింహారావు పాలెం సహకార సంఘం అధ్యక్షులు కట్టా నాగ దుర్గారావు స్పందించారు. ఈ మేరకు జెసిబి తో ఆ పరిసర ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రజలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా లేని పక్షంలో అనేక అనారోగ్యాలు కు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.



# వైసిపి ఆధ్వర్యంలో రచ్చబండ.



అత్తిలి- అక్టోబర్ 16( ప్రభాత వార్త) :పేదవర్గాల పిల్లలకు వైద్యవిద్య చేరువచేయాలని, వైద్య కళాశాలల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో ఏర్పాటుచేసిన వైద్య కళాశాలలను చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టే విధంగా వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు.. వైద్యకళాశాలలు ప్రభుత్వం నడిపితే పేదలకు వైద్యవిద్య, వైద్యసేవలు అందుతాయని, చంద్రబాబు అనుకున్నట్టుగా ప్రైవేటీకరణ చేస్తే ప్రజలు మెరుగైన వైద్యానికి డబ్బులు వెచ్చించాలని, వైద్యవిద్యకు డబ్బులు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు.. వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా పాలి, కేవస్ గట్టు, అత్తిలి గ్రామాలలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు కుటిల బుద్ధితో వైద్య కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టే విధానాన్ని పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగా వైద్యకళాశాలలపై ప్రజాభిప్రాయాన్ని కోటి సంతకాల రూపంలో సేకరించి గవర్నర్‌కు అందచేసి ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని కృషిచేస్తున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎంత డబ్బు ఖర్చయినా ఆపరేషన్ అయినప్పటికీ ఉచితంగా చేసుకునే వెసులుబాటు ఉండేలా కళాశాలలు తీర్చిదిద్దారని, కానీ చంద్రబాబు పేదలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందకుండా మోకాలడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఐదేళ్లలో రెండేళ్లు కోవిడ్‌తో గడిచిపోయినా మిగిలిన మూడేళ్ల కాలంలో 17 కళాశాలలు ఏర్పాటుకు సంకల్పించి 5 కళాశాలల్లో వైద్యం, వైద్యవిద్య అందుతుందని అన్నారు. ఆరోగ్యానికి జగన్ ఎంతో ప్రాధాన్యతనివ్వడాని ఆరోగ్యశ్రీకి రూ. 25 లక్షలకు పెంచారని, ఉద్దానంలో తాగునీరు సరిగాలేక కిడ్నీలు పాడైపోతుంటే కిడ్నీ సెంటర్‌ను ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. విద్య, వైద్యాన్ని భ్రష్టుపట్టించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, ఇప్పటికే ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో పెట్టిన కారణంగా ఆరోగ్యశ్రీ మూతపడిపోయి ప్రజలు ఉచిత వైద్యం కోసం అల్లాడిపోవాల్సిన దుస్థితి ఏపీలో నెలకొందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ భరణి ప్రసాద్, మండల వైసీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం విక్రయ దుకాణాలలో క్యూఆర్ కోడ్ ధృవీకరణ తప్పనిసరి

## -నకిలీ, కల్తీ మద్యం విక్రయంపై పూర్తి నిఘా -ఎక్సైజ్ సర్కిల్ స్పెక్టర్ మస్తానయ్య

చాట్రాయి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: మద్యం విక్రయాలలో క్యూఆర్ కోడ్ ధ్రువీకరణ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందని నూజివీడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం మస్తానయ్య చెప్పారు. మద్యం విక్రయ వ్యవస్థలో పారదర్శకతను మరియు ప్రజల ఆరోగ్య రక్షణను నిర్ధారించడానికి ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ .376 అమల్లోకి తీసుకు వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని రిటైల్ మద్యం దుకాణాలు మరియు బార్లలో అమ్మకానికి ఉన్న ప్రతి మద్యం బాటిల్‌ను తప్పనిసరిగా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా అమ్మకాలు జరగాలని ఆయన తెలియజేశారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే దాని నిజస్వరూపం, సీల్, క్యాప్, హోలోగ్రామ్ మరియు క్యూఆర్ కోడ్ వెలుపలున్న వంటి అంశాలను ధృవీకరించే విధంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.ప్రతి దుకాణంలో ఇక్కడ అమ్మే మద్యం క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా నాణ్యత మరియు నిజస్వరూపం ధృవీకరించబడిన అనే బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. స్కానింగ్‌లో బాటిల్ అంతేంటిక్ గా తేలితే అమ్మకం కొనసాగించవచ్చని, ఒకవేళ డూప్లికేట్ లేదా టాంపర్డ్ గా తేలితే ఆ బాటిల్‌ను వేరుగా ఉంచి సంబంధిత ఎక్సైజ్ అధికారికి వెంటనే తెలియజేయాలని, కోడ్ నాట్ ఫౌండ్ గా తేలితే అమ్మకం నిలిపివేసి వెంటనే నివేదించాల్సిందిగా ఆయన తెలిపారు. ఈ చర్యలతో నకిలీ లేదా కల్తీ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టి, ప్రజలకు నిజమైన మరియు నాణ్యమైన మద్యం మాత్రమే అందేలా ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, వినియోగదారులు కూడా క్రింది క్యూ ఆర్ కోడ్ ద్వారా లేదా ప్లే స్టోర్‌లో లభ్యమయ్యే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని, తాము కొనుగోలు చేసే మద్యం బాటిల్ యొక్క నాణ్యతను స్వయంగా స్కాన్ చేసి పరిశీలించవచ్చని ఆయన వివరించారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా... జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, పెదవేగి, పెదవేగి, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా... ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించవలెను.
ఫోన్: 9704502377

# ఆక్వారంగంలో సవాళ్లు అంశంపై జాతీయ స్థాయి సదస్సు

సాంకేతిక పరిజ్ఞానం, రైతుల అనుభవం సమన్వయంతో ముందుకు రావాలని తెలిపారు. మొదటి రోజు జరిగిన మూడు టెక్నికల్ సెషన్లలో ప్రొఫెసర్ రామచంద్ర గోపాల్ (నిట్ వరంగల్), డాక్టర్ రామమోహనరావు (ఫిషరీస్ శాఖ, కాకినాడ) పాల్గొని ఆక్వా రంగంలో ఆధునిక పద్ధతులు, స్థిరాభివృద్ధి, పర్యావరణ నిర్వహణ అంశాలపై లోతైన విశ్లేషణలు చేశారు. మొదటి రోజు టెక్నికల్ సెషన్స్‌కు సమన్వయకర్తగా డాక్టర్ జి.అరుణ్ కుమార్, వి.ఎస్.కృష్ణ వ్యవహరించారు. తణుకు ఎస్.ఆర్.సి. పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుగాసి దాస్ విశ్వవిద్యాలయం సెంట్రల్ యూనివర్సిటీ బిలాస్ పూర్, చత్తీస్ ఘర్ నుండి అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు బానోతు, యోగి వేమన యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్ జి.విజయభారతి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆర్.కె.ఫణిధర్, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ఎ.మారుతి దేవి చౌదరి, కళాశాల అధ్యాపకులు జి.ఇందిరా కుమారి, కె.రాజశేఖర్, ఆర్.ఎస్.ఎం.భూపాల్, డాక్టర్ డి.కనక మహాలక్ష్మి, డాక్టర్ ఇ.జ్యోతికిరణ్మయి, పి.చాముండేశ్వరి దేవి, ఆర్.అశోక్ కుమార్, డాక్టర్ పి.కమల, డాక్టర్ టి.సంధ్యారాణి, డాక్టర్ జి.విజయ్ కుమార్, యన్.విష్ణు వర్ధన్, యమ్.రఘునాథ రెడ్డి, బి.యస్.యల్.పద్మశ్రీ, కె.జీవన్ బాబు, వి.శివ ప్రకాష్, డాక్టర్ వై.విజయ్ కుమార్, జి.కమల, బి.శిరీష, కె.ధనలక్ష్మి, టి.కీర్తి పూర్ణ, ఇతర కళాశాలల నుండి విచ్చేసిన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, రైతులు, ఆక్వా రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం



అత్తిలి/ గణపవరం- అక్టోబర్ 16 ( ప్రభాతవార్త ):ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు లో భాగంగా గణపవరం బాలుర ఉన్నత పాఠశాల వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు ప్రధానోపాధ్యాయిని గంటా వీరవేణి 20ని ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారులు కలిసికట్టుగా పనిచేసి మంచి ప్రగతిని సాధించాలి.

ఏలూరు, అక్టోబరు16 ప్రభాత వార్త :: జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో గురువారం జిల్లాలో "గృహ నిర్మాణాలు ప్రగతిపై" సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఇండ్ల నిర్మాణాలు 12,345 టార్గెట్ కాగా 10,565 పూర్తి చేసి ఇంకా 1,780 ఇండ్లు పూర్తి చెయ్యకపోవడంపై జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మండలాలు వారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. బాగా వెనుకబడిన మండలాలు డిఇ, ఎఇ, ఇంజనీరింగు అసిస్టెంటు, మండల ఇన్చార్జిలతో టార్గెట్ వెనుకబడుట కారణాలను చెప్పమని జిల్లా కలెక్టర్ నిలదీశారు. వారం రోజుల్లో 403 ఇండ్లను పూర్తి చేసి, మిగిలిన ఇండ్లను ఈ నెల చివరినాటికి పూర్తి చెయ్యాలని ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని 5 మంది ఇంజనీరింగు అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చెయ్యాలని జిల్లా గృహ నిర్మాణశాఖ పిడి జి. సత్యనారాయణను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల చివరినాటికి 3 లక్షల ఇండ్లను సామూహిక గృహప్రవేశాలకు సన్నాహాలు చేస్తుందని, మన జిల్లా 12,345 ఇండ్లను గృహప్రవేశాలకు సిద్ధం చెయ్యాలని అధికారులకు ఆదేశించామని అన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు లక్ష్యసాధనలో అధికారులు కలిసికట్టుగా పనిచేసి మంచి ప్రగతిని సాధించాలని, లక్ష్య సాధనలో వెనుకబడిన ఆయా అధికారులు, సూపర్వైజర్లపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ నెల18వ తేదీ [illegible] డే (ప్రేరణ) రోజున లబ్దిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని, నేను రెండు సదస్సులకు హాజరవుతానని అన్నారు. గృహ నిర్మాణాలలో అలసత్వం వహించే కాంట్రాక్టర్లను తొలగించి అవసరమైతే కొత్తవారిని నియమించుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి, ఈ నెల చివరినాటికి నూటికినూరుశాతం ఇండ్లను పూర్తి చేసి పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గృహనిర్మాణ పిడి జి.సత్యనారాయణ, ఇఇలు, డిఇ లు, సహాయ ఇంజనీర్లు, ఇంజనీరింగు అసిస్టెంటు, మండల ఇంచార్జీలు, జిల్లా గృహ నిర్మాణశాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



భీమవరం అక్టోబర్ 16 ప్రభాతవార్త :జిల్లా పోలీసు శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల వారోత్సవాల బ్రోచర్ ను అడిషనల్ ఎస్పీ వి భీమారావు గురువారం వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజారక్షణలో ప్రాణాలు సైతం కోల్పోతారు అనడానికి ఈ పోలీసుల అమర వీరుల వారోత్సవాలే నిదర్శనమన్నారు.

# బాలికలకు ఆటల పోటీలు.



అత్తిలి- అక్టోబర్ 16 (ప్రభాత వార్త) :అత్తిలిలో బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలికలకు మండల స్థాయిలోవివిధ పోటీలు నిర్వహించినట్లు ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో వ్యాసరచన, వక్తృత్వం, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ పోటీలను నిర్వహించారు. పీఈటీలు దిలీప్ కుమార్, రమేష్, వైయస్సార్ సోమయజులు శ్రీవాణి, త్రివేణి పోటీలకు సహకరించారు. ఐసిడిఎస్ ఐసీడీ ఎస్ ఎ సి డిపిఓ శ్రీలక్ష్మి, పర్యవేక్షకులు శ్రీదేవి, కనకమహాలక్ష్మి, విజయ్ కుమారి పాల్గొన్నారు.

# జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు ప్రయోజనం

## తణుకులో జీఎస్టీ అవగాహన ర్యాలీలో అధికారులు




తణుకు, అక్టోబర్ 16(ప్రభాత వార్త): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలు కారణంగా అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతోందని తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తణుకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్టీ ప్రయోజనాలను అనేక విధాలుగా అమల్లోకి తీసుకురావడం ద్వారా పేద, దిగువ మధ్యతరగతి వర్గాలకు మేలు చేకూరుతోందన్నారు. నిత్యావసరాలతోపాటు వ్యవసాయ యంత్ర పరికరాలపై పెద్ద మొత్తంలో జిఎస్టీ తగ్గిందని చెప్పారు. ఎంవీఐ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ జిఎస్టీ తగ్గింపుతో వచ్చిన ఆర్థిక లాభంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్ని రంగాల్లో జీఎస్టీ స్లాబ్ లను పెద్ద మొత్తంలో తగ్గించడం జరిగిందని, ఈ విషయం ప్రజల్లోనికి తీసుకెళ్లడానికి గ్రామ గ్రామాన ఇంటింటా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి రవాణా శాఖ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు డిప్యూటీ కమర్షియల్ టాక్స్ అధికారి (స్టేట్ టాక్స్) కె.ఎస్.పద్మావతి, కమర్షియల్ టాక్స్, రవాణా, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పిప్పరలో ఎకడమిక్ మానిటరింగ్ సమావేశం.



అత్తిలి/ గణపవరం -అక్టోబర్ 16 (ప్రభాతవార్త )గణపవరం మండలం పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అకడమిక్ మానిటరింగ్ కమిటీ సమావేశం, నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుల సమావేశం మండల విద్యాధికారి గొర్రెల బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు క్లస్టర్ సమావేశాల వివరాలను తెలియజేశారు పాఠశాలలను తనిఖీ చేసే అధికారుల వివరాలను తెలియజేశారు పిప్పర, గణపవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి జె వెంకటేశ్వర్లు, గంటా వీర వేణి, డి ఆర్ జి దుర్గారావు బి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ఎఐటియుసి

## - రాష్ట్రసమితి సమావేశాలు



**తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త** : రెండు రోజుల పాటు జరగనున్న ఎఐటియుసి రాష్ట్ర సమితి సమావేశాలలో కార్మిక ఉద్యోగ, కార్మికవర్గాల సమస్యలపై లోతుగా చర్చిస్తారని , వాటి పరిష్కారానికి జరుగుతున్న పోరాటాలను ఉధృతం చేసేందుకు తగు కార్యాచరణను నిర్ణయిస్తారని ఎఐటియుసి ఏరియా సమితి నాయకులు తెలిపారు. ఎఐటియుసి ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, కార్యదర్శి మందలపర్తి హరీష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు, కార్యనిర్వాహక కార్యదర్శి కే.లక్ష్మీనారాయణ , నాయకులు తాడికొండ శ్రీనివాసరావు, పోలిరాతి ఆదినారాయణ , కోశాధికారి అల్లం కుమారస్వామి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎఐటియుసి రాష్ట్ర సమితి సమావేశాలు అక్టోబర్ 17, 18 తేదీల్లో తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో సమీపంలోని పూడి సుబ్బారావు ప్రాంగణం( హెూటల్ సెలెక్షన్ (గ్రాండ్) లో జరుగుతు న్నాయి. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన ఎఐటియుసి రాష్ట్రస్థాయి నాయకులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు 150 మంది సమావేశా లకు హాజరు అవుతారు. దేశంలో కార్మికోద్యమం అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ సమావేశాలు జరుగుతున్నాయని, సమస్యల పరిష్కారం కోసం కార్మికవర్గం సాగిస్తున్న పోరాటాలను ఉధృతం చేయడంపై, ఎఐటియుసి శ్రేణులకు దిశా నిర్దేశం చేయడానికి రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో చర్చ జరుగుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ తెలిపారు. పాతికేళ్ల తర్వాత తాడేపల్లిగూడెంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయని, ఈ సమావేశాలను జయప్రదం చేయడానికి ఏరియా సమితి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సోమసుందర్ తెలిపారు. వివిధ సమస్యలపై జరుగుతున్న ఉద్యమాల్లో తాడేపల్లిగూడెం కార్మికవర్గం క్రియాశీలంగా పాల్గొంటున్నది. ఈ నేపథ్యంలో తాడేపల్లిగూడెంలో జరుగుతున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు కీలక ప్రాముఖ్యం ఉన్నది.

# సురక్ష యాప్‌పై మద్యం ప్రియులకు అవగాహన



తణుకు, అక్టోబర్ 16(ప్రభాత వార్త): మద్యంపై ప్రజల్లో నెలకొన్న అపోహలు, అనుమానాలు నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిష్టాత్మకంగా సురక్ష యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందని తణుకు ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి అన్నారు. గురువారం తణుకులోని పలు మద్యం షాపుల వద్ద యాప్ పనితీరుపై మద్యంప్రియులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం కొనుగోలుదారులు ఎవరికి వారు తాము కొనుగోలు చేసిన మద్యం నాణ్యతను, స్వచ్ఛతను పరిశీలించుకొనే అవకాశం కల్పించిందన్నారు. తాము కొనుగోలు చేసిన మద్యం ఎక్కడ తయారైంది, ఎప్పుడు తయారైంది, దాని బ్యాచ్ నెంబర్ తదితర వివరాలను ఇప్పుడు ఎలాంటి కష్టం లేకుండా కేవలం సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్ మూతపై ఉన్న స్టిక్కర్‌పై గల క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా కేవలం ఒక సెకన్‌లో తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ యాప్ చాలా యూజర్ ఫ్రెండ్లీ గా ఉంటుందని పెద్దగా చదువుకోలేని వారు కూడా సులభంగా వాడుకోవచ్చన్నారు. ఈ విధంగా స్కాన్ చేసి విక్రయించడం ద్వారా నకిలీ మద్యం గుర్తించడానికి, బెల్ట్ షాపులకు మద్యం తరలకుండా ఉండటానికి తోడ్పడుతుందని తెలిపారు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు తణుకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌ా 9440902436 నెంబరులో సంప్రదించాలని సీఐ మణికంఠరెడ్డి సూచించారు.

# వన సంరక్షణ సమితి నిధులు నిగ్గు తేల్చండి

## -పర్వతాపురం సర్పంచ్ శివాజీ డిమాండ్



చాట్రాయి, అక్టోబర్ 16, ప్రభాతవార్త : పర్వతాపురం వన సంరక్షణ సమితి నిధుల వివరాలు పూర్తిస్థాయిలో గ్రామ సభ ద్వారా తెలియజేయాలని పర్వతాపురం సర్పంచ్ మిద్దె శివాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పర్వతాపురం వన సంరక్షణ సమితికి సంబంధించిన అటవీ ప్రాంతంలో పర్వతాపురం గ్రామ ప్రజలతో ఆయన నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన సంరక్షణ సమితి నిధులు కైంకర్యం అయ్యాయని నూజివీడు సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా 22 లక్షలు వచ్చినట్టు వన సంరక్షణ సమితి అధ్యక్షుడు లెక్కలు చెబుతున్నారని గ్రామ సభ నిర్వహించకుండా నాసిరకం గడ్డ పొలుకులు,పారులను ఇంటింటికి పంపిణీ చేసే ప్రయత్నం చేస్తున్నారని కనీసం వన సంరక్షణ సమితి సభ్యులకు కూడా నిధులు ఎంత వచ్చాయో ఎంత ఖర్చు చేశారో దేనికి ఖర్చు చేశారో తెలియపరచకుండా ఇష్టానుసారంగా డబ్బులు డ్రా చేశారని ఆయన ఆరోపించారు. వనసంరక్షణ సమితి ద్వారా మొక్కలు ఆ తర్వాత వాటిని అమ్మిన పైకాన్ని గ్రామాభివృద్ధికి ఖర్చు చేసుకోవచ్చని నిబంధన ఉందని సభ్యులకే తెలియకుండా పైకం ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. దీనిపై అటవీశాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపించి గ్రామ ప్రజలకు వనసమరక్షణ సమితి ఫలాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ముగిసిన తపాల వారోత్సవాలు

## 26 మంది ఉత్తమ పోస్ట్ మెన్ లకు సత్కారాలు



భీమవరం అక్టోబర్ 16 ప్రభాతవార్త :పోస్ట్ మెన్ సేవలు అద్వితీయమని, తపాల శాఖలో పోస్ట్ మెన్ పాత్ర కీలకమని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, ఏపీఐఐసి డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత తపాల శాఖ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శతాబ్దాల కాలం నాడు వ్యవస్థీకరించబడిన తపాల శాఖ లక్ష 54 వేల పోస్ట్ పీస్ లలో లక్షలాది మంది దేశ వ్యాప్తంగా ఉద్యోగాలతో బాసిల్లుతుందన్నారు. కేజీఆర్ఎల్ కళాశాల జాయింట్ సెక్రటరీ అరేటి ప్రకాష్, హెడ్ పోస్ట్ మాస్టర్ పీ రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శాఖలలో పోస్టల్ శాఖ చాలా కీలకమని, అవినీతికి చోటులేని ఈ శాఖలో పోస్ట్ మెన్లు సేవలు ముఖ్యమైనవని, ప్రభుత్వ కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

# రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు సత్వరం పూర్తి చేయాలి




తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త : అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను సత్వర%శీ% పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు నడిబొడ్డున ఉన్న ప్రముఖ వాణిజ్య కేంద్రం విద్యా కేంద్రమైన తాడేపల్లిగూడెం పరిసరాల్లో 100 గ్రామాల ప్రజలకు ప్రజలకు ఉపయోగపడేలా వందే భారత్ సూపర్ ఫాస్ట్ తో పాటు ముఖ్యమైన రైళ్ళను నిలిపు చేయాలని, టూ టౌన్ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పొడిగించి గూడ్స్ షెడ్ వైపు అదనపు బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు, బిజెపి నాయకులు విజయవాడ డివిజనల్ రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ లో అమృత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశానికి విజయవాడ రైల్వే డివిజనల్ సహాయ ఫైనాన్షియల్ అధికారి జహంగీర్ భాష మాట్లాడుతూ సుమారు 28 కోట్ల రూపాయలతో అమృతభారత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. త్వరలో పనులను పూర్తి చేసేందుకు కృషి జరుగుతుందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ జాతీయ సాంకేతిక విద్యా సంస్థ తోపాటు అనేక విద్యాసంస్థలు ఉన్న తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ లో వందే భారత్ తో పాటు వివిధ రాష్ట్రాలను కలిపే ముఖ్యమైన సూపర్ ఫాస్ట్ రైళ్లను నిలిపు చేయవలసిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని గాంధీ విగ్రహానికి వినతి



తాడేపల్లిగూడెం ప్రభాతవార్త : రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీ లలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 3 నుండి తలపెట్టిన సమ్మె విజయవంతం కావడానికి సన్నాహక లో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏ ఐ టీ యు సీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షులు ఓవి రాజు, కార్యదర్శి ఎం హరీష్ , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాసు , ఏ ఐ టీ యు సీ వర్కింగ్ ప్రెసిడెంట్ కలింగ లక్ష్మణరావు మాట్లాడారు . గత రెండు సంవత్సరాల నుండి మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి అవుట్సోర్సింగ్ విధానంలో పనుల కల్పనలో జరుగుతున్న జాప్యాన్ని తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు . పర్మిట్ కార్మికులకు పెండింగ్లో ఉన్న డి ఏ విడుదల చెయ్యాలని వారు కోరారు. 12వ పిఆర్సి ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలని, 2011 నుండి జనగణన జరిగినందున ప్రాంతాల విస్తరణ పెరిగినందున మున్సిపల్ కార్పొరేషన్ నగర పంచాయతీలు పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తి పెంచాలని వారు డిమాండ్ చేశారు. డైలీ వేజ్ కార్మికులును ఔట్సోర్సింగ్ లోకి తీసుకోవాలి, పర్మిట్ కార్మికుల పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు. 2023లో నాటి ప్రభుత్వం లో జరిగిన మున్సిపల్ సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా వర్క్ ఆఫ్ నేచర్ బట్టి పనిచేస్తున్న ఇంజనీరింగ్ ఆఫీస్ సిబ్బంది స్కూల్ స్వీపర్స్ కు వేతనాలు పెంచి చెల్లింపులు చేపట్టాలని వారు అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ కె ముత్యం అల్లం కుమార్ స్వామి మార్లపూడి కాటమరాజు ట్రెజరర్ బంగారు ముసలమ్మ ధనాల లక్ష్మి బి శివ శంకర్ వెంకట్రావు పెద్దిరాజు ఎం పండు కే అఖిల తదితరులు పాల్గొన్నారు.

# నాగమ్మ ఆలయం మార్గంలో ప్రమాదకర గోతులు: భక్తుల ప్రయాణం కష్టంగా మారింది



పెనుగొండ, అక్టోబర్ 16( ప్రభాతవార్త ): పెనుగొండ మండలం దొంగరావిపాలెం గ్రామంలోని నాగమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో రహదారి మధ్యలో ఏర్పడిన ప్రమాదకర గోతులు స్థానికులను, భక్తులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. నిత్యం వేలాది మంది వాహనదారులు, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుండగా, గోతుల వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు పెరిగాయి.స్థానికులు చెబుతున్నట్లుగా, ఇటీవల వర్షాల కారణంగా రహదారి మరింత దెబ్బతింది. కొన్ని చోట్ల రోడ్డు పూర్తిగా కుంగిపోయి, వాహనాలు తిరగలేని స్థితికి చేరాయి. "అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ప్రమాదంలో పడకుండా ఉండాలంటే, అధికారులు వెంటనే స్పందించి రహదారిని మరమ్మతు చేయాలి" అని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ సమస్యపై పంచాయతీ అధికారులు, రవాణా శాఖ స్పందించాలని ప్రజలు ఆశిస్తున్నారు. "ప్రాణాలు మించిన దైవారాధన లేదు. కానీ భద్రత లేకుండా ప్రయాణించడం భక్తులకే ప్రమాదం" అని ఒక భక్తుడు ఆవేదన వ్యక్తం చేశారు.రహదారి గోతులు తక్షణమే పూడ్చాలి.ఆలయ మార్గంలో భద్రతా సూచనలు ఏర్పాటు చేయాలి.వాహనదారులకు మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేయాలి.ఈ సమస్యపై సంబంధిత శాఖలు స్పందించి, భక్తుల ప్రయాణం సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటాయని ప్రజలు ఆశిస్తున్నారు.

# తెర


రష్మిక మందన్న

# డ్యూడ్ ఖచ్చితంగా అందరిని అలరిస్తుంది: ప్రదీప్



లవ్ టుడే, డ్రాగన్‌లతో రెండు వరుస హిట్‌లను అందించిన యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్‌తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయంఅవుతున్నారు. 'ప్రేమలు' అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ట్రైలర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగామేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈవెంట్ లో హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. హైదరాబాదు నాకు ఇంకో ఫ్యామిలీ. నా సినిమాలన్నీ గొప్పగా ఆదరించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీ కుటుంబంలో ఒకరిగా చూసినందుకు చాలా థాంక్స్. లవ్ టుడే, డ్రాగన్ మీకు నచ్చినట్లయితే ఖచ్చితంగా డ్యూడ్ కూడా నచ్చుతుంది. అదిరిపోయే సినిమా ఇది. మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ మైత్రి మూవీ మేకర్స్ కి థాంక్యూ. నాకు తెలుగులో ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవ్వాలని ఉంటుంది. ఇది నాకు మంచి అవకాశం. మైత్రి మూవీ మేకర్స్ చాలా అద్భుతంగా పే చేస్తారు. ఈ సినిమా కోసం చాలా మంచి పేమెంట్స్ తీసుకున్నాను.)డైరెక్టర్ కీర్తికి థాంక్యూ. చాలా మంచి సినిమా తీశాడు. సినిమా చూసిన తర్వాత అతను ఎంత పెద్ద డైరెక్టర్ అవుతారో మీరే చెప్తారు. సాయి చాలా పెద్ద కంపోజర్ అవుతాడు. ఇప్పటికే తనకి చాలా మంది అభిమానులు ఏర్పడ్డారు. మమిత కి థాంక్యూ. తను అద్భుతమైన ఎనర్జీతో పెర్ఫాం చేశాడు. ఇక్కడికి వచ్చిన డైరెక్టర్స్ అందరికి థాంక్యూ. నికేత్ బొమ్మకి థాంక్యూ. డ్యూడ్ అక్టోబర్ 17న రిలీజ్ అవుతుంది. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది. తెలుగు ఆడియన్స్..ఐలవ్ యు ఫరెవర్. హీరోయిన్ మమిత బైజు మాట్లాడుతూ,. చాలా సంతోషంగా ఉంది. మాము సపోర్ట్ చేయడానికి ఇక్కడికి వచ్చిన అందరికీ థాంక్యూ. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాకి స్ట్రాంగ్ పిల్లర్. మైత్రి మూవీ మేకర్స్ తో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ప్రదీప్‌తో కలిసి నటించడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. డ్యూడ్ సినిమా అక్టోబర్ 17 రిలీజ్ అవుతుంది. తప్పకుండాథియేటర్స్‌లోవాచ్ చేయండి. మూవీ డైరెక్టర్ కీర్తి ఈశ్వరన్ మాట్లాడుతూ, ఇది ఒకగొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. నేను స్క్రిప్ట్ రాసుకుని దర్శకుడు కావాలనుకున్న తర్వాత చెన్నై మొత్తం తిరిగాను. ఫైనల్‌గా ఇక్కడ జూబ్లీహిల్స్ లో నా సినిమా జర్నీ మొదలైంది. నా కలలో కూడా మైత్రి మూవీ మేకర్స్ తో వర్క్ చేస్తానని అనుకోలేదు. తెలుగు దర్శకులంతా వచ్చి మాకు బ్లెస్సింగ్ ఇవ్వడం ఆనందాన్ని ఇచ్చింది. ప్రదీప్ తెలుగుఆడియన్స్ గురించి చాలా ఆలోచిస్తారు. నేను ఈ సినిమా చేస్తున్న క్రమంలో ప్రతిసీన్ చదివి ఇవి ఖచ్చితంగా తెలుగు ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుందనే వారు. మమిత చాలా స్వీట్. ఈ సినిమాలో ఒక డిఫరెంట్ మామితని చూస్తారు. అల్లు అర్జున్ గారి ఆర్య, ఈ స్క్రిప్ట్ చేయడానికి నాకు ఇన్స్పిరేషన్ ఇచ్చింది. మ్యూజికల్ సెన్సేషన్ సాయికి థాంక్యూ. అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమాలో బాగుండు పో అనే పాట ఉంది. ఈ సినిమాకు కోర్ కూడా అదే. తెలుగు ఆడియన్స్ మంచి ఎమోషన్స్, జెన్యూన్ ఫిలిం ఇష్టపడతారు. దీపావళి తోపాటుఈ సినిమా సెలబ్రేట్ చేసుకొనేలా వుంటుంది. డైరెక్టర్ హను రాఘవపూడి మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్‌లో కీర్తి సినిమా చేయడం తన అదృష్టంగా భావిస్తున్నాను. తనకి చాలా మంచి బ్లెస్సింగ్స్ ఉన్నాయి. ఇందులో బూమ్ బూమ్ సాంగ్ మంచి వైబ్ ఇచ్చింది. ఈ సాంగ్ ఒక్కటి చాలు ఈ సినిమా వైబ్ చెప్పడానికి. ప్రదీప్, మమత కెమిస్ట్రీ చాలా అద్భుతంగా ఉంది. టీమ్ అందరికీ కంగ్రాజులేషన్స్. డైరెక్టర్ బుచ్చిబాబు సాన మాట్లాడుతూ, నేను రంగస్థలంలో అసిస్టెంట్ డైరెక్టర్గా వర్క్ చేసినప్పటి నుంచి నవీన్ రవి ఎలా ఉన్నారో ఇప్పుడు అలానే ఉన్నారు. నా ఫస్ట్ ఫిలింకి మైత్రి మూవీ మేకర్స్ దొరకడం అదృష్టం. డ్యూడ్ సినిమా గురించి రవి నవీన్ చెప్పినప్పుడు చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. ఈ సినిమా చాలా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను. ప్రదీప్ కి నేను పెద్ద ఫ్యాన్. ఈ సినిమా హిట్ వైబ్రేషన్ ముందే తెలిసిపోతుంది. ఖచ్చితంగా ఈ సినిమా మీ అందరిని ఎంటర్టైన్ చేస్తుంది. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా మీద చాలా నమ్మకంగా ఉన్నాము. అక్టోబర్ 17న అందరూ థియేటర్స్‌కి కొచ్చి బ్లెస్ చేయాలని కోరుకుంటున్నాం. మా హీరో ప్రదీప్‌కి డైరెక్టర్ కీర్తికి సాయి మమత నికేత్ టీమ్ అందరికీ థాంక్యూ. సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది. రామ జోగయ్య శాస్త్రి మాట్లాడుతూ, మైత్రి మూవీ మేకర్స్ హస్తవాసి చాలా మంచిది. ఈ సినిమాతో కీర్తి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇది చాలా శుభారంభం. డైరెక్టర్ కీర్తి చాలా క్లారిటీ ఉన్న వ్యక్తి. పర్సనల్గా నాతో ఇంట్రాక్ట్ అయ్యి ఈ సినిమా లిరిక్స్ రాయించారు. అది ఆయనకి వర్క్ మీద ఉన్న ఫ్యాషన్. ప్రదీప్, మమత ఇలా చాలా మంచి టీం తో వస్తున్న సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది. ఈ సినిమాతో ప్రదీప్ హ్యాట్రిక్ కొడతారని నమ్మకం ఉంది. డ్యూడ్ టీంతో పని చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. తప్పకుండా ఈ సినిమా చాలా మంచి విజయాన్ని సాధిస్తుంది. మూవీ యూనిట్ అందరూ పాల్గొన్న ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది .

## 17మిలియన్ వ్యూస్ సాధించిన 'మీసాల పిల్ల' లిరికల్ సాంగ్




మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకరవర ప్రసాద్‌ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల మ్యూజిక్ వరల్డ్‌ని షేక్ చేస్తోంది. చిరంజీవి మాస్‌అండ్‌క్లాస్ కాంబినేషన్‌ని ప్రజెంట్ చేసిన ఈ పాట రికార్డుల వర్షం కురిపిస్తోంది. హిట్ మెషీన్ నిల్‌రావిపూడిదర్శకత్వంలో రూపొందు తున్న ఈ మ్యూజికల్ ఫీస్ట్‌లో చిరంజీవి తన యంగ్ ఎనర్జీ, మ్యూజికల్ డ్యాన్స్ మూవ్స్ తో అదరగొట్టారు. నయనతారతో ఆయన కెమిస్ట్రీ స్క్రీన్‌పై చూడముచ్చటగా వ్వుంది. భీమ్ సీసిరోలియో స్వరపరిచిన ఈ పాటలో ఎలక్ట్రానిక్ బీట్స్, సింథ్ సౌండ్స్, ట్రెడిషనల్‌పెర్కషన్ మేళవింపు అద్భుతంగాఉంది. భాస్కరభట్ల సాహిత్యం చిలిపితనం, సరదా, ఫన్ తో ఆకట్టుకుంది. ఉదిత్‌నారాయణ్ వాయిస్‌లోని నాస్టాల్జిక్ టచ్, శ్వేతామోహన్ వాయిస్ లోని ఎలిగెన్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రిలీజ్ అయిన రెండురోజుల్లోనే మీసాల పిల్ల 17 మిలియన్‌కి పైగా వ్యూస్ సాధించి దేశవ్యాప్తంగా టాప్ ట్రెండ్‌గా కొంసగుతోంది. ఇది చిరంజీవి పాన్‌ఇండియా క్రేజ్‌కి నిదర్శనం. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. మీసాల పిల్లఇచ్చిన సూపర్ స్టార్ట్‌తో ఈ సీజన్‌లో మరిన్ని మెగా చార్ట్‌బస్టర్స్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. చిరంజీవి ఎవర్ గ్రీన్ చరిష్మా, సినిమాటిక్ వైబ్ ని సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారురష్మిక మందన్న, రవీంద్ర పుల్లె, అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పాన్ ఇండియా ఫిల్మ్ 'మైసా'కి స్టార్ కంపోజర్ జేక్స్ బిజోయ్ మ్యూజిక్అందిస్తున్నారు.


## రవీంద్రపులె డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్న 'మైసా'



ఇప్పటికే ఆసక్తికరమైన టైటిల్, అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో బజ్‌ను సృష్టించింది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ మైసాను భారీ బడ్జెట్‌తో పాన్‌ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మేకర్స్ ఒక ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. బ్లాక్ బస్టర్ సరిపోదా శనివారం ఫేం జేక్స్ బిజోయ్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా జేక్స్ బిజోయ్ ట్రైబల్ వాయిద్యాలతో రీరికార్డింగ్ చేస్తున్న విడియో రిలీజ్ చేశారు. సౌండింగ్ అదిరిపోయింది. మైసా మ్యూజికల్‌గ్రాండ్ స్కేల్‌లో వుండబోతుంది. మైసా గోండ్ తెగల బ్యాక్ డ్రాప్ లో హైఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోంది. రష్మిక మందన్న ఇంతకు ముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవాతర్‌లో కనిపిస్తుంది. ఈ చిత్రానికి సూర్య 'రెట్రో' సినిమాకి పని చేసిన శ్రేయాస్ పి కృష్ణ డీవోపీగా పని చేస్తున్నారు. యాక్షన్ 'కల్కి 2898 ఏడీ' ఫేమ్ ఆండి లాంగ్ డిజైన్ చేస్తున్నారు. మరిన్ని ఎక్సైటింగ్ అప్‌డేట్స్ మేకర్స్ త్వరలో తెలియజేస్తారు. తారాగణం: రష్మిక మందన్న.

## దీపావళికి 'కాంతార చాప్టర్ 1' కొత్త ట్రైలర్ రిలీజ్

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'కాంతార చాప్టర్ 1' సినిమా దసరా కానుకగా విడుదలై, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ పీరియడ్ యాక్షన్ మూవీ రూ.700 కోట్ల దిశగా పయనిస్తోంది. దీపావళి సందర్భంగా తాజాగా కొత్త ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సినిమాలోని కీలక ఘట్టాలను ఆవిష్కరించిన ఈ ట్రైలర్ ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది కాంతార చాప్టర్ 1 దీపావళి ట్రైలర్..3 నిమిషాల్లో సినిమా మొత్తం చూపించేశారుగా!కన్నడ హీరో రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కాంతార చాప్టర్ 1 హిట్ మూవీ కాంతారకు ప్రీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమా..దసరా కానుకగా థియేటర్లలోకి వచ్చింది. బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లతో బ్లాక్‌బస్టర్ విజయం సాధించింది. రెండో వారం పూర్తి చేసుకోబోతున్న ఈ పీరియడ్ యాక్షన్ మూవీ. రూ.700కోట్లక్లబ్ దిశగా పయనిస్తోంది. దీపావళిని పురస్కరించుకుని చిత్ర బృందం తాజాగా కొత్త ట్రైలర్ ను రిలీజ్ చేసింది.




## వరుణ్ ఎమోషనల్‌వార్, సైకలాజికల్ వైలెన్స్‌ని జనరేట్ చేస్తాడు
### స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ



మిరాయ్ లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ తెలుసు కదా. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తెలుసు కదా అక్టోబర్ 17న గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ, అందరికీ హాయ్. ఈరోజు చాలా బాధగా ఉంది. ఒక ఏడాదిగా చాలా రాడికల్ అండ్ ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ ప్లే చేస్తున్నాను. ఒక వింత మనిషి బుర్రలో బతుకుతున్నాను. ఎల్లుండి సినిమా రిలీజ్ కాబోతుంది. వరుణ్ అనే క్యారెక్టర్‌కి గుడ్ బై చెప్పేయాలి. నేను ఎందుకు ఆ క్యారెక్టర్ గురించి అంత పర్టికులర్‌గా చెప్తున్నాను అంటే సినిమా చూస్తున్నప్పుడు మీకు అర్థం అవుతుంది. వెరీ ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్. అందుకే లాస్ట్ టైం వరుణ్ లాగా ఉందామను కుంటున్నాను. అందుకే తన దగ్గరికి వెళ్లి తన షర్ట్ కూడా తీసుకొచ్చాను. వరుణ్ నాకు రెండు కండిషన్స్ పెట్టాడు. ఇక్కడున్న ఆడపిల్లలు అందరితో మాట్లాడమన్నాడు. అమ్మాయిలతోనే సృష్టి మొదలైంది. మేము మీ ముందు చాలా నిమిత్త మాత్రులం. మేము ఏదైనా చిన్న తప్పు చేసినా మీరు పెద్దమనసు చేసి క్షమించేయాలి. మీరు గొప్ప మేము గొప్ప అని డిస్కషన్ లేదు. మీరే గొప్ప. మీ వల్ల మేము గొప్ప. ఇప్పుడు బాయ్స్‌తో మాట్లాడదాం. ఎప్పుడైనా ఒక అమ్మాయి మీ మనసు విరగ్గొట్టి వెళ్లిపోతే వెళ్లిపోనివ్వండి. లేదు అలా కాదు ఆమె వెంట పడితే మాత్రం మీ మీద మీకున్న మర్యాద పోతుంది. అబ్బాయిలకి సెల్ఫ్ రెస్పెక్ట్ ఎవరెస్టులో ఉండాలి. మనసు విరుగుతుంది, బాధేస్తుంది. రానివ్వండి. అసలు కథ అక్కడే మొదల వుతుంది. అప్పుడు వరుణ్ లాంటివాడు మీ నుంచి బయటకు వస్తాడు. మన ఎమోషన్స్ మన కంట్రోల్ లో ఉండాలని అర్థమవుతుంది. పవర్ కంట్రోల్ మనసులో మెయింటైన్ అవ్వాలి. ఇంకేమైనా డౌట్లు మిగిలిపోయి ఉంటే అక్టోబర్ 17న థియేటర్స్ కి వచ్చి తెలుసు కదా సినిమా చూడండి. ఈ సినిమాలో వరుణ్ అనే క్యారెక్టర్ ఒక్క చుక్క రక్తం చిందించకుండా ఎమోషనల్ వార్, సైకలాజికల్ వైలెన్స్ ని జనరేట్ చేస్తాడు. అది నా ప్రామిస్ .బెర్ముడా ట్రయాంగిల్ మీద నుంచి షిప్ వెళ్లిన ఎయిర్ క్రాఫ్ట్ వెళ్ళినా దానిలోకి లాగేసుకుంటుంది. తెలుసు కదా కూడా అలాంటి లవ్‌ట్రయాంగిల్. ఈ సినిమా చూసిన వాళ్ళందరినీ కూడా అది లాగేస్తుంది. వరుణ్ క్యారెక్టర్‌కి గుడ్ బై చెప్పడం నిజంగా బాధగా ఉంది. అందరికీ దీపావళి శుభాకాంక్షలు. సినిమా థియేటర్స్ లో చూడండి తప్పకుండా మిమ్మల్ని ఎంటర్టైన్ చేస్తుంది. హీరోయిన్ రాశిఖన్నా మాట్లాడుతూ, తెలుసు కదా నా మనసుకు చాలా దగ్గర సినిమా. చాలా కష్టపడ్డాం. ఇంత అద్భుతమైన క్యారెక్టర్ చేసిన రాసినందుకు నీరజాకి థాంక్యూ. శ్రీనిధి చాలా కష్టపడింది. తన బ్యూటిఫుల్ సోల్. తనతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. సిద్దుకి సినిమా అంటే పిచ్చి. అంతప్యాక్షన్ ఉన్న కోస్టార్ ని నేను ఎప్పుడు చూడలేదు. ఈ సినిమా చూసిన తర్వాత మీరు టిల్లును కూడా మర్చిపోతారు. ఈ సినిమా అందరూ చూడాలని కోరుకుంటున్నాన డైరెక్టర్ నీరజకోన మాట్లాడుతూ.,విశ్వకి కృతికి థాంక్యూ సో మచ్ ఫస్ట్ టైం డైరెక్టర్ కి వాళ్ళు ఇచ్చిన సపోర్టు మర్చిపోలేను ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి కారణం మా నిర్మాతలే సిద్దు లేకుండా ఈ సినిమా ఉండేది కాదు ఈ సినిమాకి తను బ్యాక్ బోన్ నిధి రాశికి థాంక్యూ వాళ్ళిద్దరూ ఈ ప్రాజెక్టుకి రావడం అదృష్టంగా భావిస్తున్నాను ఈ ముగ్గురు సినిమాకి పిల్లర్స్ అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. హర్ష క్యారెక్టర్ మీ అందరిని అలరిస్తుంది డైరెక్టర్ రవికాంత్ మాట్లాడుతూ, ఈ సినిమా చూశాను. చాలా బాగుంది. ఫెంటాస్టిక్. సిద్దూలో మరో కోణం చూస్తారు. మీరు ఎప్పుడూ అలా చూసి ఉండరు. సిద్దు ఈ జనరేషన్ స్టార్. అందరు కూడా అద్భుతంగా పెర్ఫాం చేశారు. నీరజాకి ఆల్ ది బెస్ట్. తప్పకుండా సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. డిఓపి జ్ఞాన శేఖర్ మాట్లాడుతూ, ఈ సినిమా బ్యూటిఫుల్ జర్నీ. ప్రతి మూమెంట్ ని ఎంజాయ్ చేశాం. సిద్దు నీరజ కృతి రాశి అందరితో పని చేయడం బ్యూటిఫుల్ ఎక్స్పీరియన్స్. తప్పకుండా ఈ సినిమా మిమ్మల్ని అందరిని ఎంటర్టైన్ చేస్తుంది.

## జటాధరకోసం గ్లోబ్ ట్రాటర్!

మన టాలీవుడ్ నవ దళపతి సుధీర్ బాబు హీరోగా బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా సాలిడ్ రోల్ లో దర్శకులు వెంకట్ కళ్యాణ్ అలాగే అభిషేక్ జైస్వాల్ లు తెరకెక్కించిన సాలిడ్ చిత్రవే ఊ'జటాధర' ఇది కూడా ప్రస్తుతం కొనసాగుతున్న డివోషనల్ టచ్ సూపర్‌నాచురల్ థ్రిల్లర్ గా తెరకెక్కిస్తుండగా రీసెంట్ గానే ఒకో సాంగ్ ని కూడా మేకర్స్ రిలీజ్ చేస్తూ వచ్చారు. మరి ఈ చిత్రం నుంచి అవైటెడ్ ట్రైలర్ అయితే రిలీజ్ చేసేందుకు రంగం సిద్ధం అయ్యింది. అ యితే ఈ ట్రైలర్ కోసం సూపర్ స్టార్ ది గ్లోబ్ ట్రాటర్ మహేష్ బాబు ముందుకొచ్చారు.

దీనితో అక్టోబర్17న రిలీజ్ చేస్తున్నట్టుగా ఇప్పుడు మేకర్స్ కన్ఫర్మ్ చేయడంతో ఘట్టమనేని ఫ్యాన్స్ లో కొత్త ఉత్సాహం వచ్చింది. ఇక ఈ చిత్రానికి రాయిస్ అండ్ జైన్ – సామ్ లు సంగీతం అందించగా ఉమేష్ కుమార్ బన్సాల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ ఆరోరా, శిల్పా సింఘాల్ మరియు నిఖిల్ నందా లు నిర్మాణం వహించారు. అలాగే ఈ నవంబర్ 7న సినిమా రిలీజ్ కి రాబోతుంది.






## ఆసియాకప్ హీరో యంగ్ క్రికెటర్ తిలక్ వర్మను సత్కరించిన చిరంజీవి,

మెగాస్టార్ చిరంజీవి మన శంకరవర ప్రసాద్ గారు సెట్స్‌లో హిట్ మెషన్ అనిల్ రావిపూడి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకర వర ప్రసాద్ గారు షూటింగ్ వేగంగా జరుగుతోంది. చిత్రీకరణలో బిజీగాఉన్న చిరంజీవి, ఒక మంచి సందర్భానికి సమయం కేటాయించారు. ఇటీవల ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై భారత్ ఘనవిజయం సాధించడంలో కీలకపాత్రపోషించిన వ క్రికెటర్ తిలక్ వర్మను మెగాస్టార్‌సన్మానించారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలకమైన భాగస్వామి అయిన తిలక్ వర్మ ప్రతిభను చిరంజీవి అభినందించారు. తనసహజమైన వినయం, పెద్దమనసుతో చిరంజీవి, తిలక్ వర్మను ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆయనకు శాలువా కప్పి, మ్యాచ్‌లోని ఆయన మెమొరబుల్ మూమెంట్ ని ఫ్రేమ్ చేసిన ఫోటోను అందజేశారు. కృషి, క్రమశిక్షణ కేవలం క్రీడలోనే కాకుండా జీవితంలోనూ విజయానికి మార్గదర్శకమని అన్నారు. నయనతార, దర్శకుడ్ను అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గరపాటి, సుస్మిత కొణిదెల పాల్గొన్నారు. ఇండియన్ సినిమా ఐకాన్ చిరంజీవి చేత సన్మానం పొందడం తిలక్‌వర్మకు ఒకప్రత్యేక క్షణం. దయ, వినయం, సినిమాలకంటే మించి స్ఫూర్తినిచ్చే మెగా వ్యక్తిత్వానికి ఇది మరో అద్భుతమైన ఉదాహరణగా నిలిచింది.

## విజయ్ దేవరకొండ నట విశ్వరూపం
### హైప్ ఎక్కిస్తున్న'విడి 14'డైరెక్టరు



విజయ్ దేవరకొండ విశ్వరూపం చూస్తారు.. హైప్ ఎక్కిస్తున్న జుదీ 14 డైరెక్టర్( రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉన్నారు. కింగ్డమ్ లుక్ కోసం మిగతా సినిమాలను పక్కనపెట్టిన యువ హీరో..ఇటీవలరౌడీ జనార్దన్ మూవీ షూటింగ్ ప్రారంభించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో ఈపాన్‌ఇండియామూవీ రూపొందు తోంది. దీని తర్వాత రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి 'విడి 14 'అనే వర్కింగ్ టైటిల్‌తో పిలుచుకుంటున్నారు. తాజాగా ఈ సినిమా గురించి రాహుల్ చెప్పిన మాటలు హైప్ క్రియేట్ చేస్తున్నాయి. బ్రిటీష్ ఇండియా కాలం నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా 'విడి 14 సినిమా రూపొందుతోంది. 19వ శతాబ్దంలో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని సమాచారం.

భారీ స్థాయిలో ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ క్యారెక్టర్, ఆయన గెటప్ చాలా కొత్తగా ఉంటాయని టాక్. ఈ సినిమాలో విజయ్ నట విశ్వరూపం చూపించబోతున్నారని రాహుల్ సంకృత్యన్ అంటున్నాడు.

# లలిత సంగీత సరస్వతి



**లలిత సంగీత సామ్రాజ్ఞి. తేనెలూరే గళం, కోకిల స్వరంతో ఆణిముత్యాల్లాంటి పాటలను ఆలపించిన తొలితరం సినీ నేపథ్యగాయని.. రావు బాల సరస్వతీదేవి (97) ఇక లేరు. లలిత సంగీత సామ్రాజ్ఞి. తేనెలూరే గళం, కోకిల స్వరంతో ఆణిముత్యాల్లాంటి పాటలను ఆలపించిన తొలితరం సినీ నేపథ్యగాయని. .**

ఆమె అసలు పేరు సరస్వతీదేవి. 1937లో వచ్చిన 'బాలయోగిని' చిత్రంలో ఆమె పేరును 'బాల సరస్వతీ దేవి'గా వేశారు. అప్పటి నుంచి అదే పేరు ఆమెకు స్థిరపడిపోయింది. సరస్వతీ దేవి తన నాల్గవ ఏటనే స్వస్థలం గుంటూరులో రత్నమహల్ థియేటర్ స్టేజి మీద పాటలు పాడారు. ఆరో ఏట హెచ్ఎంవీ గ్రామ్‌ఫోన్ రికార్డు కంపెనీ ద్వారా సోలోగా పాడి సంగీత ప్రియులను రంజింప జేశారు! దశాబ్దాల సినిమాల్లో తన అమృత గానంతో తెలుగు సినీ, సంగీత అభిమానుల హృదయాలలో చిరస్థానం సంపాదించుకున్నారు. కోలంక రాజాతో వివాహానంతరం 'రావు బాల సరస్వతి'గా మారారు. సరస్వతీ దేవి 1929 ఆగస్టు 29న మద్రాసులో.. తన అమ్మమ్మగారింట జన్మించారు. ఆమె తల్లిదండ్రులు విశాలాక్షి, పార్థసారధి దంపతులు. తండ్రి సొంతూరు గుంటూరు. సుప్రసిద్ధ సినీ నటి, దర్శకురాలు, నిర్మాత.. అయిన విజయ నిర్మల బాలసరస్వతికి స్వయానా మేనమామ కూతురు. రావు బాల సరస్వతీ దేవి తన తండ్రి ప్రోత్సాహంతో అలత్తూర్ సుబ్బయ్య వద్ద కర్ణాటక సంగీతం, ముంబైలోని వసంత దేశాయ్ దగ్గర హిందుస్తానీ సంగీతం నేర్చుకున్నారు. హెచ్ఎంవీ వారి రికార్డుల విన్న దర్శకుడు సి.పుల్లయ్య ఆమెకు 'సతీ అనసూయ' సినిమాలో అవకాశం ఇచ్చారు. తెలుగు సినిమాలతో పాటు తమిళ, కన్నడ, సింహళ భాషల్లో రెండువేలకుపైగా పాటలు పాడారు.

**ఆమె పాటతోనే ప్రారంభం..** మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో 1940లో లలిత సంగీతం బాలసరస్వతి పాటతోనే ప్రారంభమైంది. తర్వాత 1948లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం కూడా ఆమె గాత్రంతోనే శ్రోతలకు పరిచయమైంది. 1940-50ల మధ్య కాలంలో ఎస్.రాజేశ్వరరావుతో కలిసి ఆమె ఆలపించిన లలిత గీతాలు రేడియో, గ్రామ్‌ఫోన్ రికార్డుల ద్వారా తెలుగునాట మారు మోగాయి. కాని ఆమె ఆర్థిక ఇబ్బందులఎన్నో. ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్‌ను కలిసి తన కష్టాలను వివరించడంతో, హైదరాబాద్‌కు తరలి రావాల్సిందిగా ఆమెకు సూచించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయసహకారాలు అందిస్తానని మాటిచ్చారు. అలా 1995లో సరస్వతి కుటుంబంతో సహా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు మారారు. కానీ.. ఆమె వచ్చిన మూడు నెలలకే ఎన్టీఆర్ మరణించడంతో తమకు సాయం చేసేవారు లేక చాలా అవస్థ పడినట్టు ఓ సందర్భంలో బాలసరస్వతి చెప్పారు. తర్వాత జయలలిత సిఎంగా ఉన్నప్పుడు 'అన్నా' అవార్డుతో సత్కరించడంతో పాటు చెన్నైలో మూడు గదుల ఫ్లాటు, పదిలక్షల రూపాయల నగదును అందించారు. అలాగే ఏపీలోని గత ప్రభుత్వం పది లక్షల రూపాయల నగదుతో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసింది. ఇంకా మరెన్నో అవార్డులు, సత్కారాలు ఆమె అందుకున్నారు. ❑

# దేశంలోనే అగ్రశ్రేణి సంపన్నురాలు



ప్రపంచ వ్యాప్తంగా చర్చ ఉండే ధనవంతుల గురించి ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. ఆదాయాల పరంగా ఆస్తుల ఎవరు ఏ స్థానంలో ఉన్నారో తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందికి ఉంటుంది. ఈ విధంగానే పలు సంస్థలు ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కుబేరుల జాబితాను విడుదల చేస్తాయి. **తాజాగా హురున్ సంస్థ 'ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025'ను విడుదల చేసింది. ఇందులో హెచ్‌సీఎల్ అధినేత్రి రోష్నీ నాడార్ మల్హోత్రా దేశంలోనే ధనవంతురాలైన మహిళగా నిలిచారు. ఈ జాబితాలో ఒక మహిళ టాప్-3లో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం! అంతేకాదు.. టాప్ 10లోనూ రోష్నీ ఒక్కరే మహిళ కావడం మరో విశేషం! సుమారు రూ. 2.84 లక్షల కోట్ల సంపదతో ఈ జాబితాలో మహిళల అగ్రస్థానంలో నిలిచిన రోష్నీ గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం..**

సంపాదకురాలు... హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్, కిరణ్ నాడార్ గారాలపట్టి రోష్నీ (43). ఆమె 1982లో జన్మించారు. ఢిల్లీలోని వసంత్ వ్యాలీ స్కూల్లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఉన్నత విద్యను అభ్యసించడానికి అమెరికాకు వెళ్లిన ఆమె నార్త్‌వెస్ట్రన్ యూనివర్సిటీలో కమ్యూనికేషన్స్ డిగ్రీ పట్టా పొందారు. అదే యూనివర్సిటీకి చెందిన కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. రోష్నీ పలు ప్రతిష్ఠాత్మక గ్లోబల్ అడ్వైజరీ బోర్డుల్లో సభ్యురాలిగానూ కొనసాగుతున్నారు. ఇందులో ఎంఐటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన డీన్స్ అడ్వైజరీ కౌన్సిల్, అమెరికా-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ , ది నేచర్ కన్జర్వెన్సీలు ఉన్నాయి.

**అనుభవం వచ్చాకే..!** కుటుంబ పరంగా వ్యాపార సామ్రాజ్యం కొనసాగింపు చదువు పూర్తికాగానే తమ సంస్థల్లో భాగమవ్వాలనుకోలేదు. ఈ రంగంలో సొంతంగా అనుభవం గడించాకే కుటుంబ సంస్థలో చేరాలనుకున్నారు. అందుకు తండ్రి శివ్ నాడార్ కూడా మద్దతు తెలపడంతో మొదటగా సిఎన్‌బిసి, సిఎస్ఎన్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థల్లో ఇంటర్న్‌గా పనిచేశారు. ఆ తర్వాత లండన్‌లో స్కైన్యూస్‌లో న్యూస్ ప్రొడ్యూసర్‌గా విధులు నిర్వర్తించారు. కొంత అనుభవం గడించిన తర్వాత 2009లో హెచ్‌సీఎల్‌లో భాగమయ్యారు. ఏడాది కాలంలోనే తన ప్రతిభాపాటవాలతో ఎదిగిన ఆమె.. 27 ఏళ్ల వయసులో సంస్థకు సీఈవోగా నియమితులయ్యారు.

**నాన్న ఇచ్చిన బహుమతి..!** 2020లో సంస్థ ఛైర్మన్ పదవి నుంచి శివ్ నాడార్ వైదొలగడంతో ఆ బాధ్యతను రోష్నీ స్వీకరించారు. ఈ భారత్‌లో ఒక ఐటీ సంస్థకు అత్యున్నత స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించే మొదటి మహిళగా ఘనత సాధించారు. తనదైన వ్యూహ రచనతో హెచ్‌సీఎల్ సంస్థను లాభాల బాట పట్టిస్తూ.. దేశంలోనే ధనిక మహిళల్లో ఒకరిగా ఎదిగారు. ఈ ఏడాది 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా శివ్ నాడార్ హెచ్‌సీఎల్‌లోని తన 47 శాతం వాటాను రోష్నీకి బహుమతిగా ఇచ్చి.. ఆటు తన కూతురిపై ఉన్న ప్రేమను, ఇటు స్త్రీశక్తిని చాటారు. ఈ సమయంలో విడుదల చేసిన హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2025 జాబితాలో 40 బిలియన్ డాలర్ల సంపదతో రోష్నీకి 5వ స్థానం దక్కింది. ఇక తాజాగా విడుదల చేసిన 'ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025' జాబితాలో ఏకంగా అగ్రస్థానానికి ఎగబాకిన ఆమె.. సుమారు రూ. 2.84 కోట్ల సంపదతో దేశంలోనే శ్రీమంతురాలిగా నిలిచారు. ఇలా ఈ జాబితాలో ఒక టాప్3లో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం! అంతేకాదు.. టాప్10లోనూ రోష్నీ ఒక్కరే మహిళ కావడం మరో విశేషం! అలాగే గత కొన్నేళ్లుగా ఫోర్బ్స్, ఫార్చ్యూన్.. వంటి ప్రతిష్ఠాత్మక జాబితాలో చోటు దక్కించుకుంటూ ముందుకు దూసుకెళ్తున్న ఆమె.. ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం 'షెవలియర్ డె లా లీజియన్ డి హానర్'ను అందుకున్నారు.



**..సామాజిక సేవలోనూ..!** రోష్నీ సామాజిక సేవలోనూ ముందుంటారు. 'శివ్ నాడార్ ఫౌండేషన్' ద్వారా నెలకొల్పిన పలు విద్యాసంస్థల్లో ఎంతోమంది పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. వ్యాపారంలో ఎంత ఉన్నా సమయం దొరికితే ఫౌండేషన్ పనులను చూసుకుంటారామె. ఈ అవసరమైన పిల్లల అవసరాలు తెలుసుకోవడంతో పాటు వాళ్ల కోసం ఇంకా ఏమి చేయాలో ప్రణాళికలు వేసుకుంటారు. రోష్నీ పర్యావరణ ప్రేమికురాలు కూడా. 2018లో 'ది హాబిటాట్స్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసి వన్యప్రాణులను, వాటి ఆవాసాలను పరిరక్షించడానికి కృషి చేస్తున్నారు. అలాగే వన్యప్రాణి సంస్థలతోనూ కలిసి పనిచేస్తున్నారు. కోట్ల ఆస్తులు ఉన్నా రోష్నీ మాత్రం ఎప్పుడూ సింపుల్‌గానే కనిపిస్తారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని తన తండ్రి చెప్పిన సిద్ధాంతాన్నే పాటిస్తున్నానంటున్నారీ బిజినెస్ లేడీ. రోష్నీ తన సొల్యేట్ శిఖర్ మల్హోత్రాను 2010లో పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరూ ఏడేళ్ల స్నేహం చేసి ఒకరినొకరు అర్థం చేసుకున్నాక పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం శిఖర్ మల్హోత్రా సంస్థకు వైస్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఈ దంపతులకు అర్మాన్, జహాన్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇక ఈ 'ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025'లో నైకా వ్యవస్థాపకురాలు ఫల్గుణి నాయర్, బయోకాన్ ఫౌండర్ కిరణ్ మజుందార్ షా, అరిస్టా నెట్‌వర్క్స్ సిఇఓ-అధ్యక్షురాలు జయశ్రీ ఉల్లాల్, జోహో సహ-వ్యవస్థాపకురాలు రాధా వెంబు.. చోటు దక్కించుకున్నారు. ఓవైపు తమదైన వ్యాపార దక్షతతో తమ సంస్థల్ని లాభాల దిశగా పరుగులు పెట్టిస్తూనే.. మరోవైపు దేశ ఆర్థికాభివృద్ధిలోనూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. ❑

# అందానికి యాలకులు !

మిఠాయిలకు సువాసనలిచ్చే యాలకులు నోటి ఇన్ఫెక్షన్లను దూరం చేస్తున్నారు. ఆహారం జీర్ణమయ్యేలా చేయడంతోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలకూ చెక్ పెడతాయని తెలుసు. అందాన్నీ పెంచుతాయని తెలుసా?

స్పూను చొప్పున యాలకుల పొడి, పంచదార, తేనె తీసుకుని బాగా కలపాలి. దీన్ని ముఖానికి మృదువుగా రుద్ది, పదినిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. ఈ స్క్రాబ్ మృతకణాలను తొలగించడంతోపాటు చర్మానికి కావాల్సిన తేమని అందిస్తుంది. మాస్క్ ప్రయత్నించాలంటే స్పూను యాలకుల పొడికి చిటికెడు పసుపు, కొన్ని చుక్కల



నిమ్మరసం కలిపితే సరి. దీన్ని పావుగంటసేపు ముఖానికి రాసి, కడిగేయాలి. కప్పు రోజ్‌వాటర్‌ను స్పూను యాలకుల పొడి కలిపి, అరగంటసేపు నానబెట్టాలి. తరవాత వడకట్టి, స్ప్రే బాటిల్లో పోసు కోవాలి. దీన్ని ఫ్రిజ్‌లో ఉంచుకుంటే టోనర్లా పనిచేస్తుంది. యాలకుల్లో అక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్‌లో పోరాడి వృద్ధాప్యఛాయలు త్వరగా దరిచేరకుండా చూడటమే కాదు... అనేక చర్మసమస్యల నుంచి కాపాడతాయి. రక్తప్రసరణ మెరుగయ్యేలా చూస్తూనే చర్మకణాలకు న్యూట్రియంట్లు, ఆక్సిజన్ సరఫరా మెరుగయ్యేలా చేస్తుంది. ఇద్వారా యవ్వనవంతమైన చర్మం సొంతమయ్యేలా చూస్తాయి. ఎన్ని సుగుణాలో కదా... అలాగని చకచకా పూయడం మొదలు పెట్టేయొద్దు. ఇతర ఉత్పత్తుల్లాగే దీన్ని ముందు స్కిన్ టెస్ట్ చేసుకోండి. ఎర్రబడటం, దద్దుర్లు లేకపోతే... చక్కగా కొనసాగించండి. ❑

# పోట్లాటలు వీటిపైనే..

వాదనలు, పోట్లాటలు... దాదాపు ప్రతి ఇంట్లోనూ ఉంటాయి. ఇవి ఆలుమగల మధ్యనే కాదు, తల్లిదండ్రులూ, పిల్లల మధ్యా వస్తుంటాయి. ఇవి దేని గురించి ఉంటాయనేదానిపై అమెరికాలో ఓ పరిశోధన చేశారు. ఇంట్లో 4-17 ఏళ్ల మధ్య వయసు పిల్లలు ఒక్కరైనా ఉన్న 593 మంది తల్లిదండ్రులపైన ఈ అధ్యయనం చేశారు. కమ్యూనికేషన్ సరిగ్గా లేకపోవడమే ఆలుమగల మధ్య వాదనలకు ప్రధాన కారణమట. ఆపై వారి భావోద్వేగాలు, పిల్లల పెంపకం, ఇంటి పనులు, ఆర్థిక అంశాలు.. దోహద పడుతున్నాయి. గత యాభయ్యేళ్లలో ఎన్నో సంస్కృతి సంప్రదాయాలు, సాంకేతికంగా మార్పులు వచ్చినా దంపతుల మధ్య పోట్లాటలకు కారణాలు మాత్రం మారలేదట.



దీన్నిబట్టి భార్యాభర్తల అన్యోన్యతకు అవసరమయ్యే ప్రాథమిక అంశాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. అధ్యయనకర్తలు. తల్లిదండ్రులుటీనేజర్ల మధ్య చూస్తే... ఇంటి పనులు, గది శుభ్రత, సాంకేతిక అంశాలు, ఫోన్ వినియోగంపై వాదనలు ఉంటాయట. త్వరగా నిద్రకు ఉపక్రమించకపోవడం, నచ్చవంటూ ఆహారంలో కొన్నింటిని వదిలేయడం.. లాంటివి చిన్న పిల్లలతో వాదనలకు దారి తీస్తున్నాయట. చదువు, ఆర్థిక పరిస్థితి, వయసు.. లాంటివాటితో సంబంధం లేకుండా అన్ని ఇళ్లలోనూ ఇవి సాధారణంగా కనిపిస్తాయంటున్నారు. కుటుంబాలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే, ఇంట్లో పోట్లాటలు తగ్గి, బంధాలు మరింత దృఢమవుతా యంటున్నారు పరిశోధకులు. ❑

# బైఫేజిక్ స్లీప్ తెలుసా ?

24 గంటల్లో రెండు దఫాలుగా నిద్రపోవడం... పని ఒత్తిడి, ఆందోళన, అలసట, మార్పులూ మహిళల్లో నిద్రలేమికి మూలకారణం. రాత్రి పడక ముందే నిద్రకు ఉపక్రమించినా... నిద్ర పట్టేది మాత్రం ఏ పదకొండుకో, పన్నెండుకో... దీనివల్ల మహిళ అనారోగ్య సమస్యలు నానాటికీ చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. వీటినుంచి 'బైఫేజిక్' పరిష్కారం

'స్లీప్' విధానం అంటున్నారు నిపుణులు. సాధారణంగా మనం స్లీప్ మీద ఎక్కువగా ఆధారపడతాం కదా... అంటే 7-8 గంటలు నిద్రపోవడం కాకుండా బైఫేజిక్ స్లీప్ లో రెండు సార్లు నిద్రపోవాలి. కుదరకో, నిద్ర పట్టకో రాత్రి 5గంటలే నిద్ర పోతే మిగిలిన నిద్రను వీలున్న సమయంలో



వీలున్నప్పుడల్లా 60 నుంచి 90 నిమిషాలు నిద్రకు కేటాయించ మంటున్నారు. వీలులే నుంచి 20 నిమిషాలపాటు పవర్‌న్యాప్ ప్రయత్నించమంటు న్నారు. దీంతో ఒత్తిడి, అలసట తగ్గి... మానసిక సమస్యలు దరిచేరవట. చాలామంది ఇలా నిద్రపోయే వీలున్నా..నిద్రపట్టదు, చుట్టూ ఉన్న వారు ఏమనుకుంటారో, యజమాని తిడతారు లాంటి పనుల మీదకి ధ్యాస మళ్లించుకుంటారు. దీనివల్ల అలసట మరింత ఎక్కువ, చేసే నాణ్యత, ఉత్పాదకత తగ్గుతాయి. అతిగా కాకుండా ఇలా 60 నుంచి 90 నిమిషాల న్యాప్‌లు వేయడం మంచిదేనని నిపుణులు చెబుతున్నారు. పూర్తిచేయాలని చెప్పడమే అంటే మధ్యాహ్నమో, ప్రయాణాల్లోనో, పని విరామాల్లోనో చిన్నగా కునుకు తీయాలి. ❑

# 'మారథాన్'కు సిద్ధమవుతున్నారా?

ఈ రోజుల్లో చాలామంది ఆరోగ్యానికే మొదటి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో భాగంగానే వయసుతో సంబంధం లేకుండా జాగింగ్, రన్నింగ్.. ప్రస్తుతం చేస్తున్నారు. మరో అడుగు ముందుకేసి మారథాన్లలోనూ పాల్గొంటున్నారు. వీరిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. పరుగు వల్ల కేవలం శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయంటున్నారు నిపుణులు. అయితే మొదటిసారి మారథాన్‌లో పాల్గొనే వారు మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా గాయాలు పడకుండా ఉండొచ్చు. మరి ఆ జాగ్రత్తలేంటో తెలుసుకుందామా...?



**ఆరోగ్యంగా ఉన్నారా?** మారథాన్‌లో పాల్గొనే ముందు ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు లేకుండా ముఖం ముందు ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకోని, డాక్టర్ సలహాలు తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఇలా శారీరకంగా సిద్ధపడినప్పుడే గాయాలు పాలయ్యే ప్రమాదం తగ్గుతుందని అంటున్నారు.

**లక్ష్యాన్ని పెంచుకుంటూ..!** మొదటిసారి రన్నింగ్ చేసేవారు వేగంగా, తొందరగా లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తారు. ఫలితంగా మోకాళ్ల నొప్పులు, కండరాలు పట్టేయడం, కీళ్ల నొప్పులు.. వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే ముందు నుంచే మారథాన్కు సిద్ధం కావాలి. ఈ కోకకనే ప్రాక్టీస్ చేసేటప్పుడు.. ఒకేసారి లక్ష్యానికి గురిపెట్టకుండా.. కొద్దికొద్దిగా లక్ష్యాన్ని చేరుకునేలా సాధన చేయాలి. ఉదాహరణకు.. మొదటి వారంతం కిలోమీటర్ రన్నింగ్ సాధన చేస్తే.. రెండో వారం పాటు మరో కిలోమీటర్ కలుపుకొని రెండు కార్లు పరిగెత్తేలా ప్రాక్టీస్ చేయాలి. ఇలా వేగం పెంచుకుంటూ పోయినప్పుడు లక్ష్యసాధన సులభమవుతుందంటున్నారు.



నిపుణులు ఈ గాయాలు బారిన పడే అవకాశాలు తగ్గుతాయంటున్నారు.

**మారథాన్ సాధనలో భాగంగా..** రన్నింగ్ చేయడం వల్ల శరీరంలో ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయి. అందుకు తగ్గట్లుగా ఆహారం తీసుకుంటేనే శరీరం తిరిగి దృఢంగా, ఉత్సాహంగా మారుతుంది. కాబట్టి తీసుకునే ఆహారంలో మార్పులు చేర్పులు చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. ఈ కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫైబర్.. వంటి పోషకాలు ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేసుకోవాలంటున్నారు. అలాగే డీహైడ్రేషన్కి గురి కాకుండా ఉండేందుకు సరిపడినన్ని నీళ్లు తాగడం కూడా ముఖ్యమే!


**యోగా, ధ్యానం!** రన్నింగ్ చేసేటప్పుడు కేవలం శారీరకంగానే కాదు.. మానసికంగా దృఢంగా ఉండటం ముఖ్యం. ఈ అనుకూల మనసులో ప్రతికూల ఆలోచనలు రాకుండా జాగ్రత్తపడాలి. యోగా, వ్యాసం మేలు చేస్తుంది. అలాగే ఇతరులతో మాట్లాడేటప్పుడు కూడా సానుకూల అంశాలకే ప్రాధాన్యమివ్వాలి. అన్నీ మిమ్మల్ని మారథాన్కు అన్ని విధాలుగా సంసిద్ధం చేస్తాయి. ❑

# ఎవరి కర్మకు వారే బాధ్యులు

తన ఒక్కగానొక్క కుమారుడు పాము కాటుతో చనిపోవడంతో గౌతమి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. అప్పుడే ఒక బోయ వాడు అక్కడికి వచ్చాడు. అతేత సమ్మైన బాలుణ్ణి, ఆ మాతృమూర్తి దుఃఖాన్ని చూసి కదిలిపోయాడు. పొదల్లో దూరిన పామును తీసుకొచ్చి తల్లీ! నీ వేదనకు కారణమైన ఈ సర్పాన్ని చంపుతాను అన్నాడు. అంత బాధలోనూ పామును చంపటానికి గౌతమి అంగీకరించలేదు. ఆ మూగజీవిని సంహరించి నంతలో తన పుత్రుడు తిరిగిరాడు కదాని వదిలేయమంది. కానీ బోయ పట్టువదల కుండా 'ఈరోజు నీ కుమారుణ్ణి పొట్టన పెట్టుకున్న ఈ పాము రేపు ఇంకొకరిని కాటేస్తుంది. చంపాల్సిందే!' అన్నాడు. ఇంతలో ఆ పాము నేను కాటేసిన మాట నిజమే! కాని అది నా సంకల్పం కాదు. మృత్యువు నన్ను అలా ప్రేరేపించింది. బాలుడి మరణానికి నేను కారణం కాదు అంది. కాని మృత్యువు చేతిలో ఉపకరణం అయ్యావు! నిన్ను 'చంపాల్సిందే' అన్నాడు బోయ. ఆ క్షణం మృత్యుదేవత ప్రత్యక్షమై ఈ బాలుడి అకాల మరణానికి పాము కాదు, నేను కాదు. కాలపురుషుడే కారణం అంది. అప్పుడు కాలపురుషుడు ప్రత్యక్షమై "నాయనా! లోకంలో ఎవరి దుఃఖానికి మరొకరు కారణం కాదు. సుఖదుఃఖాలనేవి వారు చేసుకున్న కర్మల ఫలితాలు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా అందుకు వారే బాధ్యులు. ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు అని అదృశ్యమయ్యాడు. ఇది మహాభారతంలోని కథ. ❑

ఆధ్యాత్మికం

# గుమ్మడి హల్వా



కావలసిన పదార్థాలు

ఎర్ర గుమ్మడి తురుము: ఒక కప్పు, నెయ్యి: పావు కప్పు, పాలు: అర కప్పు, చక్కెర: అర కప్పు, యాలకుల పొడి: చిటికెడు, తరిగిన బాదం, కాజు: పావు కప్పు.

**తయారీ విధానం:** స్టవ్ మీద పాన్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి, బాగా వేడయ్యాక గుమ్మడి తురుమును జోడించాలి. దాన్ని సన్నటి మంటపై ఐదు నిమిషాలపాటు వేయించాలి. వేగిన గుమ్మడి మిశ్రమంలో పాలు పోసి మూత పెట్టి మరో రెండు నిమిషాలు ఉడికించాలి. చక్కెర, యాలకుల పొడి కలుపుతూ దగ్గర పడనివ్వాలి. స్టవ్ మీద మరోపాన్ పెట్టుకుని మిగతా నెయ్యి వేసి కాజు, బాదం వేయించి నెయ్యితో సహా గుమ్మడి మిశ్రమంలో వేయాలి. నెయ్యి పైకి తేలే వరకు వేయించి దించుకుంటే కమ్మని గుమ్మడి హల్వా సిద్ధం. ❑

# పిల్లలు గోళ్లు తెగ కొరుకుతున్నారా..

పిల్లలు కొందరు తెగ గోళ్లు కొరుకుతుంటారు. వారించినా వినరు. బెదిరిస్తే చాటుమాటుగా అయినా కొరికేస్తుంటారు. ఈ అలవాటును మాన్పించిన వారిలో కొందరి అనుసరణీయ చిట్కాలివి... వేడు రాసి, తినేసి ఇచ్చి... ఎలాగో తెలియదు కానీ మా పాపకి ఏడాదిన్నరకే గోళ్లు కొరకడం అలవాటైంది. గోరుచుట్టు చర్మాన్నీ వదిలేది కాదు.

ఎంత వారించినా వినదే! అందుకని కాకరకాయ, వేపాకు, కరక్కాయ రసాలు తీసి చేతులకు రాయడం మొదలు పెట్టా. ఆ చేదుకి వేళ్ల నోట్లో పెట్టుకోవడానికి వీలవ్వట్లేదని తెగ ఏడ్చేది. తరువాత మిల్లెట్స్, సజ్జలు, రాగులు, బెల్లం వంటివాటితో చేసిన చక్రాలు లాంటివి ఏదో ఒకటి చేతిలో ఉంచడం మొదలు పెట్టా. ఆధ్యయత్నంగా అయితే వాటిని నోట్లో పెట్టుకునేది. చక్రాలు లాంటివైతే తినేది కానీ వేళ్లో అన్నం తినడానికి భయపడేది... ఎక్కడ చేదు తగులునని! దీంతో స్పూను ఇచ్చి తినేలా చేశా. ఎలాగైతేనే ఆ చేదు భయంతో వేళ్లు పెట్టుకోవడం, గోళ్లు కొరకడం మాత్రం తగ్గాయి. ❑

### సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్‌లో

# భారత్ ఓటమి

### 2-4 తేడాతో ఆస్ట్రేలియా విజయం





**న్యూఢిల్లీ:** సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్-2025లో ఆస్ట్రేలియాపై భారత్ 2-4తేడాతో ఓటమి పాలైంది. మలేషియాలోని జోహోర్‌లో జరుగుతున్న జోహోర్ కప్‌లో భాగంగా గురువారం జరిగిన నాల్గవ పూల్‌స్టేజ్ మ్యాచ్‌లో భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు వైఫల్యం చెందింది. బ్లూ కోల్ట్స్ తరఫున భారత కెప్టెన్ రోహిత్ (22వ నిముషం), అర్ష్‌దీప్ సింగ్ (60) గోల్స్ చేయగా, ఆస్ట్రేలియా తరఫున ఆస్కార్ స్ర్పోల్ (39, 42), ఆండ్రూ పాట్రిక్ (40), కెప్టెన్ డిలాన్ డౌనీ (51) గోల్స్ చేశారు. మొదటి క్వార్టర్‌లో ఇరు జట్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. రెండవ క్వార్టర్‌లో భారత్ 17వ నిమిషంలో తొలి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, కానీ అన్మోల్ ఎక్కా ఫ్లిక్ గోల్ చేసి పోస్ట్‌ను దాటించాడు. 22వ నిమిషంలో భారత్ మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకున్నా కెప్టెన్ రోహిత్ (22) తక్కువ స్ట్రైక్‌తో నెట్‌లోకి వెళ్ళేలా విజయవంతంగా దానిని మలిచాడు. 25వ నిమిషంలో అమీర్ అలీ ఎడమ వైపు నుండి బలమైన సోలో పరుగు చేసి దూరం నుండి షాట్ తీయడంతో ఆధిక్యాన్ని పెంచే దశకు చేరుకున్నాడు. మూడో క్వార్టర్‌లో ఆస్ట్రేలియా వరుసగా మూడు గోల్స్ చేసి మ్యాచ్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 39వ నిమిషంలో మొదటిగోల్‌రాగా, ఆస్కార్ స్ర్పోల్ (39) గోల్ చేసి స్కోరును సమం చేశాడు. తర్వాత పెనాల్టీ కార్నర్ సమయంలో ఆండ్రూ పాట్రిక్ (40) గోల్ చేయడంతో ఆధిక్యంలోకి వెళ్లారు. ఆస్కార్ స్ర్పోల్ (42) రెండవ గోల్ చేయగా, బ్యాక్‌హ్యాండ్ స్ట్రైక్‌తో 49వ నిమిషంలో భారత్ పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, తర్వాత ఆస్ట్రేలియా ఐదవ పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుని డిలన్ డౌనీ గోల్‌గా చేసి ఆధిక్యాన్ని మరింత పెంచాడు. పోటీ చివరి నిమిషంలో, అర్ష్‌దీప్ సింగ్ గోల్‌లోకి నైపుణ్యంగా దూసుకెళ్లి భారత్ తరపున సాయంత్రం రెండవ గోల్ సాధించి మ్యాచ్‌ను ముగించాడు.

## డెన్మార్క్ ఓపెన్‌లో దూసుకెళ్లిన సాత్విక్, లక్ష్య



**న్యూఢిల్లీ:** డెన్మార్క్ ఓపెన్ 2025లో భారత్ షట్లర్స్ సాత్విక్ చిరాగ్, లక్ష్య సేన్ రెండో రౌండ్‌కు చేరుకున్నారు. ఒడెన్స్‌లో జరిగిన వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్ అయిన డెన్మార్క్ ఓపెన్ లో భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి బలమైన పునరాగమనం చేసి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఆరో సీడ్ ఆటగాడు ఒక సెట్ పరాజయం నుండి కోలుకుని స్కాట్లాండ్‌కు చెందిన క్రిస్టోఫర్ గ్రిమ్లీ మరియు మాథ్యూ గ్రిమ్లీలను 17-21, 21-11, 21-17 తేడాతో ఓడించి ఒక గంటా నాలుగు నిమిషాల పాటు కొనసాగాడు. తొలి సెట్‌ను 17-21 తేడాతో కోల్పోయిన భారత జంట, రెండో సెట్‌లో 8-4తో నాలుగు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, 21-11 స్కోరుతో ఆధిక్యాన్ని సంపాదించింది. మూడో సెట్ నిర్ణయాత్మకంగా మారింది. రెండు జట్లు 10 ఆల్‌తో సమానంగా తలపడ్డాయి. తర్వాత సాత్విక్-చిరాగ్ 18-12 ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. స్కాటిష్ జంట ఆలస్యంగా తిరిగి పోరాడినా, భారత ధీటుగా ఎదుర్కొని 21-17తో ముగించింది. కేవలం ఒక గంటలోనే పోటీని ముగించింది.

### ఆసియా పారా ఛాంపియన్‌షిప్..

# భవీనా ఓటమి

### పురుషుల సింగిల్స్‌లో 2 కాంస్యాలు







**న్యూఢిల్లీ:** ఆసియాపారా టిటి ఛాంపియన్‌షిప్-2025లో ఎనిమిది సార్లు పారాలింపిక్ ఛాంపియన్‌షిప్ చేతిలో భవీనా పటేల్ ఓడిపోయింది. చైనాలోని బీజింగ్‌లో గురువారం జరిగిన ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్యాడ్లర్ భావినా పటేల్ క్వార్టర్ ఫైనల్‌లో నిష్క్రమించి నిరాశపరిచింది. మహిళల సింగిల్స్ 4-5 విభాగంలో ఆమె 8 సార్లు పారాలింపిక్ ఛాంపియన్ చైనాకు చెందిన జాంగ్ బియాన్‌పై 11-8, 3-11, 8-11, 9-11 తేడాతో నాలుగు గేమ్‌ల పోటీలో ఓటమి పాలైంది. క్లాస్ 4 క్రీడాకారిణి అయిన భావినా, ఈ పోటీలో ఎంట్రీలు లేకపోవడంతో క్లాస్ 5 కేటగిరీతో కలపాల్సి వచ్చింది. ఆమె క్లాస్ 4 విభాగంలో టాప్‌సీడ్ అయినప్పటికీ, 5వ కేటగిరిలో పారిస్ పారాలింపిక్ ఛాంపియన్ అయిన జాంగ్ అనే కఠినమైన ప్రత్యర్థితో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ఎదుర్కొంది. మరోవైపు, జెహాన్ మదన్, సందీప్ డాంగి ఇద్దరూ సెమీఫైనల్‌కు చేరుకోవడంతో, పురుషుల సింగిల్స్ క్లాస్ 1 విభాగంలో భారత్ డబుల్ పోడియంను సాధించింది. వారు తమ గ్రూప్‌లో రెండవ స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. అయితే, వారు కొరియా ప్రత్యర్థుల చేతిలో సెమీఫైనల్స్‌లో ఓడిపోయారు, కానీ భారత్‌కు రెండు కాంస్య పతకాలను సాధించిపెట్టారు.




### డబ్ల్యుటిసి ఫైనల్స్‌లో పాక్‌తో భారత్

# మరోసారి బిగ్ ఫైట్

## మారుతున్న సమీకరణాలు

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యుటిసి) పాయింట్ల పట్టికలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. దీంతో ఫైనల్స్‌కు ఎవరు చేరుతారనేది ఉత్కంఠంగా మారింది. ఈసారి టైటిల్ మ్యాచ్‌లో భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య కీలక పోరుకు దారితీసే ఆసక్తికరమైన సమీకరణాలు చోటు చేసుకున్నాయి. 2025-27 డబ్ల్యుటిసిలో పాక్ దక్షిణాఫ్రికాతో తన తొలి విజయాన్ని నమోదు చేసింది. ఫలితంగా పాయింట్ల పట్టికలో పాకిస్తాన్ టీమ్ ఇండియాను అధిగమించి రెండవ స్థానానికి చేరుకుంది.

పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో, శ్రీలంక మూడవ, భారత్ నాల్గవ స్థానంలో ఉన్నాయి. ఇంగ్లాండ్ ఐదవ స్థానానికి పడిపోయింది. వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో విజయం సాధించిన తర్వాత, టీమ్ ఇండియా ఇప్పుడు స్వదేశంలో దక్షిణాఫ్రికా సవాలును ఎదుర్కోనుంది. భారత్ డబ్ల్యుటిసిలో ఆడటానికి ప్రస్తుతం 11 టెస్ట్ మ్యాచ్‌లు ఉన్నాయి. వీటిలో ఏడు స్వదేశంలో ఆడనుంది. దక్షిణాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్ నవంబర్ 14న ప్రారంభమవుతుంది. తర్వాత, రెండు టెస్ట్ ల కోసం ఆగస్టు 2026లో శ్రీలంక, అక్టోబర్, నవంబర్‌లో న్యూజిలాండ్‌లో పర్యటిస్తుంది. తదుపరి 2027 జనవరి, ఫిబ్రవరిలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల సిరీస్ ఆడుతుంది. ఇలా టీం ఇండియా స్వదేశంలో ఏడు టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతుంది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లే టీం ఇండియా ఫైనల్‌కు చేరుకోవడానికి ఒక అవకాశంగా మారనున్నాయి. పాకిస్తాన్‌కు సంబంధించి దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ మ్యాచ్ గెలిచిన తర్వాత, 12 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. వీటిలో 5 మ్యాచ్‌లు స్వదేశంలో, 7 విదేశీ గడ్డపై జరుగుతాయి. అక్టోబర్ 20న దక్షిణాఫ్రికాతో రెండవ టెస్ట్ తర్వాత, పాక్ నవంబర్ 2026లో స్వదేశంలో శ్రీలంకతో రెండు టెస్ట్‌లు, మార్చి 2027లో న్యూజిలాండ్‌తోను, ఇక మార్చి 2026లో బంగ్లాదేశ్, జూలై, ఆగస్టులో వెస్టిండీస్‌కు, సెప్టెంబర్ లో మూడు టెస్ట్ కోసం ఇంగ్లాండ్‌లో పర్యటిస్తుంది. బంగ్లాదేశ్, వెస్టిండీస్‌లతో పాకిస్తాన్ సిరీస్ సులభం కావచ్చు. అయితే, స్వదేశంలో, పాకిస్తాన్ అన్ని ఐదు టెస్ట్ మ్యాచ్‌లను ఎలాగైనా గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంటుంది. ఈ పరిస్థితుల్లో ఈసారి డబ్ల్యుటిసి చివరి మ్యాచ్ భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతుందని భావిస్తున్నారు.

### టెస్ట్ ర్యాంకింగ్స్‌లో

## మెరుగుపడ్డ జైస్వాల్, కుల్దీప్

**న్యూఢిల్లీ:** రెడ్‌బాల్ క్రికెట్‌లో భారత్ ఆధిపత్యం తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ప్రతిబింబిస్తూనే ఉంది, వెస్టిండీస్‌పై 2-0 టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన తర్వాత యశస్వి జైస్వాల్, కుల్దీప్ యాదవ్ గణనీయమైన లాభాలను సాధించారు. టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో జైస్వాల్ రెండు స్థానాలు మెరుగుపడి ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్ తర్వాత ఐదవ స్థానానికి చేరుకున్నాడు, కరేబియన్ జట్టుపై బంతితో తన అద్భుత ప్రదర్శన కారణంగా కుల్దీప్ ఏడు స్థానాలు మెరుగుపడి టెస్ట్ బౌలర్లలో 14వ స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ 34 స్థానాలు దాటి 66కు, సెంచరీ మేకర్ జాన్ కాంప్‌బెల్ టెస్ట్ బ్యాటింగ్ జాబితాలో ఆరు ఎగబాకి 68వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్లలో జోమెల్ వారికన్ రెండు పైకి ఎక్కి 30వ స్థానానికి చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌పై 3-0 సిరీస్‌ను ఆఫ్ఘనిస్తాన్ కైవసం చేసుకున్న తర్వాత రషీద్ ఖాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్ ఇద్దరూ తమ తమ విభాగాలలో నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఒమర్జాయ్ ఒక స్థానం మెరుగుపరుచుకుని జింబాబ్వేకు చెందిన సికందర్ రాజాను నంబర్ 1 వన్డే ఆల్ రౌండర్‌గా నిలబెట్టాడు. రషీద్ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో రెండు ఎగబాకి నాల్గవ స్థానానికి చేరుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైన ఇబ్రహీం జాద్రాన్, ఆఫ్ఘనిస్తాన్ తరఫున బ్యాటింగ్ చార్టులలో ఎనిమిది ఎగబాకి రెండవ స్థానానికి చేరుకున్నాడు. ఇప్పుడు నంబర్ 1 స్థానంలో కొనసాగుతున్న భారత్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ కంటే కేవలం 20 రేటింగ్ పాయింట్లు వెనుకబడి ఉన్నాడు.

## ఇన్ఫోసిస్ నికరలాభం రూ.7364 కోట్లు!




**బెంగళూరు, అక్టోబరు 16:** ఐటిసేవల దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్ రెండోత్రైమాసికంలో నికరలాభం 13శాతంపెరిగి 7364 కోట్లు నమోదుచేసింది. దీనితో కంపెనీ కూడా ప్రతి షేరుకు రూ.23 డివిడెండ్‌ను ప్రకటించింది. ఈనెల 27వ తేదీ రికార్డు తేదీగాను, చెల్లింపులతేదీ నవంబరు ఏడోతేదీగానుప్రకటించింది. ఈత్రైమాసికంలో రాబడులు 8.6శాతం పెరిగి 44,490 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు త్రైమాసికంలో 40,986 కోట్లనుంచి గణనీయంగా పెంచుకోగలిగింది. కంపెనీనుంచి ఉద్యోగులు వీడిపోవడం మాత్రం కొంతపెరిగింది.

గత ఏడాది ఇదే త్రైమాసికంలో 12.9శాతం ఉంటేఈ ఏడాది రెండోత్రైమాసికంలో 14.3శాతంగా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ భారీ డీల్స్ 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రెండో త్రైమాసికంలో భారీ డీల్స్ సాధించామని, 67శాతం కొత్త కాంట్రాక్టులే ఉన్నాయని సిఇఒ సలీల్‌పరేఖ్ అన్నారు. క్లయింట్ల ప్రాధాన్యతలకు అనుగుణంగా కృత్రిమ మేథ వాతావరణంలో గణనీయమైన సేవలు అందించినట్లు చెప్పారు. కంపెనీ ప్రనతి షేరుకు రాబడులు 17.76 రూపాయలుగా ఉంది. స్వేఛ్ఛాయుత నగదు ఈ త్రైమాసికంలో 9677 కోట్లుగా ఉంది. సెప్టెంబరులోనే కంపెనీ 18 వేల కోట్ల షేర్ బైబాక్‌ను కూడా ప్రకటించింది. బిఎస్‌ఇలో ఇన్ఫోసిస్ షేర్లు స్వల్పంగా క్షీణించాయి. 0.08శాతంగా నమోదయి 1472.75గా ట్రేడ్ అయింది.

# ఆకాశాన్ని తాకుతున్న బంగారం, వెండి



**ముంబయి, అక్టోబరు 16:** బంగారం, వెండి ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గురువారం ట్రేడింగ్‌లో పసిడి, వెండి ధరలు సరికొత్త ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో పసిడికి డిమాండ్ అమాంతం పెరిగి ధరలు చుక్కలనంటాయి. దేశీయ మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం డిసెంబర్ ఫ్యూచర్స్ ధర ఏకంగా రూ. 1,200 మేర పెరిగి, 10 గ్రాములు రూ. 1,28,395 వద్ద సరికొత్త జీవనకాల గరిష్టాన్ని నమోదు చేసింది. వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. ఎంసీఎక్స్ సిల్వర్ డిసెంబర్ ఫ్యూచర్స్ ధర కెజికి రూ. 1,900కు పైగా పెరిగి, రూ. 1,64,150 వద్ద కొత్త రికార్డు సృష్టించింది. ఉదయం ట్రేడింగ్‌లో 10 గ్రాముల బంగారం ధర 0.60 శాతం లాభంతో రూ. 1,27,960 వద్ద, కేజీ వెండి ధర 1 శాతం లాభంతో రూ. 1,63,812 వద్ద ట్రేడ్ అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తపరిస్థితులు, అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గుతాయన్న అంచనాలు, డాలర్ బలహీనపడటం వంటి అంశాలు బంగారం, వెండి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ముఖ్యంగా, చైనా ఇటీవల రేర్‌ఎర్త్ మెటీరియల్స్ ఎగుమతులపై ఆంక్షలను మరింత కఠినతరం చేసింది. చైనా చర్యలను అమెరికా అధికారులు తీవ్రంగా విమర్శించడమే కాకుండా, ప్రతీకార చర్యలు ఉంటాయని సంకేతాలిచ్చారు. ఈ పరిణామాలు ప్రపంచ సరఫరా వ్యవస్థకు ముప్పుగా మారడంతో పెట్టుబడిదారులు బంగారం కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. అమెరికా డాలర్ ఇండెక్స్ 0.1 శాతం తగ్గి, వారం రోజుల కనిష్టానికి చేరడం కూడా పసిడికి కలిసొచ్చింది. డాలర్ బలహీనపడటంతో ఇతర కరెన్సీలలో బంగారం ధరలు చౌకగా మారతాయి. దీంతో విదేశీ ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ పెరుగుతుంది. ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర ఏకంగా 61 శాతం పెరగడం గమనార్హం. అమెరికాలో షట్‌డౌన్ కొనసాగితే ఈ వారం విడుదల కావాల్సిన ద్రవ్యోల్బణం, రిటైల్ అమ్మకాల వంటి కీలకమైన ఆర్థిక డేటా వాయిదా పడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# 16వేల మందికి నెస్లే ఉద్వాసన




**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్యాకేజ్డ్ ఫుడ్ సంస్థ నెస్లే ఊహించని షాక్ ఇచ్చింది. ఈ ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ కంపెనీ ఉద్యోగుల తొలగింపులు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఒకేసారి ఏకంగా 16000 మంది ఉద్యోగులను తొలగించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఉద్యోగాల కోతలపై నెస్లే సిఇఒ ఫిలిప్ నవ్రాటిల్ గురువారం స్పందిస్తూ వచ్చే రెండేళ్ల కాలానికి ఈ తొలగింపులు ఉంటాయన్నారు. మొత్తంగా 16 వేల మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం. ప్రపంచం మారుతోంది. అందుకు తగినట్లుగా నెస్లే కంపెనీ వేగంగా మారాల్సి ఉంది. ఇది కఠినమైన నిర్ణయమే అయినా ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడం అనేది ఆ మార్పులో ఒక భాగమే అని ఒక ప్రకటనలో సిఇఒ ఫిలిప్ నవ్రాటిల్ ప్రకటించారు. ఉత్పత్తి, సరఫరా విభాగాల్లో ఇప్పటికే 4 వేల మందిని తొలగించే ప్రాసెస్ మొదలైనట్లు చెప్పారు. వారితో పాటుగా మరో 12000 మంది వైట్ కాలర్ ఉద్యోగులను ఈలేఆఫ్స్‌లో భాగంగా తొలగిస్తామన్నారు. ఈ లేఆఫ్స్ వల్ల కంపెనీకి ఒక బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ ఆదా అవుతాయని చెప్పారు. 2027 సంవత్సరం నాటికి నెస్లే తమ పొదుపు లక్ష్యాన్ని 3 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎఫ్‌ఎంసీజీ సెక్టార్‌లోని ఈ స్విస్ కంపెనీ 2000 బ్రాండ్లను కలిగి ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో నాయకత్వ అస్థిరత సమస్యను ఎదుర్కొంది. తన సబార్డినేట్‌తో ప్రేమ వ్యవహారం నడిపించిన ఆరోపణలతో లారెంట్ ఫ్రీక్సే సిఇఒ పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. ఇది కంపెనీ రూల్స్‌కి విరుద్ధమని నెస్లే కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఆయన్ను తక్షణం ఉద్యోగం నుంచి తొలగించామని తెలిపింది. తమ విలువలు కంపెనీకి బలమైన పునాదులుగా ఆ సంస్థ ఛైర్మన్ పాల్ బుల్కే ఈ సందర్భంగా తెలిపారు. తర్వాత పాల్ సైతం తన పదవి నుంచి తప్పుకున్నారు. తన పదవీ కాలం ముగియక ముందే ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది.

## రెండోరోజు లాభాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

### మార్కెట్లకు బ్యాంకింగ్, ఎన్బీఎఫ్‌సిల మద్దతు

**ముంబయి, అక్టోబరు 16:** ఈక్విటీసూచీలు వరుసగా రెండోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. ఎంపిక చేసిన స్టాక్స్‌లో భారీ కొనుగోళ్లకుతోడు రెండోత్రైమాసిక ఫలితాలు కూడా మార్కెట్లకు మద్దతిచ్చాయి. వీటికితోడు విదేశీ ఫండ్‌లరాక మరింతగా పెరిగింది. బ్యాంకింగ్; ఎఫ్‌ఎంసిజి కౌంటర్లలో కొనుగోళ్లు భారీగా ఉన్నాయి. ముడిచమురుదరలు కూడా కొంతమేర సడలింపులు కనిపించాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మెంట్లలో కూడా వృద్ధినమోదయింది. బిఎస్‌ఇ స్మాల్‌క్యాప్ 0.47శాతం, మిడ్‌క్యాప్‌సూచీ 0.29శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 2378 కంపెనీలషేర్లు పెరిగితే 1809 కంపెనీల షేర్లు క్షీణించాయి. 151 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. రిలయన్స్ 1.69శాతం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.54శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.34శాతం మేరపెరిగాయి. భారత్ పదేళ్ల బాండ్లపేపర్ 0.17 శాతం పెరిగి 6.495గా నిలిచింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి కొంతమేర పెరిగింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 87.85గా నడిచింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు ఐదు నాటికి 0.78శాతంగా ఉంది.



### అమెరికా మార్కెట్‌లో కుప్పకూలిన

# భారత్ ఎగుమతులు!

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** అమెరికా మార్కెట్‌లో భారత ఎగుమతులు పెనుసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వాషింగ్టన్ ప్రభుత్వం భారత వస్తువులపై 50 శాతం మేర భారీ సుంకాలను విధించడంతో కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే అమెరికాకు మన ఎగుమతులు 37.5 శాతం మేర కుప్పకూలాయి. ఈ ఆందోళనకర విషయాన్ని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. జీటీఆర్ఐ గణాంకాల ప్రకారం ఈ ఏడాది మే 2025 నుంచి సెప్టెంబర్ 2025 మధ్య కాలంలో అమెరికాకు భారత ఎగుమతులు తీవ్రంగా పడిపోయాయి. మేనెలలో 8.8 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, సెప్టెంబర్ నాటికి 5.5 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఈ నాలుగు నెలల్లోనే నెలవారీ ఎగుమతుల విలువలో భారత్ ఏకంగా 3.3 బిలియన్ డాలర్లను కోల్పోయింది. వరుసగా నాలుగు నెలల పాటు ఎగుమతులు క్షీణించడం ఇదే తొలిసారి. అమెరికా విధించిన 50 శాతం సుంకాలు పూర్తిగాఅమల్లోకి వచ్చిన తర్వాత, సెప్టెంబర్ నెలలో అత్యంత తీవ్రమైన ప్రభావం కనిపించింది. ఆగస్టులో 6.87 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, సెప్టెంబర్‌లో ఏకంగా 20.3 శాతంతగ్గి 5.5 బిలియన్ డాలర్లకు చేరాయి. 2025లో ఒకే నెలలో ఇంతటి భారీ పతనం నమోదు కావడం ఇదే మొదటిసారి అని నివేదిక స్పష్టం చేసింది. ఈ సుంకాల ప్రభావం ముఖ్యంగా టెక్స్‌టైల్, జెమ్స్ అండ్ జువెలరీ, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలవంటి కీలక రంగాలపై పడింది. ఈ రంగాల నుంచి ఎగుమతులు భారీగా పడిపోవడంతో మొత్తంఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, అమెరికా వంటి అతిపెద్ద మార్కెట్‌లో భారత తయారీ, ఎగుమతిరంగాల పోటీతత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాషింగ్టన్ విధించినసుంకాలే ఈ పతనానికి ప్రత్యక్ష కారణమని స్పష్టంచేసిన జిటిఆర్ఐ, భారత వాణిజ్య ప్రయోజనాలను కాపాడుకోవడానికి తక్షణమే విధానపరమైన సమీక్ష చేపట్టాలని సూచించింది.

# ధరల పెరుగుదలతో గోల్డ్‌బాండ్లకు భారీ రిటర్నులు!




**ముంబయి,అక్టోబరు 16:** బంగారం ధరలు పెరుగుతున్న కొద్దీ వాటిపై లాభాలు కూడా భారీగానే వస్తున్నాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఇటిఎఫ్, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటిల్లో పెట్టుబడులు పెడుతున్నారు. తద్వారా మంచి లాభాలు పొందుతున్నారని చెప్పొచ్చు. ఇక బంగారంపై పెట్టుబడులు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గతంలో సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల రుణ భారం నేపథ్యంలో కొత్తగా పలు విడతలను జారీ చేయట్లేదు. గతంలో ఇష్యూ చేసిన వాటికి సంబంధించి టెన్యూర్ ముగిసే వరకు కొనసాగించనుంది. సాధారణంగా గోల్డ్ బాండ్ల పరిమితి 8 సంవత్సరాలుగా ఉంటుంది.

ఇక్కడ ఐదేళ్లు దాటిన తర్వాత ముందుగా విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇక్కడ ఒక్కో యూనిట్‌ను ఒక్కో గ్రాముగా పేర్కొంటారు. కనీసం గ్రాము నుంచి గరిష్ఠంగా 4 కిలోల వరకు కొనుగోలు చేయొచ్చు. బంగారం ధర పెరుగుతున్న కొద్దీ.. నేరుగా లాభం వస్తుందని చెప్పొచ్చు. ఇంకా వడ్డీ కూడా చెల్లిస్తుంది. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్బీఐ ఈ గోల్డ్ బాండ్లను జారీ చేసింది. ఇండియన్ బులియన్ జువెల్లర్స్ అసోసియేషన్ ఇష్యూ డేట్, రిడెంప్షన్ డేట్ ముందు 3 రోజుల సగటు ధర ఆధారంగా ఇష్యూ ధర, రిడెంప్షన్ ధర ప్రకటిస్తుంటుంది.ఇప్పుడు 2017-18 సిరీస్ గోల్డ్ బాండ్ స్కీమ్ రిడెంప్షన్ ధరను ఆర్బీఐ ప్రకటించింది. ఈనెల 16 నుంచే రిడీమ్ చేసుకోవచ్చని ఆర్బీఐ ఒక సర్క్యులర్ విడుదల చేసింది. దీనిని 2017, అక్టోబర్ 16న ఇష్యూ చేయగా సరిగ్గా 8 ఏళ్లకు రిడెంప్షన్ డేట్‌గా ప్రకటించింది. ఇక్కడ బంగారం ధర పెరుగుదలకు అదనంగా 2.50 శాతం చొప్పున వడ్డీ కూడా చెల్లిస్తుంది. ఈ గోల్డ్ బాండ్ల ఇష్యూ ధర గ్రాముకు అప్పట్లో రూ. 2,866 గా ప్రకటించింది. ఇక్కడ ఆన్‌లైన్‌లో అప్లై చేసి డిజిటల్ పేమెంట్ చేస్తే రూ. 50 డిస్కౌంట్ వస్తుంది. అప్పుడు ఇష్యూ ధర రూ. 2,816గానే ఉంటుంది. ఇప్పుడు చూస్తే రిడెంప్షన్ ధర ఏకంగా రూ. 12,567 గా ఉంది. ఇక్కడ చూస్తే గ్రాముకే రూ. 9,751 చొప్పున లాభం వచ్చింది. ఇంకా వడ్డీ అదనం అని చెప్పొచ్చు. దీంతో ఏకంగా 346 శాతం రిటర్న్లు రావడం విశేషం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.